అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

మంగళవారం 15-10-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 286 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50



అర్థశాస్త్రంలో ముగ్గురికి నోబెల్

13లో

దేశాల మధ్య సంపదలో అసమానతలపై పరిశోధన

డారెన్ ఏస్‌మోగ్లు, సైమన్ జాన్సన్, జేమ్స్ ఎ. రాబిన్‌సన్ అవార్డు



డీవోపీటీ ఉత్తర్వులు రద్దు చేయండి

క్యాట్‌లో ఐఏఎస్‌ల పిటిషన్లు

నేడు విచారణ 13లో

ఎందుకీ హైరానా?

29తో ముగుస్తున్న ఈఆర్సీ పాలకమండలి పదవీకాలం

- ఆలోపే కీలక ప్రతిపాదనలపై ఉత్తర్వులు ఇవ్వాలని ఉబలాటం
- తొందరపాటు నిర్ణయాలతో అనర్థాలు
- ఈఆర్సీ తీరుపై ఆక్షేపణలు



ఎస్ఎస్ఆర్ శాస్త్రి

సకాలంలో లభించని న్యాయం న్యాయమే కాదంటారు న్యాయ నిపుణులు. అలాగే స్పందించాల్సిన సమయంలో మౌనంగా ఉండటం కూడా తప్పిదమే! ఇప్పుడు ఈ రెండు చర్యలు తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ)కి సరిగ్గా వర్తిస్తాయని విద్యుత్‌రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈఆర్సీ పాలకమండలి పదవీకాలం ఈనెల 29తో ముగుస్తున్నది. దానితో తమ వద్ద ఉన్న అన్ని పెండింగ్ ఫైళ్లను దుమ్ముదులిపి ఆర్డర్లు ఇచ్చేయాలని భావిస్తున్నది. దానిలో భాగంగానే విద్యుత్ సంస్థలకు చెందిన బహిరంగ విచారణలు అన్నింటినీ ఈనెల 25వ తేదీలోపు ముగించేసి, ఉత్తర్వులు ఇవ్వాలని నిర్ణయించారు. గతంలో ఏండ్ల తరబడి డిస్కంలు వార్షిక ఆదాయ అవసరాల ప్రతిపాదనల్ని (ఏఆర్ఆర్) ఈఆర్సీకి సమర్పించకున్నా, సైలెంట్‌గా ఉన్న పాలకమండలి, ఇప్పుడు మాత్రం ఆఘమేఘాల మీద పెండింగ్ ఫిర్యాదులన్నింటికీ పరిష్కారాలు చూపాలని ఉవ్విళ్లూరడం పలు సందేహాలకు తావిస్తున్నది. ఈనెల 5వ తేదీ జరిగిన రాష్ట్ర విద్యుత్ సలహా కమిటీ (పీఏసీ) సమావేశంలో ఇలాంటి తొందరపాటు నిర్ణయాలు వద్దనే అభిప్రాయాలు వ్యక్తం అయినా, ఈఆర్సీ చైర్మెన్ తన్నీరు శ్రీరంగారావు, సభ్యులు ఎమ్‌డీ మనోహరరాజు (టెక్నికల్), బండారు కృష్ణయ్య (ఫైనాన్స్) పట్టించుకోలేదు. విద్యుత్ సంస్థలు ఇచ్చిన ప్రతిపాదనల్ని చదివి అర్థం చేసుకొనే సమయం కూడా లేదనీ, అభ్యంతరాల స్వీకరణ గడువును పొడిగించాలని కోరినా...అది సాధ్యం కాదని పాలకమండలి స్పష్టం చేసేసింది. దీనితో అరకొర సమాచారంతోనే నిర్ణీత గడువులోపు విద్యుత్ వినియోగదారులు తమ అభ్యంతరాలను ఈఆర్సీకి సమర్పిస్తున్నారు. ప్రస్తుత పాలకమండలి బీఆర్ఎస్ ప్రభుత్వహయాంలో ఏర్పాటు అయ్యింది. 2019 అక్టోబర్ 30న కమిషన్ చైర్మెన్‌తో పాటు ఇద్దరు సభ్యుల నియామకం జరిగింది. గతంలో ఇదే కమిషన్ ఎదుట ప్రస్తుత ముఖ్యమంత్రి, అప్పటి పీసీసీ అధ్యక్షులు ఏ రేవంత్‌రెడ్డి బహిరంగ విచారణల్లో పాల్గొని, విద్యుత్ సంస్థల్లో చైర్మెన్లు, డైరెక్టర్లుగా రిటైర్డ్ ఉద్యోగుల నియామకంతో పాటు ఈఆర్సీ పాలకమండలి ఏర్పాటు, నిర్ణయాలను కూడా తప్పుపట్టిన విషయం తెలిసిందే. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం (200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు)పై ఈఆర్సీ ఇచ్చిన ఉత్తర్వులను సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగంగానే తప్పుపట్టారు. డిస్కంలకు ప్రతినెలా ప్రభుత్వం ముందస్తుగా డబ్బు చెల్లించి, ఆ తర్వాత గృహజ్యోతి పథకాన్ని అమలు చేసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి ఫైర్ అయ్యారు. గత ప్రభుత్వ వాసనలు ఇంకా అక్కడక్కడా ఉన్నాయనీ, పదేండ్లలో ఇలాంటి ఆర్డర్లు ఎందుకు ఇవ్వలేదని ఈఆర్సీని సూటిగా ప్రశ్నించారు. దీనిపై ఆ తర్వాత కమిషన్ వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. ఈఆర్సీ కార్యాలయం లక్డీకపూల్‌లోని సింగరేణి భవన్‌లో ఉండేది. విద్యుత్ నియంత్రణ్ భవన్ పేరుతో కళ్యాణ్‌నగర్‌లోని జీఎస్టీ కాలనీ సర్వే నెంబర్-145లో సొంత భవనాన్ని నిర్మించారు. అధికారికంగా ఈ భవన ప్రారంభోత్సవం కూడా జరగలేదు. హడావిడిగా కార్యాలయాన్ని సింగరేణి భవన్ నుంచి జీఎస్టీ కాలనీకి మార్చేశారు. అక్కడి నుంచే కమిషన్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. కమిషన్‌కు, ప్రస్తుత ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డితో సఖ్యత లేకపోవడం వల్లే అధికారిక భవన ప్రారంభోత్సవం నిలిచిపోయిందనే ప్రచారం జరుగుతున్నది. ఇటీవల జరిగిన పీఏసీ సమావేశంలో 'తర్వాత వచ్చే కమిషన్ నిర్ణయాలు తీసుకుంటుందనీ, హడావిడిగా బహిరంగ విచారణలు నిర్వహించి, ఆర్డర్లు ఇవ్వవద్దు' అని పలువురు విద్యుత్‌రంగ నిపుణులు సూచించారు. అయినా కమిషన్ తన నిర్ణయాన్ని మార్చుకొనేందుకు సిద్ధపడలేదు. విద్యుత్ సంస్థలు నిర్ణీత గడువుకన్నా ఆలస్యంగా ఫైల్ చేసిన పిటీషన్లకు పెనాల్టీలు విధించి, వాటిని విచారణకు స్వీకరించడం చర్చనీయాంశంగా మారింది. ఇది సరైన నిర్ణయం కాదని చెప్తే, పెనాల్టీలు విధించామని సమర్ధించుకొనేందుకే ఈ తరహా నిర్ణయాలు తీసుకుంటున్నారనే ప్రచారమూ జరుగుతున్నది.

ఇవీ విచారణలు..

- టీజీ జెన్‌కో, టీజీ డిస్కంల మధ్య 2019 సెప్టెంబర్ 17 నాటి విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను(పీపీఏ) పొడిగించేందుకు ఇచ్చిన ప్రతిపాదనలపై ఈనెల 18వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు అభ్యంతరాలను తెలపాలని కమిషన్ నోటిఫికేషన్ ఇచ్చింది. రామగుండం థర్మల్ స్టేషన్-బీ (62.5 మెగావాట్లు) ఒప్పంద కాలపరిమితిని 2024 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2024 జూన్ 3వ తేదీ వరకు (మూడు నెలలు) పొడిగించాలని ప్రతిపాదించారు. అలాగే కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ యూనిట్-5 (500 మెగావాట్లు) పీపీఏను 2024 ఏప్రిల్ 1 నుంచి 2029 మార్చి 31 వరకు పొడిగించాలని ప్రతిపాదించారు. సకాలంలో ఈ పీపీఏల గడువు పొడిగింపు కోసం డిస్కంలు దరఖాస్తు చేయలేదు. గడచిపోయిన కాలానికి సంబంధించి ఇప్పుడు ప్రతిపాదనలు పెట్టడం, దాన్ని ఈఆర్సీ స్వీకరించడం గమనార్హం.
- 2022-2023 ఆర్థిక సంవత్సర ట్రూఅప్ చార్జీలకు సంబంధించి టీజీ జెన్‌కో ఈఆర్సీకి ప్రతిపాదనలు పంపింది. దానితోపాటే 2024-25 నుంచి 2028-29 వరకు మల్టీ ఇయర్ టారిఫ్ (ఎమ్‌వైటీ) ఖరారు కోసం కూడా ప్రతిపాదనలు చేసింది. వీటిపై అభ్యంతరాలు, సలహాలు, సూచనల స్వీకరణ కు చివరి తేదీని ఈ నెల 11వ తేదీగా ఈఆర్సీ నిర్ధారించింది. దీనిపై ఈనెల 21వ తేదీ బహిరంగ విచారణ నిర్వహిస్తామని పేర్కొంది.
- కోఆపరేటివ్ ఎలక్ట్రిక్ సప్లరు సొసైటీ (సీఈఎస్ఎస్) సిరిసిల్లకు సంబంధించిన ఏఆర్ఆర్‌లు, 2024-25 నుంచి 2028-29 వరకు బహుళ సంవత్సరాల టారిఫ్ (ఎమ్‌వైటీ) ప్రతిపాదనలపై అభ్యంతరాలు, సూచనల స్వీకరణకు ...6లో



సాయిబాబాకు అంతిమ వీడ్కోలు

దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలొచ్చిన అభిమానులు

- బోయగూడ నుంచి గాంధీ ఆస్పత్రి వరకు ప్రదర్శన
- గాంధీ మెడికల్ కాలేజీకి భౌతికకాయం అప్పగింత
- ఆయన మరణం ప్రజాస్వామ్యానికి తీరనిలోటు : సీపీఐ(ఎం) కేంద్రకమిటీ సభ్యులు మురళీధరన్
- కేంద్రమే హత్య చేసింది : ఎస్ వీరయ్య
- మృతిపై విచారణకు సుప్రీంకు లేఖ రాస్తా : నారాయణ



(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం రాత్రి కన్నుమూసిన ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్, మానవ హక్కుల ఉద్యమ నేత ప్రొ.సాయిబాబాకు రాజకీయ పార్టీలు, ప్రజా, విద్యార్థి సంఘాల నేతలు, విద్యావేత్తలు ఘనంగా నివాళులర్పించారు. సోమవారం ఉదయం సాయిబాబా భౌతికకాయాన్ని ఆయన కుటుంబ సభ్యులు, ఉద్యమకారులు నిమ్స్ నుంచి గన్ పార్క్ వద్దకు తీసుకురాగా పోలీసులు లోనికి అనుమతించలేదు. అప్పటికే అక్కడికి చేరుకున్న ఆయన అభిమానులు అంబులెన్స్‌లోనే సాయిబాబా భౌతికకాయానికి నివాళులర్పించారు. గన్‌పార్కు వద్ద ఐదు నిమిషాల సంతాప సమావేశం ఏర్పాటు చేస్తామని కుటుంబసభ్యులు, అభిమానులు కోరగా పోలీసులు నిరాకరించారు. సాయిబాబా భౌతికకాయాన్ని అంబులెన్స్‌లోనే ఉంచి నివాళులర్పిస్తామని చెప్పినా అనుమతివ్వలేదు. దాంతో మౌలాలిలోని ఆయన నివాసానికి తరలించారు. జోహార్ సాయిబాబా, లాల్ సలాం...నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగింది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా అభిమానులు తరలివచ్చి నివాళులర్పించారు. సీపీఐ(ఎం) కేంద్రకమిటీ సభ్యులు మురళీధరన్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ...6లో

త్వరలో మంత్రి వర్గ విస్తరణ




- 9 నెలల్లో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు
- ఇవ్వని హామీలు సైతం అమలు చేస్తున్నాం..
- జిల్లాకు ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరు చేయిస్తా : టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్

వివరాలు 7లో

సమాఖ్య సూత్రాలకు దెబ్బ





- రాష్ట్రాల హక్కులను ఉల్లంఘిస్తుంది
- వక్ఫ్ సవరణ బిల్లు కేంద్రం ఉపసంహరించుకోవాలి : కేరళ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం

తిరువనంతపురం : వివాదాస్పద 2024 వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని కేంద్రాన్ని కోరుతూ కేరళ అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. వక్ఫ్, హజ్ తీర్థయాత్ర, క్రీడల మంత్రి వి అబ్దురహిమాన్ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగంలో పొందుపరచబడిన సమాఖ్య సూత్రాలను దెబ్బతీస్తుందని తీర్మానం పేర్కొన్నది. అలాగే, వక్ఫ్ విషయాలకు సంబంధించి రాష్ట్ర హక్కులను ఉల్లంఘిస్తుందనీ, వక్ఫ్ ఆస్తులను పర్యవేక్షించే బాధ్యత కలిగిన వక్ఫ్ బోర్డులు, ట్రిబ్యునల్‌ల అధికారాన్ని తీవ్రంగా బలహీనపరుస్తుందని అబ్దురహిమాన్ అన్నారు. ఈ బిల్లు రాజ్యాంగంలో పేర్కొన్న లౌకిక సూత్రాలను ఉల్లంఘించటమే కాకుండా ఎన్నికైన ...13లో

ప్రయివేటు ఉద్యోగాల్లో వికలాంగులకు రిజర్వేషన్లు



బ్యాక్‌లాగ్ పోస్టులు త్వరలో భర్తీ : జాబ్ పోర్టల్‌ను ఆవిష్కరించిన మంత్రి సీతక్క

వివరాలు 13లో



జ్వరమొచ్చింది..

కీళ్ల నొప్పులతో సతమతం

- వైద్య పరీక్షల్లో ఏమీ తేలని తీరు..
- రోజుల తరబడి ఆస్పత్రుల చుట్టూ తిరిగినా నిష్ప్రయోజనం
- రోజువారీ పనులకూ కష్టమవుతోందంటున్న బాధితులు
- రైతులు, సామాన్యులపై అదనపు భారం
- మూడు నెలలుగా జనం ఇబ్బందులు

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి


సాధారణ జ్వరంలా ప్రారంభమై కీళ్ల నొప్పులతో పలువురు బాధపడుతున్నారు. వైద్య పరీక్షలు చేయించుకుంటే ఏమీ లేదని రిపోర్టు వస్తుంది. వారం రోజుల తర్వాత జ్వరం తగ్గినా కీళ్ల నొప్పులు మాత్రం విపరీతంగా ఉంటున్నాయని బాధితులు వాపోతున్నారు. జ్వరం తగ్గాక నెలరోజుల తర్వాత నాన్ వెజ్ తింటే విపరీతమైన కీళ్ల నొప్పులతో ఆ రోగి పరిస్థితి మరింత తీవ్రమవుతోంది. ఇక రైతులు, రోజువారీ వ్యవసాయ, ఇతరత్ర పనులు చేసుకుంటే కానీ కుటుంబ పోషణ సాధ్యం కానీ కూలీల పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంటోంది. జ్వరం తగ్గకపోవడం, తగ్గినా కీళ్ల నొప్పులు మరింతగా ఉండటంతో పలువురు ఆస్పత్రులకు వస్తే రకరకాల పరీక్షల పేరుతో విపరీతంగా వసూళ్లకు పాల్పడుతున్నారు. టెస్టుల పేరుతోనే రూ.2వేల వరకు పిండుకుంటున్నారు. ఇక మెడిసిన్, వైద్యుల ఫీజులు ఇవన్నీ లెక్కిస్తే రూ.4-5వేల వరకు ఒక్కొక్కరికీ ఖర్చు వస్తోంది. పైగా ఇంట్లో ఒక్కరికి జ్వరం వస్తే ఇంటిల్లిపాదీ దీని బారిన పడుతున్నారు. తద్వారా ఒక్కో కుటుంబంపై రూ.20వేలకు పైగా జ్వర భారం పడుతోంది. ఇంత చేసినా కీళ్లనొప్పులు మాత్రం తగ్గడం లేదు. ఒక్కొక్కరు రెండు, మూడు సార్లు ఆస్పత్రుల చుట్టూ తిరిగినా డబ్బులు వదుస్తున్నాయి తప్ప నొప్పులు మాత్రం తగ్గడం లేదని వాపోతున్నారు. మూడు నెలలుగా జనం ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన మందులు లేకపోవడం, బెడ్ల కొరతతో ప్రయివేటును ఆశ్రయించాల్సి వస్తోందని పలువురు రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నొప్పులతో పనులు చేయలేక..

జ్వరం తగ్గినా నెలల తరబడి నొప్పులు తగ్గడం లేదు. పాదాలు, చీలమండలు, మోకాళ్లు, చేతివేళ్ల నొప్పులు విపరీతంగా ఉంటున్నాయని బాధితులు అంటున్నారు. వైద్యులను సంప్రదిస్తే వైరల్ ఫీవర్స్ అంటున్నారు. మెడిసిన్ ఇస్తున్నా నొప్పులు మాత్రం తగ్గట్లేదు. నొప్పులతో పనులు చేయలేక రైతులు మిర్చి తోటలు, పత్తి చేలల్లో పాట్ల కోసం కూలీలను పెట్టాల్సి వస్తోంది. ఒక్కో కూలీకి రోజుకు రూ.700 వరకు ఇస్తున్నామని వాపోతున్నారు. కొందరు కనీసం కాలకృత్యాలు కూడా తీర్చుకోలేకపోతున్నారు. తాడో, కర్రో, గోడో ఏదైనా ...6లో

మూడు, నాలుగు నెలలూ నొప్పులే

డాక్టర్ ఎస్.సునీల్‌గౌడ్, ఎండీ జనరల్ మెడిసిన్, ఖమ్మం జిల్లా ప్రధాన ఆస్పత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్



ఇవన్నీ విషజ్వరాలు. దోమల వల్ల ఇవి వ్యాప్తి చెందుతున్నాయి. వీటికి చికున్‌గున్యా కూడా తోడైంది. ఈ జ్వరాల వల్ల విపరీతమైన కీళ్ల నొప్పులు వస్తున్నాయి. వైరల్ ఫీవర్స్‌లో యాంటిబయాటిక్స్ కన్నా స్టెరాయిడ్స్ తీసుకోవాలి. చికున్‌గున్యా టెస్టు చేస్తే కొందరికీ నెగిటివే వస్తుంది. కానీ నొప్పులు విపరీతంగా ఉంటున్నాయని అంటున్నారు. ఈ నొప్పులు మూడు నెలల వరకూ ఉంటాయి. కీళ్లవాతం ఉన్న పేషెంట్స్‌కైతే ఐదారు నెలల వరకూ ఉండొచ్చు. కొందరికీ ముక్కు, గడ్డం భాగాల్లో నల్లగా దద్దుర్లు కూడా వస్తున్నాయి. పీసీఆర్ పరీక్షల్లో వ్యాధిని నిర్ధారించవచ్చు. ప్రొటీన్లు, విటమిన్లు, ఖనిజ లవణాలున్న సమతుల ఆహారం తీసుకోవాలి. విశ్రాంతి తీసుకుంటూ లక్షణాల ఆధారంగా మందులు వాడాలి.



ఫాక్స్‌కాన్‌కు సీఎం రేవంత్

చైర్మెన్‌తో వీడియో కాన్ఫరెన్స్ 5లో..

మరిన్ని విభాగాల్లో పెట్టుబడులకు ఆహ్వానం

సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంలో విగ్రహం ధ్వంసం

నిందితుడిని పట్టుకున్న స్థానికులు..దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత

- ఆలయం వద్ద బీజేపీ, కొన్ని మత సంస్థల ఆందోళన
- భారీగా మోహరించిన పోలీసులు
- గొడవ చేయాలనుకున్న వారి ఆటలకు అడ్డుకట్ట
- దుండగులను కఠినంగా శిక్షించాలి : సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ

వివరాలు 13లో





తలాతోక లేని పాలన

కేసీఆర్, రేవంత్ రెడ్డి పనితీరు ఒక్కటే

బీఆర్ఎస్ అహంకార పాలన వల్లే..ప్రజలు కాంగ్రెస్ వైపు :కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి



ఆలయాల అభివృద్ధికి మోడీ సర్కార్ ప్రత్యేక దృష్టి

నవతెలంగాణ - గీసుగొండ/ వరంగల్

కేసీఆర్, రేవంత్‌రెడ్డి పాలన ఒకేలా ఉన్నదని, పార్టీ రంగులు మారాయే కాని విధానాల్లో ఎలాంటి మార్పు లేదని, తెలంగాణలో తలాతోక లేని పాలన నడుస్తోందని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేండ్ల పాటు బీఆర్ఎస్ అహంకారపూరిత పాలన వల్లే ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు ...13లో

తైవాన్ జలసంధిలో చైనా సంయుక్త నావికా విన్యాసాలు

బీజింగ్ : తైవాన్ జలసంధిలో చైనా సంయుక్త నావికా విన్యాసాలు చేపట్టింది. పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పిఎల్ఎ) ఈస్ట్రన్ థియేటర్ కమాండ్ సైనిక, నావికాదళ, వైమానిక దళ, రాకెట్ బలగాలను తైవాన్ దీవికి పంపింది. జాయింట్ స్వోర్డ్-2024బి అనే కోడ్ నేమ్‌తో ఈ విన్యాసాలు నిర్వహిస్తోంది. తైవాన్ స్వాతంత్ర్య శక్తుల వేర్పాటువాద చర్యలను తీవ్రంగా హెచ్చరిస్తూ వీటిని చేపట్టినట్లు థియేటర్ కమాండ్ ప్రతినిధి సీనియర్ కెప్టెన్ లీ జీ చెప్పారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తైవాన్ దీవికి అన్ని దిశల వైపు నుండి నౌకలు, విమానాలు అత్యంత దగ్గరగా వచ్చాయి. సముద్ర, వైమానిక పోరుకు సంసిద్ధతను తెలియచేసే అంశాలపై ప్రత్యేకంగా దృష్టి పెడుతూ ఈ విన్యాసాలు చేశారు. థియేటర్ కమాండ్ బలగాల సంయుక్త నిర్వహణా సామర్ధ్యాలను పరీక్షించేలా వీటిని రూపొందించినట్లు తెలిపారు. దేశ సార్వభౌమాధికారాన్ని, జాతీయ ఐక్యతను పరిరక్షించుకునే దిశగా ఇది చట్టబద్ధమైన, అవసరమైన ఆపరేషన్ అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ నెల 10న తైవాన్ నేత లాయ్ చింగ్ టీ చేసిన ప్రసంగ నేపథ్యంలో ఈ విన్యాసాలు జరిగాయి. తైవాన్‌కు ప్రాతినిధ్యం వహించే హక్కు చైనాకు లేదని తాము పరస్పరం లొంగి వుండాల్సిన అవసరం లేదని ఆ రోజున ఆయన వ్యాఖ్యానించారు.

హర్యానా కాంగ్రెస్ ఇన్‌ఛార్జి రాజీనామా

చండీగఢ్ : హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఊహించని విధంగా కాంగ్రెస్ ఓటమి పాలవడంతో, అందుకు నైతిక బాధ్యత వహిస్తూ కాంగ్రెస్ హర్యానా ఇన్‌ఛార్జ్ దీపక్ బబారియా రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో సోమవారం మాట్లాడుతూ.. 'హర్యానా ఫలితాలు వెలువడిన మరుసటి రోజే నా రాజీనామా లేఖను పార్టీ హైకమాండ్‌కు పంపించా. ఇప్పటివరకు నా రాజీనామాపై అధిష్టానం ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు. నేను ఏ పదవిపై అత్యాశతో లేను. హర్యానా ఎన్నికల ఫలితాలు ఊహించలేనివి. సుమారు 15 స్థానాల్లో బిజెపి సూచనల మేరకు ఇవిఎంల దుర్వినియోగం జరిగింది' అని అన్నారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో 90 స్థానాలకు గాను బిజెపి 48 స్థానాలను గెలుచుకోగా, కాంగ్రెస్ 37 సీట్లకే పరిమితమైంది.

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో... అభిషేక్ బోయిన్‌పల్లికి బెయిల్ షరతులు రద్దు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత సన్నిహితులుగా దర్యాప్తు సంస్థలు ఆరోపిస్తోన్న అభిషేక్ బోయిన్‌పల్లికి సర్వోన్నత న్యాయస్థానం రెగ్యూలర్ బెయిల్ మంజూరు చేసింది. అలాగే మధ్యంతర బెయిల్ సమయంలో విధించిన షరతులను రద్దు చేస్తున్నట్లు స్పష్టం చేసింది. 2023 జులైలో ఢిల్లీ హైకోర్టు బెయిల్ నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ అభిషేక్ బోయినపల్లి సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ అరవింద్ కుమార్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం సోమవారం విచారించింది. అభిషేక్ బోయినపల్లి తరపున న్యాయవాది వాదనలు కొనసాగిస్తూ... ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో నిందితులందరూ బెయిల్‌పై బయటే ఉన్నారని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ప్రస్తుతం మధ్యంతర బెయిల్‌పై ఉన్న అభిషేక్‌కూ సాధారణ బెయిల్ మంజూరు చేయాలని కోరారు. బెయిల్ పిటిషన్‌పై ఈడీ వాదనలు వినిపించాలని కోరగా, అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వి రాజు ఎటువంటి అభ్యంతరం తెలపలేదు. ఇరువైపు వాదనలు విన్న ధర్మాసనం, అభిషేక్ బోయినపల్లికి బెయిల్ ఇవ్వడానికి ధర్మాసనం మొగ్గు చూపుతోందని తీర్పు వెలువరించింది. కాగా, రాబిన్ డిస్టలరీస్ ఎల్ఎల్‌పి మాజీ డైరెక్టర్ అభిషేక్ ఢిల్లీ లిక్కర్ స్కాంలో మధ్యవర్తిగా వ్యవహరించారని ఆరోపిస్తూ 2022 అక్టోబర్‌లో సీబీఐ అరెస్ట్ చేసింది. అయితే ఈ కేసులో అభిషేక్‌కు నెల రోజుల్లో బెయిల్ దొరికింది. అయితే ఇదే కేసులో మనీలాండరింగ్ వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఐదు రోజుల కస్టడీకి ఇస్తూ రౌస్ అవెన్యూ కోర్టు ఆదేశించింది. ఈ కస్టడీ తరువాత అభిషేక్ బోయినపల్లి జ్యుడీషియల్ కస్టడీలో భాగంగా తీహార్ జైల్‌కు తరలించారు. చివరగా.. ఈ ఏడాది మార్చి 20న సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఈ బెయిల్‌ను ఆగస్టు 13 వరకు పొడిగించారు. ప్రస్తుతం ఆయన మధ్యంతర బెయిల్‌లో ఉండగానే, రెగ్యూలర్ బెయిల్ లభించింది.

దీంతో హైదరాబాద్ వెళ్లొద్దన్న షరతులను కూడా కోర్టు రద్దు చేసింది. మరోవైపు ఇదే కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా, సహా ఇతరులకు ఇటీవలే సుప్రీం బెయిల్ మంజూరు చేసిన విషయం విదితమే.

బాబా సిద్ధిఖి హత్య కేసులో పోలీసు కస్టడీకి మూడో నిందితుడు



ముంబయి : బాబా సిద్దిఖి హత్య కేసులో మూడో నిందితుడు, ప్రధాన కుట్రదారుని సోదరుడైన ప్రవీణ్ లోంకార్‌ను ముంబయి లోని ఎస్ప్లనేడ్ కోర్టులో హాజరుపరచగా, ఈ నెల 21వరకు పోలీసు కస్టడీకి పంపించారు. ప్రవీణ్‌ను ఆయన సోదరుడు శుభమ్ లోంకార్ ఆచూకీ కనిపెట్టడం కోసం బీహార్, యుపి, హర్యానాలకు తీసుకెళ్ళాల్సి వుందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.ఎస్.వైద్య వాదించారు. పోలీసు కస్టడీకి ఆయనను పంచాల్సిందిగా కోరారు. ఈ కేసులోని ఆరుగురు అనుమానితుల మధ్య గల సంబంధాల గురించి తెలుసుకోవడానికి ప్రవీణ్ చాలా కీలకమని ఆయన పేర్కొన్నారు. కాల్పులు జరిపిన వ్యక్తులకు ఆయుధాలు అందచేసింది శుభమ్ లోంకార్ అని పోలీసులు అనుమానిస్తున్నారు. మహారాష్ట్రలోని అకోలా జిల్లాలో ఆయుధ చట్టం కేసులో ఇప్పటికే శుభమ్‌పై కేసు నమోదైంది. ఈ కోణాలన్నింటినీ తెలుసుకోవాలంటే ముందుగా ఆయనను కస్టడీకి అప్పగించాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోరారు. ఈ హత్యకు తమదే బాధ్యత అని ప్రధాన నిందితుడు, లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యుడు శుభమ్ లోంకార్ సోషల్ మీడియాలో పోస్టు పెట్టాడు. కాల్పులు జరిపిన ముగ్గురిని రిక్రూట్ చేసింది. అసలు ఈ మొత్తం కుట్ర వెనుక సూత్రధారి శుభమ్ అని పోలీసులు భావిస్తున్నారు. ఇప్పటివరకు ముగ్గురిని అరెస్టు చేశారు. మరో ముగ్గురు అనుమానితుల కోసం గాలిస్తున్నారు. ఈ నేరంతో తన క్లయింట్‌కు ఎలాంటి సంబంధం లేదని, తనను బలిపశువును చేశారని, అందువల్ల కనీస కస్టడీ ఇవ్వాలని డిఫెన్స్ న్యాయవాది కోర్టును కోరారు. తన సోదరుడి ఉద్దేశ్యం కూడా ప్రవీణ్‌కు తెలియదని వాదించారు. తెల్లవారు జామున 4గంటలకు అరెస్టు చేశారని, కానీ సాయంత్రం అరెస్టు చేసినట్లు చూపించారని చెప్పారు. అరెస్టు సమయంలో కూడా ఆయన ఇంట్లో వున్నాడని, ఒకవేళ ఈ కేసులో ఆయనకు పాత్ర వుంటే, పారిపోయి వుండేవాడని పేర్కొన్నారు.

బాణాసంచాపై ఢిల్లీ ప్రభుత్వం నిషేధం

న్యూఢిల్లీ : రానున్న శీతాకాలంలో వాయుకాలుష్యాన్ని తగ్గించేందుకు ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా కాల్చడంపై ఆప్ ప్రభుత్వం నిషేధం విధించింది. దీపావళి నేపథ్యంలో ఆన్‌లైన్ డెలివరీలతో సహా అన్ని రకాల బాణసంచా అమ్మకాలు, నిల్వ, తయారీ, కాల్చడంపై నిషేధం విధిస్తూ ఢిల్లీ కాలుష్య నియంత్రణ కమిటీ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఈ నిషేధం జనవరి 1, 2025 వరకు అమల్లో ఉండనున్నట్లు స్పష్టం చేసింది. దీపావళి నేపథ్యంలో బాణసంచాపై నిషేధం విధించడం వరుసగా ఇది నాలుగోసారి.

రాడార్ స్టేషన్ నిర్మాణంతో మూసీకి ప్రమాదం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దామగుండం వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ నిర్మాణంతో మూసీ నది ప్రమాదంలో పడనుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా ఆందోళన వ్యక్తం చేశారు. ఓ వైపు మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు రూ. లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేస్తామని చెబుతూనే, నదిని పూర్తిగా ప్రమాదంలో పడేసే రాడార్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలపడాన్ని ఆయన తప్పు పట్టారు. పదేండ్లు తమ సర్కార్‌పై కేంద్రం ఒత్తిడి తెచ్చినా ఒప్పుకోలేదనీ, ఏం ప్రయోజనాలు ఆశించి, తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు.

ఇంకా ఎన్ని కుటుంబాలు బలవ్వాలి

గుణపాఠం నేర్వని ప్రభుత్వం

తమిళనాడు రైలు ప్రమాదంపై రాహుల్ ఆగ్రహం



న్యూఢిల్లీ : తమిళనాడులో చోటు చేసుకున్న రైలు ప్రమాదం విషయంలో కేంద్రం తీరుపై కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మైసూరు-దర్భంగా బాగమతి ఎక్స్‌ప్రెస్ చెన్నై సమీపంలో గూడ్స్ రైలును ఢీకొన్న విషయం విదితమే. దీనిపై రాహుల్ మాట్లాడుతూ మోడీ సర్కారును టార్గెట్ చేశారు. ఇది 'భయంకరమైన బాలాసోర్ సంఘటన'కు అద్దం పడుతున్నదని ఆరోపించారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకముందే ఇంకా ఎన్ని కుటుంబాలు నష్టపోవాలని ప్రశ్నించారు. పలు ప్రమాదాల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోయినప్పటికీ.. కేంద్రం గుణపాఠాలు నేర్చుకోలేదని 'ఎక్స్' వేదికగా స్పందించారు.

శుక్రవారం అర్థరాత్రి తమిళనాడులోని కవరైపేటై వద్ద నిశ్చలంగా ఉన్న గూడ్స్ రైలును ఢీకొనడంతో బాగ్మతి ఎక్స్‌ప్రెస్ కనీసం 12 కోచ్‌లు పట్టాలు తప్పాయి. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగనప్పటికీ.. తొమ్మిది మంది గాయపడి నట్టు రైల్వే అధికారి తెలిపారు. ఈ ప్రమాదంపై రైల్వేశాఖ ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించినట్టు దక్షిణ రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి (సీపీఆర్వో) శనివారం తెలిపారు. తిరువళ్లూరులో పట్టాలు తప్పిన కోచ్‌లను తొలగించడంతోపాటు సహాయక చర్యలు కొనసాగుతున్నాయని చెపాపరు. ఈ ఘటనపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా స్పందిస్తూ.. ప్రభుత్వం అటువంటి ఘటనలపై ఎటువంటి చర్యలూ తీసుకోవటం లేదని విమర్శించారు.

మిమ్మల్ని మీరు రక్షించుకోవటానికి సిద్ధంగా ఉండండి

హిందువులను ఉద్దేశిస్తూ ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. యజ్ఞంలో మేకలను బలిస్తారు తప్పితే సింహాలను కాదని అన్నారు. కాబట్టి రాళ్లదాడి చేసే గూండాయిజం నుంచి తమను తాము రక్షించుకోవటానికి హిందూ సమాజం సిద్ధంగా ఉండాలని ఆయన తెలిపారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో విజయదశమి ప్రసంగం చేస్తూ భగవత్ పై విధంగా స్పందించారు. అయితే, సమాజంలో కలహాలు రేకెత్తించటానికి తాను ఇలా అనటం లేదనీ, హిందువులు తమ బలాన్ని సంయమనంతో ఉపయోగించుకోవాలని కోరారు. "గణేష్ విసర్జన్‌పై రాళ్ల దాడి ఘటనలు జరిగాయి. ఎందుకు జరిగింది? కారణం లేకపోలేదు. పరిస్థితిని నియంత్రించటం పరిపాలన పని. వారు వారి పనిని చేస్తారు. కానీ కొన్నిసార్లు సడలిస్తారు. అయితే పాలనా యంత్రాంగం జోక్యం చేసుకునేంత వరకు సమాజం కష్టాలు తీరాల్సిందే. కాబట్టి సమాజం సంసిద్ధంగా ఉండాలి. గూండాయిజాన్ని ప్రబలనివ్వకూడదు. ఒకరి ప్రాణాలను, ఆస్తులను కాపాడుకోవటం మన హక్కు. పరిపాలన తన పనిని చేయటానికి అనుమతించాలి, కానీ మన జీవితాన్ని రక్షించే పని మనపై ఉన్నది. సమాజం వ్యవస్థీకృతంగా ఉండాలి. బలహీనులను దేవతలు కూడా రక్షించరు. యజ్ఞం కోసం గుర్రం, ఏనుగు లేదా సింహాన్ని బలి ఇవ్వరు, మేకను బలిస్తారు. బలహీనంగా ఉండటం దారుణం" అని ఆయన అన్నారు. అయితే తాను ప్రజలను పోరాడాలని కోరటం లేదనీ, తమను తాము రక్షించుకోవటానికి సంఘటితంగా ఉండాలని ఆర్ఎస్ఎస్ చీఫ్ స్పష్టం చేశారు.

అనంత్ చతుర్దశి నాడు నిమజ్జన ఊరేగింపు సందర్భంగా గణేష్ విగ్రహంపై రాళ్లతో దాడి చేశారనే పుకార్లపై థానే జిల్లా భివాండిలో గత నెలలో మతపరమైన ఉద్రిక్తత చెలరేగిన విషయాన్ని భగవత్ ప్రస్తావిస్తూ కనిపించారు. గత నెలలో అక్కడ గణపతి ఊరేగింపు సందర్భంగా జరిగిన ఘటనలపై పోలీసులు మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. దేశంలో నిరసనలు హింసాత్మకంగా మారుతున్నాయని భగవత్ సూచించారు. అయితే, ఆరెస్సెస్ చీఫ్ చేసిన వ్యాఖ్యలు కొన్ని వర్గాలను పరోక్షంగా ఉటంకిస్తూ చేశారని పరిశీలకులు అంటున్నారు.

అప్పు చేసి పప్పు కూడు

ప్రపంచ దేశాలను కలవరపెడుతున్న రుణభారం | పెరుగుతున్న అసమానతలు | జీడీపీని దాటేసిన రుణాలు

గుదిబండగా మారుతున్న ఎన్నికల హామీలు

ఆకాశమే హద్దుగా 'సంక్షేమ' పద్దులు

ఉద్యోగాల కల్పనకు గ్రహణం

దారి తప్పుతున్న ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడానికి ప్రభుత్వాలు ఇప్పుడు అప్పుల పైనే ఎక్కువగా ఆధారపడుతున్నాయి. ఆదాయాన్ని, పన్ను రాబడులను పెంచుకోవడంపై పెద్దగా దృష్టి సారించడం లేదు. అప్పులతోనే గండం గట్టెక్కాలని చూస్తున్నాయి. అయితే దీని పర్యవసానం ఏమిటి? రుణభారంలో కూరుకుపోయిన ఆర్థికాభివృద్ధి ఉద్యోగాలను సృష్టిస్తుందా? ప్రజల ఆదాయాలను పెంచుతుందా? రుణాల సాయంతో సంక్షేమ రాజ్యాన్ని ఏర్పాటు చేస్తే అది విద్య, ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందా? ఉగ్రవాదాన్ని తరిమేస్తుందా? ప్రభుత్వ మౌలిక సదుపాయాలను పెంచుతుందా? ఈ ప్రశ్నలన్నింటికీ ఒకే సమాధానం...లేదు అనే రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయిల్-హమాస్ మధ్య జరుగుతున్న యుద్ధాలు ఏ క్షణంలో అయినా ప్రపంచ యుద్ధాలుగా మారవచ్చు. మరోవైపు ఉగ్రవాద భూతం పొంచి ఉంది. ఏవో కొన్ని మినహాయింపులు తప్పించి విద్య, ఆరోగ్యం విషయంలో ప్రపంచ దేశాలు ఏమంత సంతోషంగా లేవు.

కొందరి చేతిలోనే సంపద

న్యూఢిల్లీ : మౌలిక సదుపాయాలపై మన దేశం పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తోంది. అయితే దశాబ్ద కాలం క్రితం శాంతి భద్రతలు ఎలా ఉన్నాయో ఇప్పుడు అంతకంటే మెరుగ్గా ఉన్నాయని ఎవరైనా చెప్పగలరా? ప్రభుత్వ అప్పులు జీడీపీలో 82.5 శాతానికి చేరాయి. అందరికీ అందుబాటులో ఉండాల్సిన సాంకేతిక పరిజ్ఞానం కొందరికే సంపదను సృష్టిస్తోంది. ఓ మోస్తరు నైపుణ్యం కలిగిన వారి ఉద్యోగాలు ఊడుతున్నాయి. ఆదాయం, సంపద మధ్య అసమానతలు పెరిగిపోతున్నాయి.



అసమానతలు పెంచుతున్న అప్పులు

పెరుగుతున్న అసమానతలకు రుణ భారం ఆజ్యం పోస్తోంది. మరో ఆర్థిక సంక్షోభం నుండి బయటపడడానికి అమెరికా కేంద్ర బ్యాంక్ వడ్డీ రేట్లను దాదాపు సున్నా స్థాయికి తీసుకొచ్చింది. అంతేకాదు...అమెరికా బ్యాంకులు కూడా అప్పుల వేటలో పడ్డాయి. రుణాలు వచ్చి పడడంతో స్టాక్ మార్కెట్లు పరుగులు పెడుతున్నాయి. దీంతో సంపన్నులు మరింత సంపన్నులై పోతున్నారు. జరుగుతున్న తప్పిదాలకు ఎవరూ మూల్యం చెల్లించుకోవడం లేదు. సంపన్నుల చుట్టూ రక్షణ కవచం ఏర్పడింది. ఫలితంగా అసమానతలు పెరిగి ఎక్కడ చూసినా సామాజిక ఉద్రిక్తతలే కన్పిస్తున్నాయి.

సెంచరీకి చేరువలో రుణం-జీడీపీ దామాషా

ప్రపంచ దేశాలన్నీ రుణభారంలో కూరుకుపోతున్నాయి. అమెరికా ప్రభుత్వం ఏటా కొత్తగా రెండు ట్రిలియన్ డాలర్ల రుణాన్ని తీసుకుంటోంది. ఇది మన ప్రస్తుత జీడీపీలో సగం కంటే ఎక్కువే. రుణం-జీడీపీ నిష్పత్తి పెరిగిపోతోంది. ఈ దామాషా అమెరికాలో 123.3 శాతం, జపాన్‌లో 254.6 శాతం, ఫ్రాన్స్‌లో 111.6 శాతం, మన దేశంలో 82.5 శాతంగా ఉంది. ఆర్థిక ఇబ్బందుల నుండి గట్టెక్కేందుకు ప్రపంచ దేశాలన్నీ డబ్బును ముద్రిస్తున్నాయి. కానీ ఈ పరిణామం అనర్థాలకు దారితీస్తోంది. ప్రపంచ దేశాలన్నీ తీసుకున్న రుణ మొత్తం ఇప్పుడు అక్షరాలా 97 ట్రిలియన్ డాలర్లు. రుణాలతో కూడిన ప్రపంచ జీడీపీ 105 ట్రిలియన్ డాలర్లు. అంటే ప్రభుత్వాల రుణం-జీడీపీ నిష్పత్తి 92.3 శాతంగా ఉందన్న మాట. ఇది అత్యంత వేగంగా సెంచరీ మార్కుకు చేరువవుతోంది. దీనిని భరించడం కష్టంగా మారబోతోంది. ఎందుకంటే అభివృద్ధి పనుల కోసం చేసే వ్యయం కంటే వడ్డీ చెల్లింపులకే ఎక్కువ ఖర్చవుతోంది. 2008 తర్వాత పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. 2010 నుండి ఇప్పటి వరకూ ప్రపంచ దేశాల రుణం రెట్టింపు అయింది. మరింత అప్పు తీసుకోవాలని ఇప్పుడు అమెరికా, చైనా యోచిస్తున్నాయి.

ప్రభుత్వ మద్దతుతోనే నెట్టుకొస్తున్న కంపెనీలు

రుణాలు తీసుకోవడం ద్వారా ఆర్థిక వృద్ధిని పెంచుకోవడం వల్ల వాటిల్లే అనర్థాలను పరిశీలించడం ఎంతైనా అవసరం. అధిక కరెన్సీని ముద్రిస్తే నష్టాల ఊబిలో ఉన్న లేదా దాదాపు మూసివేత దశలో ఉన్న కంపెనీలు తిరిగి జీవం పోసుకుంటాయి. అయితే ఆ కంపెనీలు నూతన ఉద్యోగాలు సృష్టించకుండా పెట్టుబడులు సమకూర్చుకుంటాయి. అమెరికాలో దాదాపు 20 శాతం కంపెనీలు ప్రభుత్వ ఆర్థిక మద్దతుతో నడుస్తున్నవేనని, వాటి రుణభారం అపరిమితంగా తీర్చలేనిదిగా ఉన్నదని ప్రపంచ పెట్టుబడుల వ్యూహకర్త రుచిర్ శర్మ తెలిపారు. మన దేశంలో కూడా పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఏమీ లేవు.

నూతన ఉద్యోగాలకు 'సంక్షేమ' గ్రహణం

ఆర్థికపరమైన ఒత్తిడుల కారణంగానే ప్రభుత్వ ఉద్యోగాలు పెరగడం లేదన్నది వాస్తవం. ఏ విభాగంలో అయినా సంక్షేమ లేదా సబ్సిడీ వ్యయం పెరిగితే ఆ రంగంలో ఉద్యోగ కల్పన పడిపోతుంది. కేవలం కాంట్రాక్ట్ ఉద్యోగాలకే పరిమితం అవుతుంది. ప్రభుత్వ సబ్సిడీలు ఎయిర్ ఇండియాను ఆదుకున్నప్పుడు అది మిగిలిన విమానయాన పరిశ్రమ మనుగడను కూడా ప్రశార్థకం చేసింది. వన్-ర్యాంక్-వన్ -పెన్షన్ (ఓఆర్ఓపీ)ని ప్రవేశపెట్టి నప్పుడు సాధారణ పద్ధతిలో సైనిక నియామకాల కొనసాగింపు అసంభవమైంది. ఎందుకంటే రక్షణ బడ్జెట్‌లో 53 శాతం సిబ్బంది జీతభత్యాలు, పెన్షన్లకే పోతోంది. ఫలితంగా సైనికుల కోసం స్వల్ప కాలిక నియామక పథకం అగ్నిపథ్‌ను తీసుకురావడం ప్రభుత్వానికి అనివార్యం అయింది. కర్నాటక ప్రభుత్వం సంక్షేమ పథకాలపై ఇబ్బడి ముబ్బడిగా ఖర్చు పెట్టడంతో మౌలిక సదుపాయాల కల్పన, నూతన ప్రాజెక్టులు ఆలస్యమయ్యాయి. హర్యానాలో కాంగ్రెస్ గెలిచి ఉంటే ఇదే సమస్య వచ్చి ఉండేది. ఎందుకంటే అది సంక్షేమ హామీలను భారీగానే కుమ్మరించింది. బీజేపీ కూడా ఏమీ తక్కువ తినలేదు. వచ్చే నెలలో శాసనసభ ఎన్నికలు జరగనున్న మహారాష్ట్రలో కూడా మహాయుతి ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంచి నాణ్యత కలిగిన ఉద్యోగాలు కల్పించగలవు. అయితే సంక్షేమ పథకాలపై ఖర్చు ఆకాశాన్ని తాకుతుండడంతో అవి ఆ పని చేయలేకపోతున్నాయి.

ఖరీదైన ఎన్నికల హామీలు

భారత్‌లో ఎన్నికల సమయంలో వివిధ పార్టీలు ఇస్తున్న హామీలు చాలా ఖరీదైనవి. అవి మహిళలు, రైతులు, యువత తదితర వర్గాల వారికి గ్యారంటీ ఆదాయాన్ని ఆశ చూపుతాయి. ఎన్నికలలో గెలిచి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత ఆ హామీలే గుదిబండలుగా మారతాయి. వాటిని నెరవేర్చడం ఆర్థికంగా కష్టసాధ్యమవుతుంది. పైగా అవి ఉద్యోగాలను హరిస్తాయి. ఖాళీలను భర్తీ చేయడం ద్వారా 30 లక్షల ప్రభుత్వోద్యోగాలు కల్పిస్తామని ఇటీవలి సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఆర్థికంగా ఇది ఆచరణ సాధ్యమేనా అని ప్రశ్నిస్తే జవాబే ఉండదు.



వక్ఫ్ జేపీసీ చైర్మెన్‌ను మార్చాలి

- ప్రతిపక్ష సభ్యుల డిమాండ్
- సమావేశాన్ని బహిష్కరణ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

వక్ఫ్ సవరణ బిల్లును పరిగణనలోకి తీసుకున్న జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) చైర్మెన్ జగదాంబిక పాల్‌ను మార్చాలని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. జేపీసీలో నిబంధనలు పాటించడం లేదని ఆరోపిస్తూ వారు సోమవారం సమావేశాన్ని బహిష్కరించారు. కమిటీ కార్యకలాపాలు నిబంధనల ప్రకారం జరగడం లేదని విమర్శించారు. బీజేపీ సీనియర్ ఎంపీ జగదాంబికా పాల్‌ను చైర్మెన్ పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష సభ్యులు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలవనున్నారు. వివాదాస్పద కర్నాటక భూ ఒప్పందంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ఉద్దేశించి కర్నాటక రాష్ట్ర మైనారిటీ కమిషన్ మాజీ చైర్మెన్ అన్వర్ మణిపాడి చేసిన వ్యాఖ్యలు ప్రతిపక్షాలకు ఆగ్రహం తెప్పించాయి. బిల్లుపై మణిపాడి వ్యాఖ్యానిస్తూ ఖర్గే వక్ఫ్ భూమిని ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ఆయన కమిటీ ముందు 11 పేజీల ప్రెజెంటేషన్ ఇచ్చారు. సీనియర్ నేతను, కర్నాటక ప్రభుత్వాన్ని అవమానించేలా చైర్మెన్‌కు అవకాశం ఇచ్చారని ప్రతిపక్షం ఆరోపించింది. ఈ వ్యాఖ్య బిల్లు పరిధిని మించిపోయిందని, సభ నుంచి నిష్క్రమించే సమయంలో శివసేన (ఉద్ధవ్ ఠాక్రే) ఎంపీ అరవింద్ సావంత్ అన్నారు. కమిటీ ముందు హాజరైన వ్యక్తులు మల్లికార్జున ఖర్గేపై వ్యక్తిగత ఆరోపణలకు అనుమతి ఇచ్చారని విమర్శించారు. పార్లమెంట్ నిబంధనలను ఉల్లంఘించారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ఎంపీలు గౌరవ్ గొగోయ్, ఇమ్రాన్ మసూద్, డీఎంకెకు చెందిన ఎ.రాజా, ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ, సమాజ్‌వాదీ పార్టీకి చెందిన మొహిబుల్లా, ఆప్‌నకు చెందిన సంజయ్ సింగ్ తీవ్ర నిరసనలు తెలిపారు. దీనిపై ప్రతిపక్ష సభ్యులు సమావేశమై, తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతిపక్ష సభ్యులు బహిష్కరించినా జగదాంబిక పాల్ సమావేశాన్ని కొనసాగించారు. ఈ సమావేశంలో జమియత్ ఉల్ ఉలమా ఇ హింద్ ప్రతినిధులు హాజరై తమ అభిప్రాయాన్ని వెల్లడించారు.

నేటి నుంచి షాంఘై కూటమి సదస్సు

ఇస్లామాబాద్ : మంగళవారం నాడిక్కడ ప్రారంభం కానున్న షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) సదస్సు కోసం విస్తృతంగా భద్రతా ఏర్పాట్లు చేశారు. పోలీసు, పారా మిలటరీ బలగాలను మోహరించారు. ఇప్పటికే విదేశీ ప్రతినిధులు ఒక్కొక్కరుగా చేరుకుంటున్నారు. రెండు రోజుల పాటు జరగనున్న 23వ ఎస్‌సిఒ ప్రభుత్వాధినేతల (సిహెచ్‌జి) సమావేశాలకు భారత విదేశాంగ మంత్రి జై శంకర్, చైనా, రష్యా ప్రధానులు హాజరవుతున్నారు. ఆర్థిక వ్యవస్థ, వాణిజ్యం, పర్యావరణ రంగాల్లో ప్రస్తుత సహకారంపై ఈ సదస్సు ప్రధానంగా దృష్టి సారించనుంది. సామాజిక, సాంస్కృతిక సంబంధాలు, ఎస్‌సిఒ పనితీరుపైన సదస్సు చర్చించనుంది. సభ్య దేశాల మధ్య సహకారం మరింతగా పెంపొందించుకోవడంతో బాటు ఎస్‌సిఒ బడ్జెట్ పై కూడా కొంత చర్చ జరిగే అవకాశముంది. భారత్ తరపున విదేశాంగ శాఖ మంత్రి జై శంకర్ హాజరుకానున్నారు. చైనా, రష్యా, బెలారస్, కజకిస్తాన్, కిర్గిజిస్తాన్, తజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్‌ల ప్రధానులు, ఇరాన్ ఉపాధ్యక్షుడు ఈ సదస్సుకు హాజరవుతున్నట్లు పాక్ విదేశాంగ కార్యాలయం తెలిపింది. 76మంది సభ్యులతో రష్యా, 15మంది సభ్యులతో చైనా బృందం, నలుగురు సభ్యులతో భారత్ ప్రతినిధి బృందాలు ఈ సదస్సులో పాల్గొననున్నాయి. ఇరాన్, కిర్గిజిస్తాన్ బృందాలు ఇప్పటికే ఇస్లామాబాద్ చేరుకున్నాయి.

తొమ్మిదో రోజుకు వాంగ్‌చుక్ దీక్ష

మద్దతుదారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



న్యూఢిల్లీ : లడఖ్‌లో ఆరో షెడ్యూల్ అమలు కోసం, రాష్ట్ర హోదా కోసం పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్, ఆయన మద్దతుదారులు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష సోమవారం తొమ్మిదవ రోజుకు చేరింది. కాగా లడఖ్ భవన్ వెలుపల శాంతియుతంగా దీక్ష చేస్తున్న 60 మంది వాంగ్‌చుక్ మద్దతుదారులను పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. దీక్షలో ఉన్న ఆందోళనకారులను తొలుత చెదరగొట్టిన పోలీసులు, ఆ తర్వాత వారిలో కొందరిని అరెస్ట్ చేశారు. లడఖ్ భవన పరిసరాలలో బారికేడ్లు ఏర్పాటు చేసి మీడియాతో కార్యకర్తలు మాట్లాడకుండా అడ్డుకున్నారు.

వాంగ్‌చుక్‌తో పాటు దీక్షలో ఉన్న లే అపెక్స్ బాడీ సభ్యుడు జగ్‌మిత్ పల్జోర్ బారికేడ్లను దాటి వెలుపలికి వచ్చి పాత్రికేయులతో మాట్లాడారు. డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా దీక్ష చేస్తున్న తమను ఢిల్లీ పోలీసులు అడ్డుకోవడం దురదృష్టకరమని ఆయన చెప్పారు. క్లయిమేట్ మార్చ్‌లో భాగంగా వాంగ్‌ఛుక్, మరో 150 మంది నిరసనకారులు లెహ్ నుండి దేశ రాజధానికి పాదయాత్రగా బయలుదేరిన విషయం తెలిసిందే. అయితే వారిని సింఘు సరిహద్దు వద్దనే పోలీసులు అడ్డుకొని రెండు రోజుల పాటు నిర్బంధించారు. ఆ తర్వాత రాజ్‌ఘాట్‌లో దీక్ష చేపట్టి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ హామీతో విరమించారు. అయితే ప్రభుత్వం తన హామీని నిలబెట్టుకోకపోవడంతో నిరవధిక దీక్షకు దిగారు. వీరికి సంఘీభావం తెలిపేందుకు వచ్చిన వంద మందిపై పోలీసులు ఆదివారం దాష్టీకం ప్రదర్శించారు.

స్వప్రయోజనాల కోసం.. సైన్యాన్ని మరింతగా వాడుకునే ఆలోచనలో ట్రంప్ ?

వాషింగ్టన్ : తన లక్ష్య సాధన కోసం మిలటరీని ఏ మేరకు ఉపయోగించవచ్చో ఆ పరిమితులు, హద్దులన్నింటినీ డొనాల్డ్ ట్రంప్ తాను మొదటిసారి అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనే పరీక్షించేశారు. ఇక ఇప్పుడు రెండోసారి కూడా ఆయనకు అవకాశం ఇచ్చినట్లైతే, ఇంతకంటే ఎక్కువగా మిలటరీని తన ప్రయోజనాల కోసం వాడుకోవాలని ట్రంప్, ఆయన మిత్రులు భావిస్తున్నారు. అమెరికా గడ్డపై మిలటరీని అత్యంత శక్తివంతమైన సాధనంగా చూపించేందుకు ప్రయత్నిస్తున్నారు. విదేశాల్లో ఉన్న వేలాదిమంది అమెరికన్ సైనికులను వెనక్కి పిలిపిస్తానని ఆయన హామీ ఇచ్చారు. వారినందరినీ శరణార్థుల తరలింపు, దేశంలోని అశాంతిని పారద్రోలడం వంటి దేశీయ ప్రాధాన్యతలకు ఉపయోగించాలని చూస్తున్నారు. తనతో సైద్ధాంతికంగా విభేదించే సైనికాధికారులను ఎలాగైనా వదుల్చుకోవడం గురించి కూడా మాట్లాడుతున్నారు. అమెరికా సమాజంలో మిలటరీ పాత్ర విషయంలో ట్రంప్ దార్శనికత చాలా నాటకీయంగా మారుతోంది.

భారత్ దౌత్యవేత్తలు వెనక్కి

- కెనడా తీరుపై భారత్ ఆగ్రహం
- అసంబద్ధ ఆరోపణలంటూ ఖండన



న్యూఢిల్లీ : ఖలిస్తానీ తీవ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జార్ హత్యలో "ప్రయోజనాలు కలిగిన వ్యక్తులు"గా భారత హై కమిషనర్ సంజయ్ కుమార్ వర్మ, ఇతర భారత దౌత్యవేత్తలపై కెనడా చేసిన ఆరోపణలపై భారత్ తీవ్రంగా మండిపడింది. కెనడా ప్రభుత్వ తీరును ఖండిస్తూ, వెంటనే భారత దౌత్యవేత్తలను వెనక్కి పిలిపించింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటన చేసింది. కెనడా ప్రభుత్వ ఆరోపణల నేపథ్యంలో వారిని ఉపసంహరించుకోవాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. కెనడా హై కమిషన్ చార్జ్ డీ అఫైర్స్ స్టీవార్ట్ వీలర్‌ను పిలిపించి మన స్పందన తెలియచేసింది. ఆ వెంటనే విదేశాంగ శాఖ ప్రకటన వెలువడింది. కెనడా చేసిన ఆరోపణలు అత్యంత అసంబద్ధమైనవిగా వున్నాయని భారత్ విమర్శించింది. దేశీయంగా ట్రూడే ప్రభుత్వం ఎదుర్కొంటున్న రాజకీయ సవాళ్ళతో ఈ అంశం ముడిపడి వుందని పేర్కొంది. భారత దౌత్యవేత్తలపై ఇటువంటి కుట్ర ఆరోపణలు చేసేందుకు కెనడా ప్రభుత్వం తీసుకున్న తాజా చర్యలపై స్పందనగా తాము తదుపరి చర్యలు తీసుకునే హక్కును అట్టిపెట్టుకున్నట్లు అంతకుముందు ప్రభుత్వం పేర్కొంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ వ్యక్తులకు కెనడాలో కొనసాగడం కష్టం కాబట్టి వారిని వెనక్కి పిలిపించడం లేదా ఒట్టావాలో భారత హై కమిషన్ పరిమాణాన్ని తగ్గించడం వంటి చర్యలు భారత ప్రభుత్వం తీసుకోవడానికి అవకాశాలు వున్నాయి. అలాగే కెనడా హై కమిషన్ కూడా హై కమిషన్ సైజ్‌ను తగ్గించాలని కోరవచ్చు. కెనడాపై ఆర్థికపరమైన చర్యలు తీసుకునే అవకాశాలు కూడా వున్నాయి. కెనడా జాతీయుల వీసాలను రద్దు చేయడం ద్వారా ఆ దేశంతో సంబంధాలను గణనీయంగా తగ్గించుకునేందుకు అవకాశాలు బాగా వున్నాయి.

తెలంగాణ సినీ పరిశ్రమ ప్రపంచస్థాయికి ఎదగాలి

రాష్ట్రానికి ప్రతిరూపం గద్దర్ : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ సినీ పరిశ్రమను రాష్ట్ర ప్రభుత్వం గౌరవిస్తున్నదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన గద్దర్ సినీ అవార్డుల కమిటీ మొదటి సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ సినీ పరిశ్రమ దేశంలోనే కాదు ప్రపంచములోనే శాసించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సినీ పరిశ్రమకు ఏ సమస్యలు ఉన్నా వినడానికి, పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పినట్టు వివరించారు. సినీ పరిశ్రమల అవార్డుల విషయానికొస్తే నంది అవార్డులు ఒక పండుగలా నిర్వహించేవారన్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఎందుకో గత ప్రభుత్వం ఈ అంశాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. తెలంగాణ అంటేనే సాంస్కృతిక జీవనం. తెలంగాణ అంటేనే ఆట, పాట.. ఇక్కడ బాధ వచ్చిన సంతోషం వచ్చినా పాట ద్వారానే వ్యక్త పరుస్తామని చెప్పారు. తెలంగాణ సంస్కృతి చాలా గొప్పదనీ, అందరిని అక్కున చేర్చుకుంటుందన్నారు. అసమానతలు, వైరుధ్యాల నేపథ్యంలో రాష్ట్ర ప్రజలు పోరాటం చేసి ప్రత్యేక రాష్ట్రం తెచ్చుకున్నారని వివరించారు. పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలమా అంటూ సమాజాన్ని తెలంగాణ రాష్ట్ర సాధనకు సమాయత్తం చేసి నడిపించిన ప్రజా యుద్ధనౌక గద్దర్ అని డిప్యూటీ సీఎం కొనియాడారు. గద్దర్ ఒక లెజెండ్, ఒక శతాబ్ద కాలంలో ఆయన లాంటి వ్యక్తి పుడతారని తాను అనుకోవడం లేదనీ, ప్రపంచంలోని అన్ని సమస్యలపై ఆయన ప్రజలను పాటలతో కదిలించాలని తెలిపారు.



తెలంగాణ ఆట, పాటను ప్రపంచానికి పరిచయం చేసిన మహోన్నత వ్యక్తి గద్దర్ అని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో ఏ గ్రామంలో చూసిన గద్దర్‌లాగే పాడాలని ప్రయత్నిస్తుంటారు, ఆయన్ను అనుకరిస్తుంటారు తెలంగాణ మొత్తానికి గద్దర్ ప్రతిరూపమని తెలిపారు. గద్దర్ మొదట విప్లవోద్యమ బాటలో అడవి బాట పట్టిన కాలక్రమమైన దేశంలోని అన్ని సమస్యలకు భారత రాజ్యాంగమే పరిష్కారమని భావించి దాన్ని ఆయన విస్తృ తంగా ప్రచారం చేశారని వివరించారు. అన్ని అంశాలు పరిశీలించే రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ పేరిట సినిమా అవార్డులు ఇవ్వాలని నిర్ణయించిందని కమిటీ సభ్యులకు చెప్పారు. అన్ని అవార్డుల తరహాలోనే అన్ని రంగాలకు గద్దర్ అవార్డులు ఇచ్చుకోవచ్చని తెలిపారు. సినీ పరిశ్రమలోని అందర్నీ గౌరవించుకోవాలి, ప్రతి అవార్డు గొప్పగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతుందని తెలిపారు. గద్దర్ అవార్డుల కార్యక్రమం గొప్ప పండుగలా జరగాలి, ఏ తేదీన జరపాలనేది కమిటీ నిర్ణయం తీసుకోవాలని కోరారు. గద్దర్‌ను అత్యంత ప్రీతిపాత్రమైన వ్యక్తిగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిందని తెలిపారు. కొద్దిరోజుల్లోనే కమిటీ మరో మారు సమావేశమై త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం కమిటీ సభ్యులను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కాన్సెప్ట్ అద్భుతమైనదని ప్రముఖ సినీ నిర్మాత దగ్గుబాటి సురేష్ సమావేశంలో డిప్యూటీ సీఎంకు అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్కిల్ యూనివర్సిటీలో యాక్టింగ్ స్కిల్స్ నేర్పించేందుకు ప్రత్యేక కోర్స్ ఏర్పాటు చేయాలని కమిటీ సభ్యులు కోరారు. అన్ని అంశాలు పరిశీలించి ఇంటిగ్రేటెడ్ స్కూల్, స్కిల్ యూనివర్సిటీలో యాక్టింగ్, కల్చర్‌కు సంబంధించిన అంశాలకు చోటు కల్పించడం పై నిర్ణయం తీసుకుంటామని డిప్యూటీ సీఎం తెలిపారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృ ష్ణారావు, కమిటీ సభ్యులు నర్సింగరావు, తనికెళ్ల భరణి, సురేష్ బాబు, తమ్మారెడ్డి భరద్వాజ, దిల్ రాజు, హరి శంకర్, వందేమాతరం శ్రీనివాస్, అల్లాని శ్రీధర్, గుమ్మడి విమల, సమాచార శాఖ కమిషనర్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

తన అజ్ఞానాన్ని తెలుసుకోవడమే నిజమైన జ్ఞానం - సర్వేపల్లి రాధాకృష్ణన్

సంపాదకీయం

ఆకలి భారతం



"స్వాతంత్ర్య భారతదేశంలో ఆకలితో అలమటించే అనాథలు ఉండేందుకు వీల్లేదు. ఏ ఒక్కరూ ఖాళీ కడుపుతో ఉండకూడదు. ఉన్నారంటే ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉన్నట్టే. జాతీయ ఆహార భద్రత చట్టాన్ని తప్పనిసరిగా అమలు పరచాల్సిందే" అని గతంలోనే సుప్రీంకోర్టు కేంద్రాన్ని హెచ్చరించింది. ప్రపంచ ఆకలిసూచీలో గత పదేండ్లుగా మన దేశ ర్యాంకు అధోపాతాళానికి పడిపోతున్నది. వజ్రోత్సవాలు జరుపుకున్న స్వతంత్ర భారతదేశంలో ప్రజల పరిస్థితి 'అన్నవస్త్రాలు అడిగితే ఉన్న వస్త్రాలు పోయినట్టు'గా మారిపోయింది. 2014లో ఆకలిసూచీలో 55వ స్థానంలో ఉన్న మన దేశం 2024లో 105వ స్థానానికి దిగజారడం విడ్డూరమే! అందునా దక్షిణాసియా దేశాలన్నింటిలోకెల్లా చివరిస్థానంలో నిలవడం దేశ దీనస్థితికి పరాకాష్ఠ. మనం మనకున్న ప్రకృతి, మానవ వనరులను సరిగ్గా ఉపయోగించుకోలేని దుస్థితిలో ఉన్నాం. అందుకే నేటికీ ఈ దేశంలో ఆకలిమంటలు రగులుతూనే ఉన్నాయి.

నేటికీ దేశంలో తినడానికి తిండిలేక, ఆకలిని తట్టుకోలేక నీళ్లు తాగుతూ, పొత్తికడుపును మోకాళ్లతో ఒత్తుకుంటూ అలమటిస్తున్న ప్రజలు కోకొల్లలు. దేశంలో ప్రతిరోజూ దాదాపు 19కోట్ల మంది ఆకలి కడుపుతో నిద్రిస్తున్నారని జాతీయ ఆరోగ్య నివేదిక తెలిపింది. ఒకవైపు ఉత్పత్తి, ఉత్పాదక సామర్థ్యం గణనీయంగా పెరిగిందని ప్రభుత్వాలు చెప్పుతున్న ప్పటికీ, ఈ ఉత్పత్తిలో కీలకంగా వ్యవహరిస్తున్న నిరుపేదలు ఇంకా ఎందుకు బక్కచిక్కిపోతున్నారో, ఆకలిచావులు ఎందుకు పెరుగుతున్నాయో అన్నది సమాధానం లేని ప్రశ్నగానే మిగిలిపోతుంది.

ప్రపంచంలో తీవ్రమైన 31ఆకలి రాజ్యాలలో భారత్ కూడా ఉండటం కడు విషాదం. భగ్గున మండుతున్న నిత్యావసరాలు ధరల సెగలకు అసంఖ్యాకులైన సామాన్యులు విలవిల్లాడు తున్నారు. ఇలా పట్టెడన్నం కోసం పరితపించే అభాగ్యుల సంఖ్య ప్రపంచమంతా పెరిగి పోతుండటం నేటి మహావిషాదం. ఇందుకు ఎవరిని నిందించాలి? అదే సమయంలో రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రం ఆర్టికల్ 39(ఎ) ప్రకారం దేశంలోని పౌరులందరికీ తగిన జీవన సదుపాయాలు కల్పించాలి. దేశంలోని ప్రతి పౌరునికీ నాణ్యమైన ఆహారం అందించాల్సిన కనీస బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. దేశంలో ఆహారానికి కొరత లేకపోయి ఉంటే, ఆకలి చావుల సంఖ్య శూన్యంగా ఉండాలి కదా! కానీ నేటికీ దేశంలో ఆకలిచావులు లేని రోజు లేదంటే అతిశయోక్తి కాదు. ఆకలి, వాతావరణ మార్పులు, లింగ అసమానత్వం ఈ మూడింటి మధ్య నేరుగా సంబంధం ఉన్నదని నివేదిక ఎత్తిచూపింది. వివక్షాపూరితమైన నిబంధనలు, లింగ ఆధారిత హింస అనేవి మహిళలను, మైనారిటీలను ప్రమాదంలో పడేస్తున్నాయని, వారికి ఆహార, పోషకాహార భద్రత లభించడం లేదని తెలియజేసింది. ఈ సవాళ్లను అధిగమించేందుకు వారు చేస్తున్న ప్రయత్నాలకు వాతావరణ మార్పుల ప్రభావం ప్రతిబంధకంగా ఉంటోందని నివేదిక చెప్పింది.

'కన్‌సర్న్‌డ్ వరల్డ్‌వైడ్', 'వెల్త్‌హంగర్‌లైఫ్' సంయుక్తంగా ప్రచురిస్తున్న జీహెచ్ఐ సిరీస్ తక్షణం దృష్టి సారించాల్సిన అంశాలను ప్రస్తావించింది. ఈ సంవత్సరపు నివేదికలో భారత్ స్కోరు 27.3. దేశంలో ఆకలి తీవ్రత ఏస్థాయిలో ఉన్నదో ఇది ప్రతిబింబిస్తోంది. ఇటీవలి సంవత్సరాలలో పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న వారి సంఖ్య స్వల్పంగా పెరిగిందని నివేదిక తెలిపింది. 2016వ సంవత్సరపు జీహెచ్ఐ స్కోరు 29.3తో పోలిస్తే ప్రస్తుత స్కోరు మెరుగైనప్పటికీ అది ఇప్పటికీ 'తీవ్రత' కేటగిరీలోనే ఉంది. పొరుగు దేశాలకంటే బాగా వెనుకబడి ఉంది.

నేటికీ దేశంలో తినడానికి తిండిలేక, ఆకలిని తట్టుకోలేక నీళ్లు తాగుతూ, పొత్తికడుపును మోకాళ్లతో ఒత్తుకుంటూ అలమటిస్తున్న ప్రజలు కోకొల్లలు. దేశంలో ప్రతిరోజూ దాదాపు 19కోట్ల మంది ఆకలి కడుపుతో నిద్రిస్తున్నారని జాతీయ ఆరోగ్య నివేదిక తెలిపింది. ఒకవైపు ఉత్పత్తి, ఉత్పాదక సామర్థ్యం గణనీయంగా పెరిగిందని ప్రభుత్వాలు చెప్పుతున్నప్పటికీ, ఈ ఉత్పత్తిలో కీలకంగా వ్యవహరిస్తున్న నిరుపేదలు ఇంకా ఎందుకు బక్కచిక్కిపోతున్నారో, ఆకలిచావులు ఎందుకు పెరుగుతున్నాయో అన్నది సమాధానం లేని ప్రశ్నగానే మిగిలిపోతుంది.

మన దేశంలో నేటికీ ఇంతటి భారీ స్థాయిలో పోషకాహారలోప బాధితులు ఉండడానికి పేదరికమే ప్రధాన కారణం. ఆకాశాన్నంటుతున్న ధరలతో, కొనే తాహతు లేక, అల్పవేతన జీవులు, నిరుపేదలు పోషకాహార లోపానికి గురవుతున్నారు. ఇది వారి ఆయు ప్రమాణాలపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతున్నది.

ఇవాళ దేశంలో ప్రతి ఇద్దరిలో ఒక మహిళ రక్తహీనతతో బాధపడుతున్నది. వారిలో అత్యధిక శాతం అట్టడుగు వర్గాలు, నిరుపేద వర్గాల స్త్రీలే! దేశంలో పరిస్థితి ఇలాగే కొనసాగితే 2025 నాటికి ఐక్యరాజ్యసమితి విధించిన ప్రపంచ పౌష్టిక ఆహార లక్ష్యాలను గాని, 2030 నాటికి రెండవ సుస్థిరాభివృద్ధి లక్ష్యమైన 'జీరో హంగర్'ను గానీ చేరుకోవడం భారతదేశానికి పెనుసవాలే. ఇప్పటికైనా ప్రభుత్వాలు మేలుకొని వ్యవసాయం, ఆహార భద్రత, పౌష్టికాహార పంపిణీపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. 'అన్నార్తులు అనాథలుండని/ఆ నవయుగ మదెంత దూరమో?/ కరువంటూ కాటకమంటూ / కనుపించని కాలాలెపుడో?' అంటూ స్వప్నించిన మహాకవి కల ఎప్పటికి నెరవేరుతుందో...

విస్తరణ కోసం సామ్రాజ్యవాదం పాట్లు - ప్రమాదాలు




ప్రభాత్ పట్నాయక్

"తన ప్రభావాన్ని, తన పెత్తనం కింద ఉండే భూభాగాన్ని సైతం విస్తరించుకోడానికి ద్రవ్య పెట్టుబడి అనివార్యంగా తీవ్రంగా పాటుపడుతుంది" అని లెనిన్ తన ప్రసిద్ధ గ్రంథం "సామ్రాజ్య వాదం- పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ"లో పేర్కొన్నారు. సామ్రాజ్యవాద దేశాలు వాటిలో అవి తీవ్ర శత్రుత్వంతో తలపడుతున్న కాలంలో లెనిన్ ఈ గ్రంథాన్ని రాశారు. ఆ కాలంలో ప్రత్యర్థులుగా ఉన్న ఆయా దేశాల ద్రవ్య పెట్టుబడులు అప్పటికే ప్రపంచాన్ని తమ నడుమ పంచుకుని వున్నందున ఇక విస్తరించడానికి అదనంగా మిగిలిన జాగా అంటూ ఏదీ లేకపోయింది. అందుచేత తమ తమ పెత్తనాల కింద ఉన్న ప్రాంతాలను మళ్ళీ మరోసారి పునర్విభజన చేసుకోవడం మినహా వారికి వేరే దారి లేకపోయింది. అందుకు పరస్పరం యుద్ధాలలో తలపడడం తప్ప వేరే పద్ధతి లేకుండా పోయింది. అయితే ఆ యుద్ధాలు సామ్రాజ్యవాదం మొత్తంగా బలహీనపడడానికే దారితీశాయి. అంతేకాక, సామ్రాజ్యవాద పెత్తనం నుండి విడిపోయి విప్లవాల ద్వారా సోషలిస్టు దేశాలు ఏర్పడడానికి, ఆ సోషలిస్టు దేశాల మద్దతుతో అనేక వలస దేశాలు సామ్రాజ్యవాదుల ఆధిపత్యం నుంచి బయటపడడానికి కూడా ఆ పరిస్థితులు దారి తీశాయి.

అనంతర కాలంలో పెట్టుబడి కేంద్రీకరణ కొనసాగింది. అంతేగాక అదిబలపడింది. ఆ శక్తితోనే ద్రవ్య పెట్టుబడి ఇప్పుడు సామ్రాజ్యవాదుల నడుమ ఉండే వైరుధ్యాన్ని అదుపు చేయగలుగుతోంది. అక్కడితో ఆగకుండా ఇప్పుడు యావత్తు ప్రపంచమూ తన స్వైర విహారానికి దాసోహం అనాలనే వైఖరి తీసుకుంది. ఈ నేపథ్యంలో ఐక్యంగా వ్యవహరిస్తున్న సామ్రాజ్యవాద శిబిరం ఒకప్పుడు తన పెత్తనం కింద ఉన్న భూభాగాల్లో మళ్ళీ పెత్తనం చెలా యించడానికి తయారౌతోంది. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి, సామ్రాజ్యవాదం తమ లక్ష్యాలను నెరవేర్చుకోడానికి రెండు మార్గాలను అనుసరిస్తున్నాయి. మొదటిది: ప్రపంచం మొత్తం మీద నయా ఉదారవాద ఆర్థిక వ్యవస్థను బల వంతంగా రుద్దడం. ఈ విధానాలు వలస విముక్తి అనంతరం ఆయా దేశాలు సాధించిన పురోగతిని దెబ్బ తీస్తాయి. రెండవది: ఈ మొదటి ప్రయత్నం పని చేయని చోట్ల యుద్ధాలను పురికొల్పడం.

నయా ఉదారవాద వ్యవస్థ ప్రపంచవ్యాప్తంగా కార్మికవర్గాన్ని బలహీనపరచింది. తన ఉత్పత్తి కార్యకలాపాలన్నింటినీ తక్కువ వేతనాలకే పని చేసే కార్మికులుండే మూడవ ప్రపంచ దేశాలకు తరలించుకుపోతానని బెదిరిస్తూ అది అభివృద్ధి చెందిన దేశాల కార్మికవర్గాన్ని బెదిరిస్తోంది. ఆ విధంగా అక్కడ వేతనాలను పెరగనివ్వకుండా స్తంభింపజేసింది. ఉత్పత్తి కార్యకలాపాలు తరలివచ్చిన మూడవ ప్రపంచ దేశాలలో సైతం కార్మికుల నిజ వేతనాలలో పెరుగుదల ఏమీ లేదు. అక్కడ నిరుద్యోగం ఏ మాత్రమూ తగ్గకపోవడమే దీనికి కారణం. వేతనాలలో ప్రపంచం మొత్తం మీద ఎక్కడా పెరుగుదల లేకపోవడంతో బాటు శ్రామిక ఉత్పాదకత బాగా పెరిగింది. దాని ఫలితంగా ఆర్థిక సంపదలో పెట్టుబడిదారుల వాటా బాగా పెరిగింది. ముఖ్యంగా సంపన్న దేశాల వాటా బాగా పెరిగింది. ఆర్థిక అసమానతలు వేగంగా పెరిగిపోయాయి. దానితోబాటు శ్రామికుల వేతనాలలో పెరుగుదల లేని కారణంగా వారిలో అత్య ధికులు, ముఖ్యంగా మూడవ ప్రపంచ దేశాల శ్రామికులు పోషకాహార లేమితో బాధ పడుతున్నారు. మరోపక్క సంపన్నుల వద్ద పోగుబడే సంపద ఎంత పెరిగినా, వారి వినిమయం ఆ మేరకు పెరగదు. కనుక సమాజంలో అధికోత్పత్తి సమస్య ముందుకొచ్చింది (అధికోత్పత్తి అంటే ఉత్పత్తి అయే సరుకుల పరిమాణం పెరగడం అని మాత్రమే అనుకోరాదు. ప్రజల కొనుగోలు శక్తికి మించి ఉత్పత్తి ఉంటే అది అధికోత్పత్తి అవుతుంది. ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోయి, ఉత్పత్తి అయే సంపద ఇదివరకటి స్థాయిలోనే ఉన్నా అది అధికోత్పత్తి అవుతుంది.).



ఈ అధికోత్పత్తి సమస్యను పరిష్కరించడానికి కీన్స్ సూచించిన మార్గం ప్రభుత్వ వ్యయాన్ని పెంచడం. ఆ మార్గం ప్రస్తుత నయా ఉదారవాద వ్యవస్థలో అమలు చేయడం ప్రభుత్వాలకి సాధ్యం కాదు. ప్రభుత్వ వ్యయాన్ని పెంచి దేశంలో డిమాండ్‌ను బలపరచడానికి రెండు మార్గాలు న్నాయి. మొదటిది ద్రవ్య లోటును బాగా పెంచి రుణాలు తెచ్చి దానిని ఖర్చు చేయడం. రెండవది సంపన్నుల మీద అధికంగా పన్నులు వేసి ఆ ధనం ఖర్చు చేయడం. ఈ రెండు మార్గాలూ నయా ఉదారవాదానికి అంగీకారం కాదు. దానిని కాదని ఏ దేశమైనా ముందుడుగు వేస్తే వెంటనే ఆ దేశం నుండి అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఒక్కపాటున తరలిపోతుంది. ఆ దేశ ఆర్థిక వ్యవస్థ ఇబ్బందుల్లో పడు తుంది. అందుచేత ప్రతీ దేశమూ దాని నిబంధనలకు తలొగ్గి వ్యవహరిస్తున్నది.

నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థలో అనివార్యంగా తలెత్తిన ఈ అధికోత్పత్తి ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ఆర్థిక మాంద్యంలోకి నెడుతోంది. ఇదే సమయంలో నయా ఫాసిజం ఉవ్వెత్తున ముందుకొస్తోంది. ఈ నయా ఫాసిస్టు శక్తులతో కార్పొరేట్లు జత కట్టడానికి అనుకూలంగా ఉంటాయి. ఎందుకంటే నయా ఫాసిజం ప్రజానీకపు దృష్టిని ప్రస్తుత ఆర్థిక దోపిడీ నుంచి పక్కకు మళ్ళించగలిగే శక్తి కలిగివుంది. నయా ఫాసిస్టులు ప్రజలముందు వారి నిత్య జీవితపు భౌతిక పరిస్థితుల గురించి కాక, ఆ ప్రజల్లోని ఏవో కొన్ని మైనారిటీ సమూహాలపై (అవి మత పరంగా కాని, జాతి పరంగా గాని మైనారిటీలు కావచ్చు) విద్వేషాన్ని రెచ్చగొట్టి వారిని పరాయివారిగా చిత్రిస్తుంది. కొన్ని దేశాలలో నయా ఫాసిస్టు శక్తులు అధికారాన్ని చేజిక్కించుకున్నాయి. మరికొన్ని దేశాలలో అధికారం కోసం అర్రులు చాస్తున్నాయి. ఉదారవాద ప్రజాస్వామ్య వ్యవస్థల్లో నయా ఫాసిస్టు శక్తులు అధికారాన్ని పూర్తిగా చేజిక్కించుకోడానికి సాపేక్షంగా కొంత సమయం పట్టవచ్చు.

ఈ నయా ఫాసిస్టు శక్తులు అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఆయా దేశాలలో అధికోత్పత్తి సమస్య పరిష్కారం కాదు. ఆ దేశ ఆర్థిక వ్యవస్థ నయా ఉదారవాద చట్రం లోపలే నడుస్తూ వుంటుంది. అందుచేత అక్కడ ప్రభుత్వ వ్యయం పెంచి అధికోత్పత్తి సమస్యను పరిష్కరించడం ఆ నయా ఫాసిస్టు ప్రభుత్వాలకి కూడా సాధ్యం కాదు. ఆయా దేశాల ప్రభుత్వాలు ఆర్థిక మాంద్యం సమస్యని పరిష్కరించడంలో విఫలం అయినందువల్ల అక్కడ నయా ఫాసిస్టు శక్తులు బలపడితే దానికి సామ్రాజ్యవాదాన్ని ఎలా బాధ్యుల్ని చేస్తారు మీరు? అని కొందరు అడగ వచ్చు. సమాధానం ఒక్కటే. ఆర్థిక మాంద్యం నుండి బయట పడాలంటే ఏ దేశమైనా నయా ఉదారవాద చట్రం పట్టునుండి బయటపడాలి. అలా బయటపడేందుకు ఏ దేశమైనా ప్రయత్నిస్తే వెంటనే సామ్రాజ్యవాద దేశాలు, మరీ ముఖ్యంగా అమెరికా ఆ దేశం మీద ఆంక్షలు విధిస్తాయి. ఆ విధంగా సామ్రాజ్యవాదం తన గతకాలపు పెత్తనాన్ని తిరిగి సాధించడానికి చేస్తున్న ప్రయత్నాలు ప్రపంచమంతటా ప్రజానీకాన్ని తీవ్ర దారిద్ర్యంలోకి, కడగండ్లలోకి నెట్టడమే కాకుండా నయా ఫాసిస్టు శక్తులు బలపడడానికి సైతం ఊతం ఇస్తున్నాయి.

ఇక సామ్రాజ్యవాదం అనుసరించే రెండో మార్గం యుద్ధాలను పురికొల్పడం. ప్రస్తుతం నడుస్తున్న రెండు యుద్ధాలూ ప్రపంచాన్ని వినాశనం అంచుకు నెడుతున్నాయి. ఈ రెండు యుద్ధాలూ ఇలా కొనసాగడానికి వాటి వెనుక సామ్రాజ్యవాదం పోషిస్తున్న పాత్రే ప్రధాన కారణం. అంతే కాదు, ఈ రెండు యుద్ధాలూ అణు యుద్ధాలుగా మారిపోయే ప్రమాదం కూడా ఉంది. ఉక్రెయిన్ యుద్ధాన్నే తీసుకోండి. సోవియట్ యూనియన్ పతనం అయిన తర్వాత 'ఇకముందు నాటోను తూర్పు దిశగా విస్తరించబోము' అని సామ్రాజ్యవాద దేశాలు మిఖాయిల్ గోర్బచేవ్‌కు హామీ ఇచ్చాయి. కాని దానిని ఉల్లంఘించి ఉక్రెయిన్ వరకూ విస్తరించాయి. వాస్తవానికి ఉక్రెయిన్ కూడా నాటోలో చేరడానికి సుముఖత చూపలేదు. ఆ దేశంలో ఎన్నికల్లో గెలిచి దేశాధ్యక్షుడు అయిన విక్టర్ యానుకోవిచ్ నాటోలో చేరడానికి అంగీకరించలేదు. దానితో అతడిని కుట్ర ద్వారా కూలదోశారు. ఆ దేశానికి అమెరికా ప్రతినిధిగా వ్యవ హరించిన విక్టోరియా న్యూలాండ్ ఉక్రెయిన్‌లో గతంలో హిట్లర్‌కు అనుచరుడుగా వ్యవహరించిన స్టెపాన్ బండేరా కు చెందిన మద్దత్తుదారులను ఈ కుట్ర తర్వాత గద్దెనెక్కించారు. ఈ కొత్త తొత్తు ప్రభుత్వం నాటో కూటమిలో చేరడానికి సిద్ధపడింది. అంతేగాక, ఉక్రెయిన్‌లో రష్యన్ భాష మాట్లాడే ప్రజలు ఎక్కువగా ఉన్న డాన్‌బాస్ ప్రాంతం మీద దాడికి తలపడి వేలాది మంది ప్రాణాలు తీసింది. దాంతో రష్యా జోక్యం చేసుకోవలసివచ్చింది.

ఇక సామ్రాజ్యవాదం అనుసరించే రెండో మార్గం యుద్ధాలను పురికొల్పడం. ప్రస్తుతం నడుస్తున్న రెండు యుద్ధాలూ ప్రపంచాన్ని వినాశనం అంచుకు నెడుతున్నాయి. ఈ రెండు యుద్ధాలూ ఇలా కొనసాగడానికి వాటి వెనుక సామ్రాజ్యవాదం పోషిస్తున్న పాత్రే ప్రధాన కారణం. అంతే కాదు, ఈ రెండు యుద్ధాలూ అణు యుద్ధాలుగా మారిపోయే ప్రమాదం కూడా ఉంది. ఉక్రెయిన్ యుద్ధాన్నే తీసుకోండి. సోవియట్ యూనియన్ పతనం అయిన తర్వాత 'ఇకముందు నాటోను తూర్పు దిశగా విస్తరించబోము' అని సామ్రాజ్యవాద దేశాలు మిఖాయిల్ గోర్బచేవ్‌కు హామీ ఇచ్చాయి. కాని దానిని ఉల్లంఘించి ఉక్రెయిన్ వరకూ విస్తరించాయి.

ఈ యుద్ధం కొనసాగడానికి రష్యా ప్రధాన కారణమా లేక సామ్రాజ్యవాదులా అన్నది ప్రశ్న. దీనిని నిగ్గు తేల్చాలంటే ఒకే ఒక ప్రశ్నకు సమాధానం చెప్పాలి. ఇప్పుడు ఉక్రెయిన్‌కు, రష్యాకు మధ్య శాంతి ఒప్పందం జరగ కుండా అడ్డు పడుతున్నదెవరు?గతంలో ఫ్రాన్స్, జర్మనీ చొరవ చేసి ఈ రెండు దేశాలకూ నడుమ ఒక ఒప్పందం జరగడానికి కృషి చేశాయి. దానినే మిన్స్క్ ఒప్పందం అంటారు. ఆ ఒప్పందం మీద ఉక్రెయిన్ దేశాధ్యక్షుడు సంతకం చేసే లోనే అమెరికా పనుపున అప్పటి బ్రిటిష్ ప్రధాని బోరిస్ జాన్సన్ హుటాహుటిన కీవ్ పట్టణానికి వెళ్ళి ఆ సంతకాలు జరగకుండా అడ్డుపడ్డాడు. పోనీ, సామ్రాజ్యవాద దేశాలలో కనీసం ఫ్రాన్స్, జర్మనీ అయినా శాంతి కావాలి అని తాపత్రయంతో ఉన్నాయి అనుకుందామా అంటే అదీ లేదు. ఈ మధ్యనే జర్మనీ దేశాధినేత ఎంజెలా మెర్కెల్ ఒక ప్రకటన చేసింది. మిన్స్క్ ఒప్పందం అనేది ఉక్రెయిన్ యుద్ధానికి పూర్తిగా సిద్ధపడేవరకూ వ్యవధి తీసుకోడానికి ఒక సాకుగా మాత్రమే ప్రతిపాదించాం అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. వాస్తవానికి ఈ యుద్ధం వెనుక అసలు లక్ష్యం ఏమంటే రష్యా దేశాన్ని సామ్రాజ్యవాదుల పెత్తనం కిందకు తీసుకురావడమే. రష్యాకు బోరిస్ యెల్ట్సిన్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు దాదాపు రష్యా సామ్రాజ్యవాదుల పెత్తనం కిందకు పోయినంత పనైంది.

నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థలో అనివార్యంగా తలెత్తిన ఈ అధికోత్పత్తి ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ఆర్థిక మాంద్యంలోకి నెడుతోంది. ఇదే సమయంలో నయా ఫాసిజం ఉవ్వెత్తున ముందుకొస్తోంది. ఈ నయా ఫాసిస్టు శక్తులతో కార్పొరేట్లు జత కట్టడానికి అనుకూలంగా ఉంటాయి. ఎందుకంటే నయా ఫాసిజం ప్రజానీకపు దృష్టిని ప్రస్తుత ఆర్థిక దోపిడీ నుంచి పక్కకు మళ్ళించగలిగే శక్తి కలిగివుంది. నయా ఫాసిస్టులు ప్రజలముందు వారి నిత్య జీవితపు భౌతిక పరిస్థితుల గురించి కాక, ఆ ప్రజల్లోని ఏవో కొన్ని మైనారిటీ సమూహాలపై (అవి మత పరంగా కాని, జాతి పరంగా గాని మైనారిటీలు కావచ్చు) విద్వేషాన్ని రెచ్చగొట్టి వారిని పరాయివారిగా చిత్రిస్తుంది.

ఇక రెండో యుద్ధాన్ని తీసుకోండి. ఇజ్రాయిల్ అత్యంత క్రూరంగా, నిర్దాక్షిణ్యంగా పాలస్తీనా ప్రజలమీద అదే పనిగా దాడులు చేస్తూనేవుంది. ఇప్పుడు ఆ దాడులు లెబనాన్‌కు కూడా వ్యాపించాయి. అమెరికా సామ్రాజ్యవాదం ఇజ్రాయిల్‌లోని జాత్యహంకార ప్రభుత్వానికి పూర్తి అండగా నిలిచింది. ఇజ్రాయిల్ ప్రభుత్వ నేతలకు అమెరికా రాజకీ యాలను ప్రభావంతం చేసే శక్తి ఉన్నందునే ఈ మద్దత్తు పొందగలుగుతోంది అని పైపైన చూస్తే అనిపిస్తుంది. కాని అది పూర్తి గా తప్పు. బైటనుండి వలసదారులుగా పాలస్తీనా వచ్చి ఆఖరికి ఆ దేశస్తులైన పాలస్తీనా ప్రజలనే అక్కడినుంచి వెళ్లగొట్టే "వలసదారీ సామ్రాజ్యవాదం" (సెటిలర్ కొలోనియలిజం)లో పాత్రధారి ఇజ్రాయిల్ అయినా. అసలు సూత్రధారి మాత్రం సామ్రాజ్యవాదమే. ఆ వలసదారీ సామ్రాజ్యవాద విస్తరణ కోసమే ఇజ్రాయిల్ అక్కడ పాల స్తీనా జాతిని మొత్తంగా తుడిచి పెట్టడానికి పూనుకుంది. ఆ మధ్య ఆసియా ప్రాంతాన్ని మొత్తంగా ఇజ్రాయిల్ ద్వారా తన ఆధీనం లోకి తెచ్చుకోవడమే సామ్రాజ్యవాదం అసలు లక్ష్యం.

హమాస్ దుందుడుకుగా వ్యవహరించినందువల్లనే ఈ యుద్ధం మొదలైందని కొందరు వాదిస్తున్నారు. ఇజ్రాయిల్‌ది ప్రతీకారంగానే పరిగణిస్తున్నారు. కానీ ఈ యుద్ధం కొనసాగడానికి ఎవరు కారణమో నిగ్గు తేల్చాలంటే ఇందాకటి ప్రశ్ననే ఇక్కడ కూడా వేసుకోవాలి. ఇప్పుడు మధ్య ఆసియాలో శాంతి నెలకొనడానికి ఎవరు ఆటంకం? పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తిస్తూ, ఐరాసలో 194వ సభ్య దేశంగా ప్రకటించడానికి ఐరాస జనరల్ అసెంబ్లీలో తీర్మానం పెట్టిన ప్రతీసారీ దానిని వీటో చేస్తున్నది అమెరికానే. ఆ తీర్మానాన్ని ఆమోదించడం వలన ఆ ప్రాంతంలో సుస్థిరమైన శాంతిని నెలకొల్పడానికి సాధ్యపడుతుంది. ఒకవైపు ఇజ్రాయిల్, పాలస్తీనా రెండు దేశాలుగా పరిగణించ దానికి అంగీకరిస్తూనే అమెరికా దానిపై తీర్మానాన్ని వీటో చేయడం బట్టి అమెరికా పాలస్తీనాను ఒక దేశంగా అంగీ కరించడం అనేదే బూటకం అని స్పష్టమవుతోంది. ఇజ్రాయిల్, పాలస్తీనాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కోసం చర్చలు జరుగుతున్నాయి అంటూ అప్పుడప్పుడూ అమెరికా చేసే హడావుడి అంతా ఒక నాటకం. ఇజ్రాయిల్ ప్రభు త్వం మాత్రం అమెరికా అందిస్తున్న పూర్తి దన్నుతో విర్రవీగుతూ విచ్చలవిడిగా వ్యవహరిస్తోంది. ఈ దాడులు తీవ్రం ఔతూన్నకొద్దీ అది ఒక అణుయుద్ధంగా మారిపోయే ప్రమాదం నడినెత్తిన ఉంది.

ఆ విధంగా సామ్రాజ్యవాదం ఒక పక్క నయా ఉదారవాదాన్ని, రెండో పక్క యుద్ధాన్ని సాధనాలుగా చేసుకుని తన ప్రపంచవ్యాప్త పెత్తనానికి ప్రయత్నిస్తోంది. ఈ ప్రయత్నం ఒకపక్క నయా ఫాసిజానికి, రెండో పక్క మానవజాతి వినాశనానికి దారి తీస్తుంది.

(స్వేచ్ఛానుసరణ)

మరణ 'శిక్ష'



అతని వెన్నెముక, అతని గుండె, క్లోమం, ఒక్కొక్కటిగా అతని అవయవాలన్నీ బలహీనపడ్డాయి, జైల్లో వైద్యం లేకపోవడంతో, పేరుమోసిన అండ సెల్‌లో ఉంచారు. నిరంతర నొప్పి, తరచుగా మూర్ఛపోవడం, మూత్ర సమస్యలు, ఇవన్నీ అతని జీవితంలో భాగమై చివరికి అతన్ని భౌతికంగా లేకుండా చేశాయి. అతని విషాదమరణం రాజ్యాధికారాన్ని ప్రశ్నించే వారికి నేర న్యాయవ్యవస్థ అందించే కఠినమైన సవాళ్లను బహిర్గతం చేస్తుంది. మానవ హక్కుల కోసం ఉద్యమించిన ఒక తెలివైన విద్యావేత్త, సామాజిక క్రియాశీలత కలిగిన మేధావిని ఈ వ్యవస్థ తీవ్ర అసంతృప్తికి గురిచేసింది 1967లో పేరుమోసిన ఉగ్రవాద నిరోధక చట్టం చట్టవ్యతిరేక కార్యకలాపాల (నివారణ) చట్టం కింద మోసపూరిత ఆరోపణలకు పదేళ్ల క్రూరమైన ఖైదు అనుభవించాల్సి వచ్చింది. అతను ఒక్కసారి మాత్రమే కాదు రెండుసార్లు నిర్దోషిగా విడుదలైనప్పటికీ, అతని స్వేచ్ఛ స్వల్పకాలికం. ముంబై హైకోర్టు తర్వాత కేవలం ఏడునెలల్లో తీరని శోకాన్ని మిగిల్చి ఎన్నో ప్రశ్నలను నపుంసక సమాజానికి వేసి మౌనంగా నిష్క్రమించిన ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబా సుదీర్ఘకాలంగా రాజ్య అణచివేత తర్వాత పొందిన స్వాతంత్ర్యాన్ని ఆయన ఆస్వాదించలేకపోయారు.

ఉమ్మడి ఏపీ తూర్పుగోదావరి జిల్లాలోని అమలాపురానికి చెందిన సాయిబాబా కవి, రచయిత, నిష్ణాతుడైన అధ్యాపకుడు, విద్యావేత్త. ఆయన ఎంఏ ఇంగ్లీష్ అభ్యసించడానికి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో చేరారు. క్యాంపస్‌లో మండల్ కమిషన్ ఆం దోళన ఉధృతంగా సాగుతున్న సమయంలో విద్యార్థి రాజకీయాల్లోకి ప్రవేశించారు. జీవితాంతం పౌర హక్కుల ఉద్యమాలతో కలిసి పనిచేశారు. 1993లో రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ 35 రోజుల చేసిన నిరాహార దీక్షలో సాయిబాబా కీలకపాత్ర పోషించారు.అయితే ఆయనతో పాటు మరో ఐదుగురికి మావోయిస్టులతో సంబంధాలున్నాయని మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లా కోర్టు 2017లో దోషులుగా నిర్ధారించి జీవిత ఖైదు విధించింది. అప్పటినుండి అతను నాగ్‌పూర్ సెంట్రల్ జైలులో ఒంటరిగా నిర్బంధంలో ఉన్నారు. ముంబై హైకోర్టు ఐదున్నరేళ్ల ఏకాంత నిర్బంధం తర్వాత జైలునుంచి విడుదల చేయాలని ఆదేశించింది. ఆపై 24గంటల తర్వాత, ఆ ఉత్తర్వుపై సుప్రీంకోర్టు స్టే విధించడంతో మళ్లీ జైలుగోడల మధ్యే బందీ కావాల్సి వచ్చింది. తొంభై శాతం వికలాంగ రాజకీయ ఖైదీ, అతని సహ నిందితులు గత తొమ్మిది దేళ్లుగా శిక్ష ఎదుర్కొన్నా అ'న్యాయ' వ్యవస్థ అతన్ని జీవచ్ఛవంగా మార్చింది.

సాయిబాబా జీవితాంతం విద్యార్థులకు పాఠాలు బోధించడానికే ఇష్టపడ్డారు.అంతేకాదు, నిరంతరం అణగారిన ప్రజలతో జీవించాలనుకున్నారు. వెనుక బడినవర్గాలు చైతన్యం పొందడానికి విద్య అవసరమని, దానికి నాణ్యమైన విద్య అందుబాటులో ఉండాలని భావించారు. అది కూడా నాణ్యమైన విద్య అయి ఉండాలనే సంకల్పంతో ముప్పై ఐదేండ్లు బోధననే తన ఆయుధంగా మలచుకున్నారు. ప్రస్తుత విద్యావ్యవస్థ తీరు చూస్తుంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు దూరమవుతున్నట్లు కనిపిస్తున్నాయని ఆందోళన చెందారు. సమాన విద్యావకాశాలు పూర్తిగా మృగ్యమై పోయాయని మదనపడ్డారు. దళిత ఆదివాసీ విద్యార్థులకు పేరెన్నికగల సంస్థలు, ఉదారవాద విశ్వవిద్యాలయాలలో ప్రవేశం లేదని, ఒకవేళ వీరికి ప్రవేశం లభించినా వారు విశ్వవిద్యాలయాల్లో నిరంతరం వివక్షకు గురవుతు న్నారని వాపోయారు. కార్పొరేట్, సెంట్రల్ యూనివర్సిటీలు ధనికుల కోసమేనని, బడుగు బలహీన వర్గాల విద్యార్థులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు.

సాయిబాబా జీవితాంతం విద్యార్థులకు పాఠాలు బోధించడానికే ఇష్టపడ్డారు.అంతేకాదు, నిరంతరం అణగారిన ప్రజలతో జీవించాలనుకున్నారు. వెనుక బడినవర్గాలు చైతన్యం పొందడానికి విద్య అవసరమని, దానికి నాణ్యమైన విద్య అందుబాటులో ఉండాలని భావించారు. అది కూడా నాణ్యమైన విద్య అయి ఉండాలనే సంకల్పంతో ముప్పై ఐదేండ్లు బోధననే తన ఆయుధంగా మలచుకున్నారు. ప్రస్తుత విద్యావ్యవస్థ తీరు చూస్తుంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు దూరమవుతున్నట్లు కనిపిస్తున్నాయని ఆందోళన చెందారు. సమాన విద్యావకాశాలు పూర్తిగా మృగ్యమై పోయాయని మదనపడ్డారు.

'ఉపా' చట్టం కింద అరెస్టు అయిన ఆయన సుదీర్ఘ అణచివేత తర్వాత ఇటీవలే జైలు నుంచి బయటకు వచ్చారు. కానీ, తనకు లభించిన స్వేచ్ఛను పూర్తిగా అనుభవించలేదు. కర్కశ ప్రభుత్వం, మొత్తం వ్యవస్థ తన పట్ల చాలా క్రూరంగా ప్రవర్తించింది. అతని విషాద మరణం రాజ్యాధికారాన్ని ప్రశ్నించే వారికి, నేర న్యాయవ్యవస్థ అందించే కఠినమైన సవాళ్లను బట్టబయలు చేస్తున్నది. కడుపు నిండా దు:ఖం, గుండెలనిండా ఆవేశం వున్నా, ఏమీ చేయలేని నిస్సహాయులుగానే బతకాల్సిన దుస్థితి ఈ సమాజానిది. తీర్పు లకు, న్యాయానికి సంబంధం లేని దేశంలో, ఏ దిక్కు వెళ్లాలో తెలిసినా బలహీనంగానే ఉండాల్సిన పరిస్థితి. సమాజ మంతా కూడా నేడు మొద్దు బారిపోయి ఉంది. పెద్దగా ప్రశ్నించలేక పోతున్నది. పెద్దగా కదల్లేక పోతున్నది, మెదల్లేక పోతున్నది..గొంతు విప్పలేకపోతున్నది. ఏమిటి ఘోరం? ఈ శిక్షలేమిటి? ఎన్ని ఉరితీతలకి సమానం అండా సెల్‌లో చక్రాల కుర్చీతో ఏకాంతవాసం! ప్రాణాల్ని పీల్చే శీతల వాయువుల దాడిలో. ఇది గజదొంగలు పడ్డ దేశం. వాళ్లం దరి నుంచి మిమ్మల్ని ఎలా రక్షించుకోవాలో, ఎలా మిగిలించుకోవాలో తెలియలేదు బాబా! నీ..మరణం ఈ సమాజానికి నూతన ఉత్ప్రేరకం కావాలి. ప్రశ్నించేతత్వం, పేదల హక్కుల్ని రక్షించే ధైర్యం రావాలి. అదే మీకు సరైన నివాళి.

- డా.ముచ్చుకోట సురేష్‌బాబు,
9989988912

రెండు ఎన్నికలు, రెండు ఫలితాలు!



జమ్ము కాశ్మీర్ శాసనసభ ఎన్నికల ఫలితాలకు గొప్ప ప్రాధాన్యత వుంది. నేషనల్ కాన్ఫరెన్స్ నాయకత్వంలోని కూటమి తొంభై స్థానాలలో 49 గెలుచుకోవడం మోడీ ప్రభుత్వంపైన, జమ్ము కాశ్మీర్ రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేసి దాని ప్రత్యేక ప్రతిపత్తిని లేకుండా చేసిన దాని నిరంకుశ చర్యల పైన పెద్ద విజయం. తమ తరపున బినామీ శక్తులను రంగంలోకి దించి వేర్పాటువాద శక్తులను ప్రోత్సహించి ఓట్లను చీల్చాలనే బీజేపీ ఎత్తులను కూడా కాశ్మీర్ లోయలో ప్రజలు వమ్ము చేశారు. లోయలో బీజేపీకి 2.2 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయంటే కాశ్మీర్ ప్రజల అస్తిత్వాన్ని నాశనం చేసేందుకు హిందూత్వ శక్తులు ఆడిన నాటకాన్ని వమ్ము చేశారని అర్థం. అదే సమయంలో జమ్మూలో బీజేపీ (గతం కంటే మూడు అదనంగా తెచ్చుకుని) 29 స్థానాలతో విజయం సాధించడం, కాంగ్రెస్ కేవలం ఒక సీటు మాత్రమే తెచ్చుకోవడం చూస్తే జమ్ము కాశ్మీర్‌లోయ మధ్య మతపరమైన విభజన మరింత తీవ్రమైందని తెలుస్తుంది. కొత్త ప్రభుత్వం జమ్మూ ప్రాంత ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించడం, చోటు కల్పించడం ఎలాగన్నది పెద్ద సవాలుగానే ఎదుర్కొనవలసి వుంటుంది.

ఒమర్ అబ్దుల్లాకు సవాళ్లు

ఒమర్ అబ్దుల్లా నాయకత్వంలో ఏర్పడే నూతన ప్రభుత్వం తీవ్ర అవరోధాల మధ్య పని చేయవలసి వుంటుంది. ఇది ఒక కేంద్ర పాలిత ప్రాంత ప్రభుత్వంగా శాసనసభగా పనిచేయాల్సి వుంటుంది. జమ్ము కాశ్మీర్ గవర్నర్ విస్తారమైన అధికారాలు చలాయించ బోతున్నారు. జమ్ము కాశ్మీర్ పునర్విభజన చట్టం నిబంధనలకు సవరణలు చేయడం ద్వారా ఈ అధికారాలను మరింత బలోపేతం చేశారు. కాశ్మీర్ ప్రభుత్వం ఢిల్లీ ప్రభుత్వం లాంటి పరిస్థితినే ఎదుర్కొనవలసి వస్తుంది. జమ్ము కాశ్మీర్ స్వయం ప్రతిపత్తిని వెంటనే పునరుద్ధరించుకునే పోరాటక్రమంలో ప్రభుత్వ ఏర్పాటు మొదటి మెట్టుగా చూడాల్సి వుంటుంది. లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా కేంద్రం పెత్తనం చేసే విధానాన్ని అడ్డుకోవాలంటే పూర్తి స్థాయి రాష్ట్ర హోదా పునరుద్ధరణ వల్ల మాత్రమే బాట ఏర్పడుతుంది.

హర్యానాలో ఊహించని ఫలితాలు

హర్యానాలో బీజేపీ విజయం ఊహించనిదే. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మొగ్గు వుందనే అభిప్రాయం విస్తారంగా వుండింది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలన్నీ ఆ పార్టీనే విజయం సాధిస్తుందని చెప్పాయి. కానీ తీరా చూస్తే కాంగ్రెస్ కేవలం 37 మాత్రమే తెచ్చుకోగా బీజేపీ 48 స్థానాలతో విజయం సాధించింది. బీజేపీకి 39.9 ఓట్ల శాతం రాగా కాంగ్రెస్ 39.3 ఓట్ల శాతం వచ్చింది. అంటే తేడా కేవలం 0.6 శాతం మాత్రమే వుంది. ఆప్‌కు 1.8 శాతం ఓట్లు వచ్చాయి. ఈ నేపథ్యంలో చూస్తే కాంగ్రెస్ ఆప్, సమాజ్‌వాది పార్టీలతో సీట్ల సర్దుబాటు కుదుర్చుకోలేకపోయిన ప్రభావం ప్రాధాన్యత సంతరించుకుంటుంది. బీజేపీ జాట్ యేతర కులాల కూటమి మద్దతు కూడగట్టడంలో ఫలప్రదమైనట్టు కనిపిస్తుంది. భూపేందర్ సింగ్ హుడా నాయకత్వం కారణంగా కాంగ్రెస్ జాట్ యేతర కులాలను ఆకట్టుకునేలా విశాలంగా ఆకర్షించలేక పోయింది. ముఠా తగాదాలు, అనైక్యత కూడా కాంగ్రెస్ దెబ్బ తినడానికి కారణమైంది. బీజేపీ, ఆరెస్సెస్‌లు మైనార్టీలను లక్ష్యంగా చేసుకుని ఓ క్రమపద్ధతిలో సాగించిన మతపరమైన ప్రచారం కూడా ఇందుకు కారణమైందనే విషయం అంతగా గమనంలోకి రావడం లేదు. ఈ ప్రచారాలను తిప్పికొట్టడంలో కాంగ్రెస్ దాదాపుగా విఫలమైంది. హర్యానాలో బీజేపీ విజయం హిందూత్వ శక్తులకు మరింతగా కొమ్ములు తెస్తుందనడంలో సందేహం లేదు.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

మరింత దృఢంగా ముందుకు..

బీజేపీ కేంద్రంలో మెజార్టీ తెచ్చుకోవడంలో ఎదురుదెబ్బ తిన్నప్పటికీ..హిందూత్వ కూటమి ఓట్లను కూడగట్టడంలో దాని బలాన్ని ఎంతమాత్రం తక్కువ అంచనా వేయడానికి లేదని లోక్‌సభ ఎన్నికల తర్వాత సీపీఐ(ఎం) హెచ్చరించింది. బీజేపీ, ఆరెస్సెస్ భావజాలం పైన, రాజకీయాల పైన నిరంతరాయంగా పోరాటం సాగించేలా వామపక్ష, లౌకిక, ప్రజాస్వామిక శక్తుల సంకల్పాన్ని హర్యానా ఎన్నికల ఫలితాలు మరింత దృఢతరం చేయాలి.

(అక్టోబరు 9 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

బిజినెస్

వాహన అమ్మకాలు వెలవెల

- పివి విక్రయాల్లో 2 శాతం క్షీణత
- 11 శాతం తగ్గిన వాణిజ్య వాహనాలు
- సియోమ్ వెల్లడి



న్యూఢిల్లీ : దేశ ఆర్థిక వ్యవస్థకు గీటురాయిగా భావించే వాహన అమ్మకాలు పడిపోయాయి. పండగ సీజన్‌లో పెరగాల్సిన అమ్మకాలు.. తగ్గిపోవడంతో పరిశ్రమ వర్గాల్లో ఆందోళన నెలకొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో ప్యాసింజర్ వాహన అమ్మకాలు 1.8 శాతం పతనమై 10,74,395 యూనిట్లకు పరిమితమయ్యాయని సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్‌ఫాక్చరర్స్ (సియోమ్) ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. ఇదే సమయంలో ఎగుమతులు 13.3 శాతం పెరిగి 13,35,681 యూనిట్లుగా చోటు చేసుకున్నాయి.

సోమవారం సియోమ్ వెల్లడించిన గణంకాల ప్రకారం.. గడిచిన సెప్టెంబర్ త్రైమాసికంలో వాణిజ్య వాహన అమ్మకాలు ఏకంగా 11 శాతం క్షీణించి 2,20,643 యూనిట్లకు పరిమితమయ్యాయి. 2023-24 ఇదే క్యూ2లో 2,47,801 యూనిట్ల విక్రయాలు జరిగాయి. క్రితం క్యూ2లో భారీ, మధ్య తరహా వాణిజ్య వాహన విక్రయాలు 12.2 శాతం పతనమై 82,409 యూనిట్లుగా నమోదయ్యాయి.. తేలికపాటి వాణిజ్య వాహన విక్రయాలు 10.2 శాతం పతనమై 1,38,234 యూనిట్లకు పరిమితమయ్యాయి. క్రితం క్యూ2లో ద్విచక్ర వాహన అమ్మకాలు మాత్రం 12.6 శాతం పెరిగి 51,79,349 యూనిట్లు చోటు చేసుకున్నాయి. త్రిచక్ర వాహన విక్రయాలు 6.6 శాతం పెరిగి 2,08,718 యూనిట్లుగా నమోదయ్యాయి.

రాణించిన ఎగుమతులు..

గడిచిన సెప్టెంబర్ త్రైమాసికంలో ప్యాసింజర్ వెహికల్ ఎగుమతులు 6.3 శాతం పెరిగి 1,96,196 యూనిట్లుగా నమోదయ్యాయి. వాణిజ్య వాహనాలు 16 శాతం పెరిగి 19,990 యూనిట్లుగా ఉండగా.. త్రిచక్ర వాహనాలు స్వల్పంగా పెరిగి 81,918 యూనిట్లుగా చోటు చేసుకున్నాయి. ద్విచక్ర వాహన ఎగుమతులు ఏకంగా 15.8 శాతం 8,94,591 యూనిట్లుగా నమోదయ్యాయి. మొత్తంగా ఎగుమతులు 13.3 శాతం పెరిగి 13,35,681 యూనిట్లుగా చోటు చేసుకున్నాయి. దేశీయ అమ్మకాలు పడిపోవడం ఆర్థిక వ్యవస్థలో మందగమనానికి నిదర్శనం. ప్రజల ఆదాయాలు తగ్గిపోవడం వల్లే వాహన అమ్మకాలు పడిపోతున్నాయి. పరిస్థితులు ఇలాగే కొనసాగితే క్రమంగా అన్ని రంగాల్లోనూ స్తబ్దత చోటు చేసుకోనుంది. ఇది ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపనుంది.

టపాసుల నుంచి రక్షణకు రూ.9కే బీమా

ముంబయి : దీపావళి సందర్భంగా టపాసుల కాల్చే సమయంలో ప్రమాదవశత్తు గాయపడే వారికి బీమా అందించే ఉద్దేశ్యంతో కొత్త తరహా బీమా పథకాన్ని ప్రవేశపెట్టినట్లు ఫోన్ పే తెలిపింది. రూ.9 చెల్లించడం ద్వారా రూ.25వేల వరకు కవరేజీ పొందవచ్చని పేర్కొంది. అక్టోబర్ 25 నుంచి 10 రోజుల పాటు ఈ బీమా కవరేజీ లభిస్తుందని వెల్లడించింది. ఫోన్‌పేలోని ఇన్సూరెన్స్ విభాగంలోకి వెళ్లి 'ఫైర్ క్రాకర్ ఇన్సూరెన్స్‌ను క్లిక్ చేసి దీన్ని పొందవచ్చని పేర్కొంది.

మీషోతో మామార్త్ భాగస్వామ్యం

హైదరాబాద్ : ప్రముఖ సౌందర్య ఉత్పత్తుల బ్రాండ్ మామార్త్ ఇ-కామర్స్ సంస్థ మీషోతో భాగస్వామ్యం కుదర్చుకుంది. తృతీయ శ్రేణీ నగరాలు, చిన్న పట్టణాల మార్కెట్‌లో విస్తరించడానికి మీషోతో ఒప్పందం దోహదం చేయనుందని పేర్కొంది. ఈ వేదికపై వచ్చే ఏడాది కాలంలో రూ.100 కోట్ల రెవెన్యూ చేరాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొంది.

దక్షిణాదిలో డైపోల్ కార్యకలాపాల విస్తరణ

- హైదరాబాద్ ఇన్నోవేషన్ ల్యాబ్ ఏర్పాటు

నవ తెలంగాణ - హైదరాబాద్

అస్ట్రేలియాలో 12 ఏళ్లుగా ఐటీ, కమ్యూనికేషన్స్, బ్రాడ్ కాస్టింగ్ రంగంలో సేవలందిస్తున్న డైపోల్ గ్రూపు భారత్‌లో తన కార్యకలాపాలను విస్తరించింది. ప్రధానంగా దక్షిణాదిలో తన కార్యకలాపాలను విస్తరించడంతోపాటు ప్రధాన కార్యాలయం ఏర్పాటు, ఉపాధి కల్పనపై ప్రధానంగా దృష్టి సారించింది. విజయవాడలో తాజాగా తన ప్రధాన కార్యకలాపాల కార్యాలయాన్ని ప్రారంభించగా హైదరాబాద్, బెంగళూరులో తన ఇన్నోవేషన్ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. విజయవాడలో నూతనంగా ఏర్పాటు చేసిన సంస్థ ప్రధాన కార్యాలయాన్ని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు ప్రారంభించారని తెలిపింది. రాబోయే 3-5 సంవత్సరాలలో, డిపోల్ గ్రూప్ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. దాదాపు 500 మందికి పైగా అత్యంత నైపుణ్యం కలిగిన ఐటి నిపుణులకు ఉపాధి, స్థానిక ఉద్యోగ కల్పన కల్పిస్తామని ఆ సంస్థ ఫౌండర్ రవి నెక్కలపూడి, ఎండి సాగర్ చాష్కే తెలిపారు.

ఆశీర్వాద్ స్మార్ట్‌తో అయోడిన్‌పై అవగాహన

హైదరాబాద్ : అయోడిన్ లోపం సమస్యల (ఐడిడి)ను అధిగమించడానికి ఐటిసి ఇన్స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ డెవలప్‌మెంట్ భాగస్వామ్యంతో ఐటిసి లిమిటెడ్ ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా ప్రోగ్రాంను ప్రారంభించినట్లు పేర్కొంది. ఇది తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలలో ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడాన్ని ప్రోత్సహిస్తుందని పేర్కొంది. అయోడిన్ వినియోగం ప్రాధాన్యత గురించి 30 జిల్లాల్లో 5 లక్షల మంది వ్యక్తులలో అవగాహన పెంచనున్నట్లు ఐటిసి లిమిటెడ్ ప్రతినిధి అనుజ్ రుస్తగి పేర్కొన్నారు.

ఎఫ్‌డీడీఐ నాలుగో స్నాతకోత్సవ వేడుకలు

నవ తెలంగాణ - హైదరాబాద్

నగరంలోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ (ఎఫ్‌డీడీఐ) నాలుగో స్నాతకోత్సవ వేడుకలు సోమవారం ఆ సంస్థ ప్రాంగణంలో ఘనంగా జరిగాయి. దీనికి ముఖ్య అతిథిగా తెలంగాణా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, ఎఫ్‌డీడీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నరసింహుగాని తేజ్ లోహిత్ రెడ్డి పాల్గొన్నారు. తాజా ధోరణులకు అనుగుణంగా పాదరక్షలు, ఫ్యాషన్, రీటైల్, తోలు ఉత్పత్తుల రంగంలో నిలదొక్కుకొనేందుకు సృజనాత్మకతను, పారిశ్రామిక స్ఫూర్తిని అలవర్చుకోవాలని విద్యార్థులకు గవర్నర్ పిలుపునిచ్చారు.

సుదర్శన్ కెమికల్ చేతికి హ్యూబాక్ గ్రూప్..!

ముంబయి : జర్మనీకి చెందిన హ్యూబాక్ గ్రూప్‌నకు చెందిన ఆస్తులు, షేర్ల కొనుగోలుకు సంబంధించి డెఫినిటివ్ ఒప్పందం కుదుర్చుకున్నట్లు సుదర్శన్ కెమికల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఎస్‌సిఐఎల్) తెలిపింది. హ్యూబాక్ సాంకేతిక సామర్థ్యాల కలయికతో ఒక అంతర్జాతీయ పిగ్మెంట్ కంపెనీ ఏర్పాటుకు దోహదపడుతుందని ఎస్‌సిఐఎల్ ఎండి రాజేష్ రాఠీ విశ్వాసం వ్యక్తం చేశారు. కీలకమైన గ్లోబల్ మార్కెట్లలో సేవలు అందించేందుకు దోహదపడేలా రెండు సంస్థలను కలిపే ఈ ఒప్పందాన్ని కుదుర్చుకోవడం సంతోషకరమైన విషయమన్నారు.

విశ్వాసానికి బ్లాక్ గ్రూప్ ప్రతీక

- సినీనటీ ఐశ్వర్య మీనన్

నవ తెలంగాణ -హైదరాబాద్

నాణ్యత, విశ్వాసానికి బిల్డింగ్ బ్లాక్ గ్రూప్ (బిబిజి) ప్రతీక అని సినీ నటి ఐశ్వర్య మీనన్ అన్నారు. నోవాటెల్ హెచ్‌ఐసిసిలో 474వ గ్రాండ్ టాలెంట్ అవార్డుల వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా ఐశ్వర్య మాట్లాడుతూ ఇళ్లను నిర్మించడమే కాకుండా భవిష్యత్తును నిర్మించడంలో కూడా బ్లాక్ గ్రూప్ ముందుందన్నారు. మహిళా సాధికారత పట్ల చూపిస్తున్న శ్రద్ధ అమోఘమన్నారు. వ్యాపారంతో పాటు సమాజం పట్ల ఉన్న బాధ్యతకు ఇది నిదర్శనమన్నారు. తాము ఇప్పటి వరకు 240 ప్రాజెక్టులు పూర్తి చేశామని బిల్డింగ్ బ్లాక్ గ్రూప్ సిఎండి మల్లికార్జున రెడ్డి తెలిపారు.

గ్రామీణ రోడ్లపై సర్కార్ నజర్

- రూ.1377.66 కోట్లు విడుదల
- 92 నియోజకవర్గాలకు ప్రాధాన్యం
- త్వరలో మరో రూ.400 కోట్లు ?



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామీణ రోడ్లపై రాష్ట్ర సర్కార్ నజర్ పెట్టింది. ప్రజలకు ప్రయాణాల్లో ఎదురవుతున్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని 1323.86 కిలోమీటర్ల మేర కొత్తరోడ్లు, మరమ్మత్తుల కోసం శ్రీకారం చుట్టింది. అందుకోసం రూ.1377.66 కోట్లను విడుదల చేసింది. త్వరలో మరో రూ.400 కోట్లను విడుదల చేసేందుకు కసరత్తు చేస్తున్నది. తరుచూ అసెంబ్లీ సమావేశాల్లోనూ గ్రామీణ రోడ్ల అధ్వాన్న స్థితిపైనే అధికార, విపక్ష ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుండటంతో వాటిపై సర్కార్ దృష్టిపెట్టింది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో భాగంగా మారుమూల పల్లెలకు రోడ్డు సౌకర్యం కల్పించడంపై ప్రాధాన్యం కల్పించింది. పల్లెలకు మధ్య అనుసంధానంగా ఉండే లింకురోడ్లను కూడా నిర్మాణం చేపట్టనున్నది. దీంతో పదేండ్ల కాలంలో కనీసం చిన్నచిన్న మరమ్మత్తులకు కూడా నోచుకోని రోడ్లకు ఈసారి మహర్దశ పట్టనున్నది. ఎమ్మెల్యేలు, ఎంపీల వినతులు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం గుర్తించిన రోడ్లను పరిగణనలోకి తీసుకుని ముందుకెళ్లాలని రాష్ట్ర సర్కారు నిర్ణయం తీసుకున్నది. అందులో భాగంగానే గ్రామీణ నేపథ్యమున్న 92 నియోజవర్గాలకు ప్రాధాన్యం కల్పించింది. అందులోనూ ప్రజల ప్రయాణాలకు అత్యంత అవసరమున్న కొత్త రోడ్లను వేయడంపై దృష్టిసారించింది. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో 1323.86 కిలోమీటర్ల మేర నూతన రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది.

నల్లగొండ నియోజక వర్గంలో అత్యధికంగా 42.55 కిలోమీటర్లు, బాన్సువాడ నియోజకవర్గంలో 39.90 కిలోమీటర్ల మేర రోడ్లను వేయనున్నది. మహబూబాబాద్ నియోజకవర్గానికి అత్యధికంగా రూ.35 కోట్లను విడుదల చేసింది. చాలా నియోజకవర్గాలకు రూ.15 కోట్లకుపైనే ప్రకటించింది. ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నా గ్రామీణ రోడ్లకు పట్టుబట్టి నిధులు సాధించిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) విజయం సాధించారు. సీఎం, ఆర్థిక మంత్రుల వద్ద పట్టిబట్టి మరీ పంచాయతీ రోడ్లకు నిధులు విడుదల చేయించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అనేక జిల్లాల్లో గ్రామీణ రోడ్లు, లింకు రోడ్లు దెబ్బతిన్న సంగతి తెలిసిందే. వాటి పునరుద్ధరణ కోసం కూడా ఇప్పటికే రూ.24 కోట్లు కేటాయించిన విషయమూ విదితమే. త్వరలో వాటి కోసం రూ.50 కోట్లు కూడా కేటాయించ బోతున్నట్లు తెలిసింది.

సీఎంకు ధన్యవాదాలు

మంత్రి దాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క)

గ్రామీణ రోడ్లకు 1377.66 కోట్ల రూపాయలను విడుదల చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు. అవసరాన్ని, అవకాశాన్ని బట్టి మరిన్ని నిధులు విడుదల చేయించేందుకు కృషిచేస్తా. సీఆర్‌ఆర్ రోడ్ల కోసం రెండు, మూడు రోజుల్లో మరో రూ.400 కోట్ల మేర నిధులు మంజూరు చేయబోతున్నాం.

ఫాక్స్‌కాన్‌కు సీఎం రేవంత్



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సోమవారం రంగారెడ్డి జిల్లాలోని ఫాక్స్‌కాన్ పరిశ్రమను సందర్శించారు. కొంగరకలాన్‌లో ఉన్న ఆ కంపెనీని కలియతిరిగారు. సంబంధిత కంపెనీ ప్రతినిధులతో ఈ సందర్భంగా భేటీ అయ్యారు. కంపెనీ పురోగతి, ఇతర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఫాక్స్‌కాన్ చైర్మెన్ యాంగ్ లియూతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలపై మాట్లాడారు. కంపెనీకి కావాల్సిన మౌలిక సదుపాయాల విషయంలో ఎలాంటి అనుమానాలు అక్కర్లేదని హామీ ఇచ్చారు. మరిన్ని విభాగాల్లో పెట్టుబడులకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎలక్ట్రిక్, లిథియం బ్యాటరీ విభాగాల్లోనూ పెట్టుబడులు పెట్టాలని కంపెనీ చైర్మెన్‌ను కోరారు. దాదాపు గంటకుపైగా కంపెనీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని కంపెనీ ప్రతినిధులు సన్మానించారు. సీఎం వెంట పరిశ్రమల శాఖ మంత్రి డి శ్రీధర్‌బాబు, శాసనమండలి చీఫ్ విప్ పి.మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జయప్రకాశ్‌రెడ్డి, కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్‌రంజన్, టీఎస్‌ఐఐసీ చైర్మెన్ విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



పదోన్నతులు ఇచ్చినందుకు థ్యాంక్స్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో ఉద్యోగులకు పదోన్నతులు ఇచ్చినందుకు తెలంగాణ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ డిప్యూటీ సీఎం, విద్యుత్, ఆర్థిక శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క, విద్యుత్‌శాఖ కార్యదర్శి రొనాల్డ్‌రోస్‌కు కృతజ్ఞతలు తెలిపింది. సోమవారం అసోసియేషన్ ప్రతినిధి బృందం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మంత్రినీ, ఆ శాఖ కార్యదర్శిని కలిసి పుష్పగుచ్చాలు అందించి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా టీజీజెన్‌కోలో 170 మంది ఏఈలు, 33 మంది ఏఏఈలకు ఏడీఈలుగా పదోన్నతి కల్పించారని తెలిపారు. ఎలక్ట్రికల్ విభాగంలో 34 మంది ఏడీఈలకు డీఈలుగా, ఏడుగురు డీఈలకు ఎస్ఈలుగా, ఇద్దరు ఎస్ఈలకు సీఈలుగా పదోన్నతులు లభించాయని వివరించారు. వీరితో పాటు మరికొందరికి కూడా పదోన్నతులు ఇచ్చినందుకు సంతోషం వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం, విద్యుత్‌శాఖ కార్యదర్శిని కలిసిన వారిలో అధ్యక్ష, కార్యదర్శులు పీ రత్నాకరరావు, సదానందం, సహాధ్యక్షులు వెంకటనారాయణరెడ్డి, కిషోర్, సురేష్‌కుమార్, పీవీ రావు, అసిస్టెంట్ ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వేణు, అనిల్‌కుమార్, సుజిత్, రాజు, రాజేష్, రెమెడీ శ్రీనివాస్, నాగరాజు తదితరులు ఉన్నారు.

తూర్పు రైల్వే నుంచి ఎంఐసికి ఆర్డర్

హైదరాబాద్ : ఎల్ఇడి వీడియో డిస్‌ప్లేల రూపకల్పన, తయారీలో ఉన్న ఎంఐసి ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్‌కు తూర్పు రైల్వే జోన్‌లోని మాల్దా డివిజన్ నుంచి కొత్త ఆర్డర్ దక్కినట్లు తెలిపింది. అభయ్‌పూర్‌లో సీఐబీని అందించడానికి రైల్వే నుంచి అంగీకార పత్రాన్ని అందుకున్నట్లు పేర్కొంది. ఎల్ఇడి డిస్‌ప్లే కోసం ఇటీవల దక్షిణ రైల్వే జోన్‌లోని సేలం డివిజన్ నుంచి కూడా ఆర్డర్‌ను పొందినట్లు గుర్తు చేసింది.

ఉజ్జీవన్ ఎస్ఎఫ్‌బి డిపాజిట్లలో 17శాతం వృద్ధి

హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ త్రైమాసికంలో 17 శాతం వృద్ధితో రూ.34,046 కోట్ల డిపాజిట్లను నమోదు చేసినట్లు ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ తెలిపింది. 2023 ఇదే సమయంలో రూ.29,139 కోట్ల డిపాజిట్లు చోటు చేసుకున్నాయి. 2024 సెప్టెంబర్ 30 నాటి త్రైమాసికంలో బ్యాంక్ కరెంట్ ఎకౌంట్, సేవింగ్స్ ఎకౌంట్ (కాసా) డిపాజిట్లు 26 శాతం పెరిగి రూ.8,822 కోట్లుగా నమోదయ్యాయి. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 2.2 శాతం నుంచి 2.5 శాతానికి పెరిగాయి.

రిలయన్స్ లాభాల్లో 5 శాతం తగ్గుదల

న్యూఢిల్లీ : ముకేష్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ 2024-25 సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికం (క్యూ2)లో 5 శాతం తగ్గుదలతో రూ.16,563 కోట్ల నికర లాభాలు నమోదు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.17,394 కోట్ల లాభాలు ప్రకటించింది. క్రితం క్యూ2లో కంపెనీ రెవెన్యూ స్వల్పంగా 0.2 శాతం పెరిగి రూ.2.35 లక్షల కోట్లుగా చోటు చేసుకుంది. మరోవైపు రిలయన్స్ జియో నికర లాభాలు మాత్రం 23.4 శాతం పెరిగి రూ.6,539 కోట్లకు ఎగిశాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.5,299 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.26,875 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన క్యూ2లో 18 శాతం ఎగిసి రూ.31,709 కోట్లకు పెరిగింది. సగటు వినియోగదారుడి నుంచి రెవెన్యూ రాబడి 7.4 శాతం పెరిగి రూ.195.1గా నమోదయ్యింది. ఇటీవల పెంచిన టారీఫ్‌లు కలిసి వచ్చాయని ఆ కంపెనీ పేర్కొంది. సెప్టెంబర్ త్రైమాసికంలో వినియోగదారులు 4.2 శాతం పెరిగి మొత్తంగా 47.88 కోట్లకు చేరినట్లు వెల్లడించింది.

వణుకుతున్న దక్షిణ కోస్తా

- పలు జిల్లాల్లో భారీ వర్షాలు
- పాఠశాలలకు సెలవులు
- తమిళనాడులో తొమ్మిది జిల్లాలకు రెడ్ అలర్ట్



ఒంగోలు ఆర్‌టిసి బస్టాండ్ సెంటర్ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

అమరావతి- యంత్రాంగం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుపాన్‌గా బలపడుతుందన్న హెచ్చరికల నేపథ్యంలో దక్షిణ కోస్తా జిల్లాలు వణుకుతున్నాయి. రానున్న రెండు రోజుల్లో అల్పపీడనం మరింతబలపడి ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తా వైపుగా ప్రయనిస్తుందని వాతావరణశాఖ తెలిపింది. దీని ప్రభావంతో సోమవారం నాడే తమిళానాడుతో పాటు దక్షిణ కోస్తా, రాయలసీమలోని పలు జిల్లాల్లో ఒక మోస్తరు నుండి భారీ వర్షాలు కురిశాయి. పలు చోట్ల పల్లపు ప్రాంతాలు జలమయ్యాయి. ముందు జాగ్రత్త చర్యగా పాఠశాలలకు సెలవు ప్రకటించారు. చేపల వేటను నిలిపివేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయడు, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ విడివిడిగా సమీక్షా సమావేశాలు నిర్వహించారు. అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం నుండి రాయలసీమతోపాటు, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు, కృష్ణా విశాఖ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఆకాశం మేఘావృతమైంది. ఈ జిల్లాల్లో పంచాయతీరాజ్, రోడ్లు భవనాలు, విద్యుత్, రెవెన్యూ, పోలీసు, నీటి పారుదల, వైద్య, గ్రామీణ నీటి సరఫరా శాఖల సిబ్బంది, పారిశుధ్య కార్మికులకు సెలవులు రద్దు చేశారు. తీరప్రాంతంలో సముద్రపు అలలు ఎగిసిపడుతున్నాయి. పలు చోట్ల సముద్రం ముందు కొచ్చింది. తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఆదివారం రాత్రి నుంచి సోమవారం సాయంకాలం వరకూ ఎడతెరిపి లేని వర్షం కురుసింది. ఈ జిల్లాలో బుధవారం వరకూ స్కూళ్లకు సెలవులు ప్రకటించారు. జలపాతాల వద్ద, ప్రాజెక్టుల వద్ద 'నో ఎంట్రీ' బోర్డులను ఏర్పాటు చేసింది. మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేశారు. నెల్లూరు జిల్లా వ్యాపితంగా 37 మీల్లి మీటర్ల వర్షపాతం నమోదైంది. మర్రిపాడు మండలం కేతమన్నేరు వాగు ఉధృతంగా ప్రవహి స్తోంది. ప్రకాశం జిల్లాలో ఒంగోలు, మద్దిపాడు, గిద్దలూరు, కోమరోలులో భారీ వర్షం కురిసింది. బాపట్ల, చీరాల, వేటపాలెం,. చినగంజాం, నిజాంపట్నం, కృష్ణా జిల్లా మచిలీపట్నం, అవనిగడ్డల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది.

పిడుగుపాటుకు ఒకరి మృతి

కాకినాడ జిల్లా కాజులూరు మండలం ఉప్పుమిల్లి గ్రామానికి చెందిన నందికొండ వీరస్వామి(35) తన రెండు గేదేలను పాకలో కట్టేసేందుకు పశువుల వద్దకు వెళ్లారు. పశువులను కట్టేస్తుండగా అతనికి సమీపంలో పిడుగుపడింది. తీవ్రంగా గాయపడిన వీరస్వామిని యానాం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

తమిళనాడులో...

తమిళనాడులోని కోయయంబత్తూరు, మధురై జిల్లాలో ఇప్పటికే భారీ వర్షాలు కురుస్తుండటంతో జనజీవనం స్థంబించింది. హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. చెన్నై, తిరువళ్లూరు,కాంచీపురం, చెంగల్ పట్ జిల్లాలో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించింది. మంగళవారం నుండి శుక్రవారం వరకు ఐటి ఉద్యోగులకు ఇంటి నుంచే పని విధానం అమలు చేయాలంది. మరోవైపు బుధవారం చెన్నైతో పాటు, పరిసర ప్రాంతాల్లోని మరో ఎనిమిది జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది.

ఆస్తి, ప్రాణ నష్టం లేకుండా చర్యలు : చంద్రబాబు

అమరావతి బ్యూరో : అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో పలు జిల్లాల్లో భారీ వర్షాలు పడుతుండటంతో ఆస్తి, ప్రాణ నష్టం లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సిఎం చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఆయన సోమవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెరువులు, కాలువలు, నీటి వనరుల వద్ద అప్రమత్తంగా ఉండటంతో పాటు పర్యవేక్షణ ఉంచాలన్నారు. వాగులు, కాలువలు వద్ద అవసరమైన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, రెయిన్‌ఫాల్ వివరాలను కూడా రియల్ టైమ్‌లో అందుబాటులో ఉంచాలని చెప్పారు. అతి భారీ వర్షాలు ఉండే ప్రాంతంలో ప్రజలకు ముందుగా సమాచారం ఇచ్చి అప్రమత్తం చేయాల సూచించారు. నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అవసరమైన ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌టిఆర్‌ఎఫ్ టీమ్స్ సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు.

ఫుడ్స్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించిన మంత్రి సీతక్క

- బాలామృతం, ఆహార వస్తువుల పరిశీలన



నవతెలంగాణ-కాప్రా

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నాచారంలోని తెలంగాణ ఫుడ్స్ కార్యాలయాన్ని, కర్మాగారాన్ని మంత్రి సీతక్క సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆహార పదార్థాల నాణ్యత, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. ఆహార పదార్థాల శుద్ధి, ప్రాసెసింగ్ యూనిట్‌ను సందర్శించి పని విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రాలకు బాలామృతం సహా పలు రకాల ఆహార వస్తువులను తెలంగాణ ఫుడ్స్ సరఫరా చేస్తున్న నేపథ్యంలో బాలామృతం పౌడర్ నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆహార పదార్థాలు అత్యంత నాణ్యతతో ఉండాలని సూచించారు. ఎటువంటి నిర్లక్ష్యం చేసినా సహించబోమన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు, ముడి సరుకుల నుంచి ప్యాకేజింగ్ వరకు ప్రతి దశలో మరింత జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అధికారులకు సూచించారు. కొత్త యూనిట్ల నిర్మాణం పదేండ్లుగా పూర్తి కాలేదని, యంత్రాలను వెంటనే ఇన్‌స్టాల్ చేసి, పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

ఇద్దరు మిషన్ భగీరథ ఇంజినీర్ల సస్పెన్షన్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు మిషన్ భగీరథ ఇంజినీర్లను రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ మేరకు ఆ శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ కృపాకర్‌రెడ్డి సోమవారం ఆదేశాలు జారీ చేశారు. దసరా పండుగ రోజున నారాయణఖేడ్ మండలం సంజీవన్‌రావు గ్రామంలో కలుషితనీరు తాగి స్థానికులు ఇద్దరు అస్వస్థతకు గురై మరణించిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో శాఖాపరమై విచారణ చేసిన అనంతరం నారాయణఖేడ్ భగీరథ గ్రిడ్ ఏఈ రవికుమార్, ఇంట్రా నెట్‌వర్క్ ఏఈ శ్రీకాంత్ ను విధుల నుంచి తాత్కాలికంగా తొలగించారు. పండుగ రోజున సంజీవన్‌రావు పేట గ్రామానికి భగీరథ నీటిని సరఫరా చేయడంలో ఇద్దరు ఏఈలు నిర్లక్ష్యంగా వ్యవహరించారనే కారణంతో సస్పెండ్ చేసినట్టు ఈఎన్సీ కృపాకర్‌రెడ్డి తెలిపారు.

ఈడీ కస్టడీ కి సాహితీ ఇన్‌ఫ్రా ఎండీ

- అధికారుల ఇంటారాగేషన్

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి :

వేల కోట్ల రూపాయల మోసానికి పాల్పడిన సాహితీ ఇన్‌ఫ్రా మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీనారాయణను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సోమవారం విచారణ నిమిత్తం కస్టడీలోకి తీసుకున్నారు. ఈనెల 14 నుంచి 18 వరకు లక్ష్మీనారాయణను విచారించటానికి ఈడీకి నాంపల్లి కోర్టు అనుమతించిన విషయం తెలిసిందే. ఈ మేరకు తొలిరోజు తమ కస్టడీలో ఉన్న లక్ష్మీనారాయణను ఈడీ అధికారులు క్షుణ్ణంగా విచారించినట్టు తెలిసింది. సాహితీ ఇన్‌ఫ్రా ఎండీగా ప్రీలాంచ్ స్కీం ద్వారా వందల కోట్ల రూపాయలను పెట్టుబడులుగా ఆకర్షించి మోసానికి పాల్పడినట్టు లక్ష్మీనారాయణపై ఆరోపణలున్నాయి. ఈ మేరకు నగర నేర పరిశోధక విభాగంలో లక్ష్మీనారాయణపై కేసులు నమోదు కాగా.. వాటిని ఆధారంగా తీసుకొనే ఈడీ సైతం నిందితుడిపై పీఎంఎల్ఏ కింద కేసు నమోదు చేసి విచారణను సాగిస్తున్నది. ముఖ్యంగా, డిపాజిటర్ల నుంచి ఏ విధంగా కోట్ల రూపాయలను కంపెనీ సేకరించింది, అందుకు వారికి ఇచ్చిన హామీ ఏమిటి, సేకరించిన కోట్లాది రూపాయలను కంపెనీ యాజమాన్యం ఏం చేసింది, దేని కోసం సేకరించి దేనికోసం వాడింది మొదలైన కోణాల్లో నిందితుడు లక్ష్మీనారాయణను ఈడీ అధికారులు ప్రశ్నించినట్టు సమాచారం. అలాగే, మొత్తం మోసం విలువ ఎంత, దాని విలువ రూ.3 వేల కోట్లు దాటిందా అనే కోణాల్లో కూడా ఈడీ అధికారులు నిందితుల నుంచి సమాచారాన్ని సేకరించటానికి దృష్టిని సారించినట్టు తెలుస్తున్నది. ఈడీ జాయింట్ డైరెక్టర్ సారథ్యంలో లక్ష్మీనారాయణను విచారిస్తున్నట్టు సమాచారం.

ఇవీ విచారణలు..

(మొదటిపేజీ తరువాయి)

ఈనెల 14వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు గడువు విధించారు.

ఈనెల 25న సిరిసిల్ల నుంచి సిద్దిపేట రోడ్‌లోని పద్మనాయక కల్యాణమండపంలో దీనిపై బహిరంగ విచారణ నిర్వహిస్తామని టీజీఈఆర్సీ ప్రకటించింది.

- ట్రాన్స్‌మిషన్ బిజినెస్, స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎస్ఎల్‌డీసీ) యాక్టివిటీకి సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరం నుంచి 2028-29 వరకు బహుళ సంవత్సరాల టారిఫ్ (ఎమ్‌వైటీ) ప్రతిపాదనల్ని టీజీట్రాన్స్‌కో ప్రతిపాదించింది. వీటిపై అభ్యంతరాల స్వీకరణకు ఈనెల 11ను తుదిగడువుగా నిర్ణయించి, ఈనెల 22న బహిరంగ విచారణ నిర్వహిస్తామని టీజీఈఆర్సీ ప్రకటించింది.
- టీజీ డిస్కంలు 2024-25 నుంచి 2028-29 కాలానికి సంబంధించి ఐదవ నియంత్రణ కాలానికి సంబంధించి ఏఆర్ఆర్‌లు, వీలింగ్ చార్జీల నిర్ధారణ కోసం ప్రతిపాదనలు చేసింది. అలాగే పై కాలపరిమితికే సంబంధించి బహుళ సంవత్సరాల టారిఫ్, ఎఫ్‌పీటీ, సీఎస్ఎస్, రిటైల్ సప్లయ్ వ్యాపార వార్షిక ఆదాయ అవసరాల ప్రతిపాదనలు(ఏఆర్ఆర్) నిర్ధారణ కోసం కూడా డిస్కంలు ఈఆర్సీకి ప్రతిపాదనలు చేశాయి. వీటిపై ఈ నెల 11వ తేదీలోపు అభ్యంతరాలు, సలహాలు, సూచనల స్వీకరించి, ఈనెల 24వ తేదీ బహిరంగ విచారణ నిర్వహిస్తామని టీజీఈఆర్సీ ప్రకటించింది.
- ఇన్ని ప్రతిపాదనలను అధ్యయనం చేసి, సలహాలు, సూచనలు, అభ్యంతరాలు వ్యక్తం చేయడం ఎలా సాధ్యమనేది విద్యుత్‌రంగ నిపుణుల ప్రశ్న. కేవలం కమిషన్ పదవీకాలం ముగుస్తుంది కాబట్టి, మొక్కుబడిగా విచారణలు ముగించి, హడావిడిగా ఆర్డర్లు పాస్ చేస్తే, ఆ తర్వాతి పరిణామాలకు బాధ్యత ఎవరు స్వీకరిస్తారని వారు ప్రశ్నిస్తున్నారు.

సీఎంపై కేఏ పాల్ పిటిషన్‌ను కొట్టివేత

- హైకోర్టు

నవతెలంగాణ-హైదరాబాద్

అంతర్జాతీయ శాంతి, ఆర్థిక సమావేశాలకు హాజరవుతానని మౌఖికంగా చెప్పి సమావేశాలకు సీఎం రేవంత్‌రెడ్డి వెళ్లకపోవడం హక్కుల ఉల్లంఘన కిందకు రాదని హైకోర్టు స్పష్టం చేసింది. ప్రయివేటు సంస్థ నిర్వహించిన సమావేశానికి దేశంలోని అన్ని రాష్ట్రాల సీఎంలు హాజరుకావాలనే నిబంధనలేవీ లేవని తెలిపింది. సీఎం గౌర్హాజరును ఉల్లంఘనగా పరిగణించాలంటూ ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకులు కేఏ పాల్ వేసిన పిల్‌ను ప్రాథమిక దశలోనే కొట్టేసింది. జనవరి 30న జరిగిన అంతర్జాతీయ శాంతి, ఆర్థిక సమావేశాలకు హాజరవుతానని సీఎం హామీని అమలు చేయకపోవడం హక్కుల ఉల్లంఘనంటూ పాల్ వేసిన పిల్‌కు నెంబర్ కేటాయించేందుకు రిజిస్ట్రీ అభ్యంతరం చెప్పింది. ఈ వ్యవహారంపై సోమవారం చీఫ్ జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జై శ్రీనివాసరావులతో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం విచారించింది. అదేమీ హక్కులకు భంగం వాటిల్లడం కాదనీ, ఒక రాజకీయ పార్టీ నేతగా సమావేశాల్లో పాల్గొనాలని ఆదేశాలు జారీ చేయలేమని స్పష్టం చేసింది. ఈ తరహాలో పిటిషనర్ కోరడం కూడా సరికాదని పేర్కొంది. సీఎం పాల్గొంటే పెట్టుబడులు ఆకర్షించవచ్చునని పిటిషనర్ ఎలాంటి ఆధారాలూ చూపలేదని తప్పుపట్టింది. పాల్ వ్యక్తిగతంగా ఆన్‌లైన్‌లో విచారణకు హాజరై వాదనలు వినిపించారు.

సాయిబాబాకు అంతిమ వీడ్కోలు

(మొదటిపేజీ తరువాయి)

ఎస్.వీరయ్య, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్, సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డిజి.నర్సింహరావు, పాలడుగు భాస్కర్, రాష్ట్ర కమిటీ సభ్యులు జె.వెంకటేశ్, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, ప్రెస్ అకాడమి మాజీ చైర్మెన్ అల్లం నారాయణ, వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్, సీపీఐ నాయకులు బాలమల్లేశ్, అరుణోదయ నాయకురాలు విమలక్క, ఏపీ సీపీఐ కార్యదర్శి కె.రామకృష్ణ వివిధ పార్టీలు, ప్రజా సంఘాలకు చెందిన నాయకులు వచ్చి సాయిబాబా భౌతికకాయానికి నివాళ్లర్పించారు. మధ్యాహ్నం మూడు



గంటల సమయంలో బోయగూడ చౌరస్తా నుంచి గాంధీ ఆస్పత్రి వరకు అంతిమ యాత్ర నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులు భౌతికకాయాన్ని గాంధీ మెడికల్ కాలేజీకి అప్పగించారు.

సాయిబాబా మరణం ప్రజాస్వామ్యానికి తీరనిలోటు : సీపీఐ(ఎం) కేంద్రకమిటీ సభ్యులు మురళీధరన్

ఢిల్లీ విశ్వవిద్యాలయం మాజీ ప్రొఫెసర్, మానవ హక్కుల ఉద్యమ నేత జీఎన్ సాయిబాబా మృతి ప్రజాస్వామ్యానికి తీరని లోటని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు మురళీధరన్ అన్నారు. అనారోగ్యంతో శనివారం కన్నుమూసిన సాయిబాబా భౌతికకాయానికి పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులతో కలిసి మౌలాలిలోని నివాసం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అట్టడుగు వర్గాల ప్రజల కోసం చివరి వరకు రాజీపడకుండా పోరాడారని కొనియాడారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ అక్రమ కేసులు పెట్టి పదేండ్ల పాటు నిర్బంధించిందని విమర్శించారు. దేశంలోని హక్కుల ఉద్యమ నేతలను ఎన్ఐఏ లాంటి సంస్థలను పావులుగా చేసుకుని అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.

కేంద్రమే హత్య చేసింది: ఎస్ వీరయ్య

సాయిబాబాది సహజ మరణం కాదనీ, కేంద్ర ప్రభుత్వ హత్యని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య అభివర్ణించారు. ప్రశ్నించే గొంతుకలను, మేధావులను అక్రమంగా నిర్బంధించి చిత్రహింసలకు గురి చేస్తున్నారని విమర్శించారు. వ్యక్తులను అంతమొందిస్తే వారి ఆశయాలు కనుమరుగవుతాయని రాజ్యం దారుణాలకు ఒడిగడుతున్నదని ఆరోపించారు. సాయాబాబా వ్యక్తి కాదనీ, విప్లవ శక్తి అని కొనియాడారు. సాయిబాబా మరణించినా, అయన ఆశయాలు కనుమరుగు కాబోవని వ్యాఖ్యానించారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సాయిబాబాను అక్రమంగా అరెస్టు చేసి పదేండ్లు జైల్లో చిత్ర హింసలకు గురిచేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. టీజేఎస్ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ సాయిబాబాపై కేంద్రం అణచివేత ధోరణితో వ్యవహరించిందనీ, ఆయన మృతికి బీజేపీ సర్కార్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ మౌలిక సూత్రాల అమలు కోసం చివరి వరకు పోరాడారని గుర్తు చేశారు. అంతకు ముందు గన్‌పార్కు వద్ద సీపీఐ నేత నారాయణ నివాళులర్పించి మాట్లాడుతూ పుస్తకాలు కాకుండా సమాజాన్ని చదివేవారు మేధావులనీ, సాయిబాబా అలాంటి వ్యక్తని అభిప్రాయపడ్డారు. దోషి ఎవరో తేల్చాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తికి లేఖ రాస్తానని ఆయన చెప్పారు. దళిత, గిరిజన అట్టడుగు వర్గాల హక్కుల కోసం పోరాడిన వ్యక్తి సాయిబాబా అని మాజీ మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. హక్కుల కోసం పోరాడేవారిపై అక్రమ కేసులు పెట్టడం బాధాకరమన్నారు. సాయిబాబాకు నివాళులర్పించేందుకు వచ్చిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు చేదు అనుభవం ఎదురైంది. కేటీఆర్ గో బ్యాక్ అంటూ సాయిబాబా అభిమానులు అడ్డుకోవడంతో ఆయన మధ్యలోనే వెనుదిరిగారు. ఈ సందర్భంగా పలువురు కేటీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

మోడీ ప్రభుత్వమే కారణం

- సాయిబాబా మృతిపై సీపీఐ (ఎం)
- సర్కారుపై మండిపడిన వివిధ పార్టీలు

న్యూఢిల్లీ : ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబా మృతికి నరేంద్ర మోడీ ప్రభుత్వమే బాధ్యత వహించాలని సీపీఐ (ఎం) తెలిపింది. మోడీ ప్రభుత్వ అణచివేత విధానాలకు సాయిబాబా లక్ష్యంగా మారారని, చివరికి ప్రాణాలు కోల్పోయారని విమర్శించింది. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఓ ప్రకటనను పోస్ట్ చేసింది. 'ఆయనకు సంవత్సరాల తరబడి బెయిల్ నిరాకరించారు. తీవ్రమైన శారీరక వైకల్యంతో బాధపడుతున్న వ్యక్తికి అందించాల్సిన అత్యవసరమైన వైద్య చికిత్సను కల్పించలేదు. న్యాయం కోసం పోరాడేందుకు ఆయన తన జీవితాన్ని అంకితం చేశారు. ఆ క్రమంలో ఎంతో ధైర్యంగా వేధింపులను ఎదుర్కొన్నారు. ఆయన మరణానికి మోడీ ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుంది' అని సీపీఐ (ఎం) ఆ ప్రకటనలో తెలియజేసింది.సాయిబాబా మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా కూడా అన్నారు. 'అయనకు ప్రాథమిక మానవ హక్కులు సైతం నిరాకరించారు. సాయిబాబాది సహజ మరణం కాదు. అది వ్యవస్థీకృత హత్య. దశాబ్దం పాటు చట్టవిరుద్ధంగా నిర్బంధంలో ఉన్నప్పటికీ మార్చిలో విడుదలైనప్పుడు ఆయనలో దృఢచిత్తం ఎక్కువగా కన్పించింది. ఉపా వంటి క్రూరమైన చట్టాలకు వ్యతిరేకంగా పోరాడడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి' అని తెలిపారు. సీపీఐ (మావోయిస్టు-లెనినిస్ట్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య కూడా మోడీ ప్రభుత్వంపై మండిపడ్డారు. 'ఈ వ్యవస్థ ఆయనను చంపేసింది. మనమంతా మౌనంగా ఉండిపోయాము' అని కాంగ్రెస్‌కు చెందిన లోక్‌సభ సభ్యుడు కార్తి చిదంబరం వ్యాఖ్యానించారు.

నిరంకుశ విధానాలను ప్రతిఘటించాల్సిన అవసరం ఉన్నదని సాయిబాబా ఈ సమాజానికి బోధించారని ఆర్జేడీ ఎంపీ మనోజ్ కె.ఝూ చెప్పారు. రాజ్యహింసకు సాయిబాబా బలయ్యారని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాగరిక ఘోష్ తెలిపారు. సాయిబాబా మరణం ఉపా ఫలితమేనని మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. మన క్రిమినల్ న్యాయ వ్యవస్థలోని లొసుగులను సాయిబాబా మరణం బయటపెట్టిందని న్యాయ శాఖ మాజీ మంత్రి అశ్వినీ కుమార్ అన్నారు. ఆ ప్రక్రియే శిక్ష వంటిదని వ్యాఖ్యానించారు. న్యాయ సంస్కరణలు తీసుకొచ్చి, కస్టడీ వేధింపులకు వ్యతిరేకంగా సమగ్ర చట్టం చేయడమే సాయిబాబాకు అర్పించే నిజమైన నివాళి అని చెప్పారు.

గాంధీ మెడికల్ కాలేజీకి సాయిబాబా భౌతికకాయం అప్పగింత

- మౌలాలి నుంచి అంతిమయాత్ర ప్రారంభం
- తరలొచ్చిన వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు

నవతెలంగాణ-బేగంపేట

మాజీ ప్రొఫెసర్ సాయిబాబా భౌతికకాయాన్ని మెడికల్ స్టూడెంట్స్ వైద్య పరిశోధనల కోసం సోమవారం సాయంత్రం గాంధీ మెడికల్ కాలేజీకి అప్పగించారు. ఆయన భార్య వసంతకుమారి, కూతురు మంజీరా, సోదరుడు రాందేవ్ కలిసి అనాటమీ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ సుధారాణి, వైస్ ప్రిన్సిపాల్ రవిశేఖర్‌రావుకు అందజేశారు. ఆ సమయంలో అక్కడ సీపీఐ కార్యదర్శి నారాయణ, పీఓడబ్ల్యూ నేత సంధ్యా తదితరులు ఉన్నారు. అంతకుముందు మౌలాలి నుంచి ప్రారంభమైన సాయిబాబా అంతిమయాత్రలో ప్రజలు, వామపక్ష ప్రజా సంఘాల నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

జ్వరమొచ్చింది

(మొదటిపేజీ తరువాయి)

ఆధారం ఉంటే గానీ కాలకృత్యాలకు వెళ్లలేని దుస్థితి ఉందని బాధితులు వాపోతున్నారు. గృహిణి ఈ జ్వరం బారిన పడితే ఆ ఇంటి దుస్థితి వర్ణనాతీతంగా ఉంది. పట్టణాల్లో ఉండే కూతుర్లు, కోడళ్లు లేదంటే బంధువులెవరైనా వచ్చి వంటావార్పు చేయాల్సి వస్తోంది. నొప్పులతో బట్టలు ఉతకలేని స్థితిలో కొందరు రూ.15వేలకు పైగా వెచ్చించి వాషింగ్ మిషన్లు సైతం కొనుగోలు చేశారంటే అతిశయోక్తి కాదు.

వైరల్ ఫీవర్ అంటున్న వైద్యులు..

నిర్ధారణ పరీక్షల్లో చికున్‌గున్యా పాజిటివ్ లక్షణాలు అంతగా ఉండటం లేదు. వైద్యులు వైరల్ జ్వరాల వల్ల నొప్పులు ఉంటున్నాయని చెబుతున్నారు. దీనికి దోమకాటు వైరస్ కారణమని అంటున్నారు. గున్యా, అల్ఫా, హెపటైటిస్-బీ, సీ, పార్వో వంటి వైరస్ తీవ్రమైన కీళ్ల నొప్పులకు దారితీస్తున్నాయని వైద్యులు విశ్లేషిస్తున్నారు. కొందరు కీళ్ల నొప్పులకు తోడు దగ్గుతోనూ ఇబ్బంది పడుతున్నారు. కొందరికీ నొప్పులు లేకున్నా దగ్గు తీవ్రంగా ఉంటోంది. ఖమ్మం జిల్లాలోని పలువురు ప్రముఖ వైద్యుల దగ్గరకు వస్తున్న వారిలో ప్రతి ఇద్దరిలో ఒకరు జ్వరం, నొప్పుల పీడితులే ఉంటుండటం గమనార్హం. జనవరి నుంచి ఇప్పటివరకు 513 మందికి డెంగ్యూ, 15 మందికి పైగా చికున్‌గున్యాగా నిర్ధారణైంది. లక్ష మందికి పైగా పరీక్షలు చేయగా ఎక్కువ మంది రిపోర్టుల్లో నార్మల్‌గానే వస్తున్నా నొప్పులు, దగ్గు మాత్రం జ్వరపీడితులను వెంటాడుతూనే ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా జనవరి నుంచి ఆగస్టు వరకు హెల్త్ డిపార్ట్‌మెంట్ లెక్కల ప్రకారం 6405 డెంగ్యూ, 175 చికున్‌గున్యా, 200 మలేరియా కేసులు నమోదయ్యాయి. ఇక ఫీవర్ కేసులు లెక్కేలేదు.

కూలీలను పెట్టి పనిచేయిస్తున్నాం..

వనవాసం రాంరెడ్డి, బాధితుడు, గుండెపూడి, మహబూబాబాద్ జిల్లా

రెండు నెలల క్రితం నాకు, నా భార్యకు జ్వరం వచ్చింది. ఖమ్మంలోని ప్రయివేటు ఆస్పత్రి చుట్టూ తిరుగుతున్నాం. వచ్చినప్పుడల్లా రూ.4000 వరకు ఖర్చవుతున్నాయి. జ్వరం తగ్గినా నీరసం, కీళ్ల నొప్పులు మాత్రం తగ్గడం లేదు. ఇంట్లో పనులు కూడా చేసుకోలేకపోతున్నాం. మా ఊరంతా ఇట్లనే ఉన్నాయి. మిరప తోటలో పనులు చేయలేక కూలీని పెడితే రోజుకు రూ.700 తీసుకుంటున్నారు. చెట్లు లేపడానికి రూ.350 ఇచ్చి మరో ఇద్దరు కూలీలను పెట్టాల్సి వస్తోంది. జ్వరం వల్ల మా కుటుంబం పైన రూ.20వేల భారం పడింది.

నేడు దామగుండంలో నేవీ రాడర్‌కు శంకుస్థాపన

- హాజరు కానున్న కేంద్ర రక్షణ శాఖ మంత్రి, సీఎం
- శరవేగంగా ఏర్పాట్లు పూర్తి
- భారీగా మోహరించిన పోలీసులు
- నేవీ రాడర్‌ను వ్యతిరేకించిన దామగుండం పరిరక్షణ జేఏసీ



నవతెలంగాణ-పూడూర్

నేడు దామగుండం అటవీప్రాంతంలో నేవీ రాడర్ సిగ్నల్ సెంటర్ శంకుస్థాపనకు అధికారులు అన్నీ ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. శంకుస్థాపన పనులను శరవేగంగా అధికారులు పూర్తి చేశారు. ఈ కార్యక్రమం నేపథ్యంలో భారీగా పోలీసులను మోహరించారు. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం దామగుండం అటవీ ప్రాంతంలో నేవీ రాడర్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం పూనుకుంది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మంగళవారం నేవీ రాడర్ సిగ్నల్ సెంటర్‌కు శంకుస్థాపన చేయనున్నారు. దీని కోసం మూడు రోజులుగా నేవీ అధికారులు దగ్గరుండి శంకుస్థాపన ఏర్పాట్లు చూస్తున్నారు. మంగళవారం ఉదయం 12 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా దామగుండం అటవీ ప్రాంతంలో నిర్వహించే శంకుస్థాపన కార్యక్రమానికి హాజరవుతారని అధికారులు వెల్లడించారు.

పోలీసుల వలయంలో దామగుండం

దామగుండం అటవీ ప్రాంతమంతా పోలీసుల నిఘాలో ఉంది. నేవీ రాడర్ సిగ్నల్ సెంటర్ ఏర్పాటును పర్యావరణవేత్తలు, దామగుండం పరిరక్షణ జేఏసీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. రాడార్ సెంటర్ వల్ల అనేక సమస్యలు తలెత్తుతాయని, ముఖ్యంగా పచ్చని అడవి నాశనం అవుతుందని దీన్ని దామగుండంలో కాకుండా మరోచోట ఏర్పాటు చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళనలు కూడా చేపట్టారు. చెట్లను కొట్టి నేవీ రాడర్ ఏర్పాటు చేయడం ఏంటనీ ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో శంకుస్థాపనను అడ్డుకునే అవకాశాలు ఉండొచ్చనే ఉద్దేశంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నేవీ అధికారులు, ఆర్మీ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

విద్యార్థులపై సోషల్ మీడియా దుష్ప్రభావం

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, మీడియా విశ్లేషకులు తెలకపల్లి రవి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సోషల్ మీడియా విద్యార్థులపై దుష్ప్రభావం చూపిస్తున్నదని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి ఎ.నర్సిరెడ్డి, ప్రముఖ మీడియా విశ్లేషకులు తెలకపల్లి రవి వ్యాఖ్యానించారు. యూటీఎఫ్ పూర్వ అధ్యక్షులు, సీనియర్ నాయకులు నాగటి నారాయణ రెండవ వర్ధంతి సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని చెన్నుపాటి భవన్ టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.జంగయ్య అధ్యక్షతన "విద్యారంగంపై మీడియా ప్రభావం" అనే అంశంపై నిర్వహించిన స్మారకోపన్యాసంలో ముఖ్య అతిథిగా నర్సిరెడ్డి పాల్గొన్నారు. ప్రధాన వక్తగా ప్రముఖ రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగంపై విలువలతో కూడిన విద్య స్థానంలో కార్పొరేట్ కల్చర్, డబ్బు ప్రభావం పెరుగుతుందనీ, మూఢత్వం అశాస్త్రీయ ఆలోచనల భావజాలం పెరుగుతుందన్నారు. ఇది రాబోయే తరానికి చాలా ప్రమాదకరంగా మారుతుందని హెచ్చరించారు. ఇలాంటి ప్రభావాన్ని వెంటనే అరికట్టాల్సిన అవసరం ఉన్నదనీ, విద్యా విధానంలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు ప్రభుత్వాలు చొరవ చొరవ తీసుకోవాలని సూచించారు. సోషల్ మీడియాలో కంటెంట్ సైతం విపరీత ధోరణితో హింసను ప్రేరేపించే విధంగా ముందుకు వస్తుందన్నారు. దీని ద్వారా నేర ప్రవృత్తి పెరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.

నాగటి నారాయణ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి హోదాలో 13 సంవత్సరాల పాటు పనిచేసి ఉపాధ్యాయ ఉద్యమాన్ని నిర్మించడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. నాటి ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల జేఏసీ రాష్ట్ర కో చైర్మెన్‌గా ఉండి మంచి పీఆర్సీ సాధించడంలో, ఉపాధ్యాయులకు అప్రెంటిస్ విధానం రద్దు, ఇంక్రిమెంట్లు సాధనలో కీలకంగా వ్యవహరించాం న్నారు. స్పెషల్ విద్యా వాలంటీర్లుగా పని చేసిన టీచర్లకు నియామకాల నుంచి పాత పెన్షన్ సాధించే వరకు వివిధ పోరాటాలు నిర్మించారని గుర్తుచేశారు. ఒకవైపు యూటీఎఫ్ స్వతంత్ర కార్యచరణ ముందుకు తీసుకెళ్తూ మరోవైపు ఐక్య ఉద్యమాల నిర్మాణంలో కీలక భూమిక పోషించిన నాయకుడు నాగటి నారాయణ ఆశయ సాధనలో టీఎస్‌యూటీఎఫ్ కార్యకర్తలు, నాయకులు నిరంతరం ఆందోళన- పోరాటాలు నిర్వహిస్తూ విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం, ఉపాధ్యాయ సంక్షేమం కోసం పనిచేయాలని తెలిపారు. మీడియా లిటరసీ పెంచాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె.జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావా రవి, కోశాధికారి టి .లక్ష్మారెడ్డి, వాయిస్ ఆఫ్ తెలంగాణ టీచర్ పత్రిక సంపాదకులు పి .మాణిక్ రెడ్డి, సీనియర్ నాయకులు నరహరి, కృష్ణమూర్తి, రాష్ట్ర కార్యదర్శులు రాజశేఖర్ రెడ్డి, సోమశేఖర్, సింహాచలం రాష్ట్ర కమిటీ సభ్యులు సైదులు, వెంకటేశ్వర్లు, బి సాయిలు, యాదయ్య, వెంకటప్ప, గోపాల్ నాయక్, శ్యామ్, రాజారావు, జై సింహ రెడ్డి, మదన్ రెడ్డి ల తోపాటు వివిధ జిల్లాల కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇండ్లను కూల్చొద్దు..

- మూసీ పరివాహక ప్రాంతాల్లో బ్యానర్లు
- రిట్ పిటిషన్ల నెంబర్లతో బ్యానర్లు పెట్టుకున్న ఇండ్ల యజమానులు

నవతెలంగాణ-కొత్తపేట

మూసీ సుందరీకరణ పేరిట పరివాహక ప్రాంతాల్లో ఇండ్లను కూల్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతుండగా.. ఇప్పటికే అధికారులు పలు ఇండ్లకు రెడ్ మార్క్ వేశారు. కొంతమంది నివాసితులను కూడా అధికారులు ఖాళీ చేయించారు. ఈ క్రమంలో కొంతమంది మూసీ బాధితులు ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించారు. తమ ఇండ్లను కూల్చివేయకుండా స్టే ఇవ్వాలంటూ పిటిషన్లు దాఖలు చేశారు. తాజాగా హైదరాబాద్‌లోని చైతన్యపురి, ఫణిగిరి కాలనీ, సత్యానగర్, కొత్తపేటలోని మూసీ పరివాహక ప్రాంతాల్లో.. చాలా ఇండ్లకు యజమానులు హైకోర్టు ఆర్డర్‌కు సంబంధించిన రిట్ పిటిషన్ నెంబర్‌లతో ఫ్లెక్సీలు పెట్టుకున్నారు. ఈ ఇల్లు పూర్తి రక్షణలో ఉందని రాసుకున్నారు. కొత్తపేటలోని న్యూ మారుతి నగర్, సత్యా నగర్‌కు చెందిన మూసీ బాధితులు పలువురు దీనిపై మాట్లాడుతూ.. తాము హైకోర్టును ఆశ్రయించామని, ఈనెల 16న కోర్టు స్టే ఇచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. తాము రూపాయి రూపాయి కూడబెట్టి ఎంతో కష్టపడి కొనుక్కున్న భూములను ప్రభుత్వం ఎలాంటి నోటీసులూ ఇవ్వకుండా కూలుస్తామనడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పిల్లల చదువు కోల్పోతారని, తాము జీవనోపాధి కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్షణక్షణం భయాందోళనలో బతకాల్సి వస్తున్నదని చెబుతున్నారు.

ట్రాక్ పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలి

- భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అనుసరించాలి : దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైల్వేలో ఇటీవల చోటుచేసుకున్న అవాంఛనీయ సంఘటనల దృష్ట్యా ఆర్పీఎఫ్, జీఆర్పీ బృందాల సహాయంతో ట్రాక్ పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలనీ, భద్రతపై అప్రమత్తమైన విధానాన్ని అనుసరించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అధికారులకు సూచించారు. సోమవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో జోన్ వ్యాప్తంగా రైల్వే కార్యకలాపాల నిర్వహణలో భద్రతపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ నీరజ్ అగర్వాల్‌తో పాటు వివిధ శాఖలకు చెందిన ప్రధానాధిపతులు పాల్గొన్నారు. సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు , గుంటూరు, నాందేడ్ మొత్తం ఆరు డివిజన్‌లకు చెందిన డివిజనల్ రైల్వే మేనేజర్‌లు (డీఆర్‌ఎంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

సేఫ్టీ డ్రైవ్‌లు, తరచుగా క్షేత్రస్థాయి తనికీలు నిర్వహించాలనీ, లోకో పైలట్లు, అసిస్టెంట్ లోకో పైలట్లు, గార్డులు, ముఖ్యంగా ట్రాక్‌మెన్‌లతో సహా భద్రతా సంబంధిత సిబ్బందికి సలహాలు ఇవ్వాలనీ, ట్రాక్‌ల వెంట పెట్రోలింగ్ చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైళ్లను నడిపేందుకు సురక్షితమైన పని పద్ధతులను అనుసరించాలని ఆయన క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. జోన్‌లో రైళ్లలో పొగను గుర్తించే పరికరాలు, అగ్నిమాపక పరికరాలు మొదలైన భద్రతా వస్తువుల లభ్యతను ఆయన సమీక్షించారు. ఎలాంటి అత్యవసరమైనా సరిపడా నిల్వలు ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు.

జనరల్ మేనేజర్ ప్రయాణికుల ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ "రైల్ మదద్"ని కూడా సమీక్షించారు . వీలైనంత త్వరగా ప్రయాణికుల ఫిర్యాదులను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సిబ్బందిపై అధిక పని వేళలను తగ్గిస్తు సురక్షితమైన పని పరిస్థితులు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకొని వారి పనివేళలపై ముందస్తు ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. ఎల్సీ గేట్లను మూసివేసిన పరిస్థితుల్లో వాటిని అతిక్రమించకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తూ లెవల్ క్రాసింగ్ గేట్ల వద్ద అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. లెవల్ క్రాసింగ్ గేట్ల తొలగింపుపై పరిస్థితిని సమీక్షించారు వాటి తొలగింపునకై అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత డివిజనల్ రైల్వే మేనేజర్లను ఆదేశించారు.

ఆగిన ఎన్‌ఎస్‌ఎఫ్ కార్మికుడి గుండె

- ఆర్థిక ఇబ్బందులతో మనోవేదనకు గురై గుండెపోటుతో మృతి
- పెండింగ్‌లో ఉన్న వేతనాలైనా చెల్లించండి : సీఐటీయూ



నవతెలంగాణ-బోధన్

నిజామాబాద్ జిల్లా బోధన్‌లోని నిజాం షుగర్స్ ఫ్యాక్టరీలో పనిచేసిన మరో కార్మికుడి గుండె ఆగింది. కార్మికుడిగా విధులు నిర్వహించిన కేశవ్ (42) సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయనకు తల్లితో పాటు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఫ్యాక్టరీ మూతపడటంతో ఎక్కడా ఉపాధి లభించక ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారని, పండుగ చేసుకునేందుకు సైతం డబ్బులు లేక తీవ్ర మనోవేదనకు గురై గుండెపోటుతో మరణించినట్టు సీఐటీయూ నాయకులు కుమారస్వామి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సకాలంలో ఫ్యాక్టరీని తెరిపించేలా కృషి చేయాలని కోరారు. అప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని, దినసరి వేతన కార్మికుల ప్రావిడెంట్ ఫండ్ డబ్బులు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుని మృతికి పూర్తి బాధ్యత ప్రభుత్వమే వహించి న్యాయం చేయాలన్నారు. మృతుని కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

మాకు న్యాయం చేయాలి

- కలెక్టరేట్‌లో రైతు ఆత్మహత్యాయత్నం
- గద్వాల ప్రభుత్వాస్పత్రికి తరలింపు



నవతెలంగాణ-జోగులాంబగద్వాల

తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ప్రజావాణి సందర్భంగా కలెక్టరేట్లో రైతు ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ ఘటన సోమవారం జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టరేట్‌లో జరిగింది. బాధిత రైతు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తన పొలాన్ని తహసీల్దార్ వేరే వారిపై రిజిస్టర్ చేశారంటూ అయిజ మండలం గుడిదొడ్డి గ్రామానికి చెందిన రైతు పరుశరాముడు పలుమార్లు అధికారులను కలిసి మొరపెట్టుకున్నాడు. తన భూమిని తనపై మార్చాలని వేడుకున్నాడు. ఫలితం లేకపోవడంతో సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన పరుశరాముడు పురుగుల మందు తాగాడు. గమనించిన పోలీసులు వెంటనే రైతుని గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరుశరాముడు జులైలోనూ ఓ సారి ప్రజావాణిలో పురుగుల మందు తాగాడు. అంతేకాక స్వస్థలం గుడిదొడ్డి గ్రామం నుంచి కుటుంబ సభ్యులంతా కలిసి కాలినడకన హైదరాబాద్‌కు వెళ్లి ముఖ్యమంత్రి ప్రజావాణి కార్యక్రమంలోనూ వినతిపత్రం ఇచ్చారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో సోమవారం బాధిత రైతు మళ్లీ ఆత్మహత్యాయత్నం చేశాడు. తమ భూమిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్వో జ్యోతికి పలుమార్లు విన్నవించినా ఫలితం లేదని, తన చావుకు ఎమ్మార్వోనే కారణమని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

హెడ్ కానిస్టేబుల్‌పై ఆకతాయిల దాడి

నవతెలంగాణ-గీసుగొండ

ఓ హెడ్ కానిస్టేబుల్‌పై ఆకతాయిలు దాడిచేసిన సంఘటన వరంగల్ మహానగర పరిధిలోని 16వ డివిజన్ ధర్మారంలో చోటు చేసుకున్నది. సీఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మమునూర్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న భిక్షపతి దుర్గామాత విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ధర్మారంలో బందోబస్తు డ్యూటీలో ఉన్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి విధులు నిర్వహిస్తుండగా నలుగురు ఆకతాయిలు హెడ్ కానిస్టేబుల్‌ను దూషిస్తూ మొబైల్ లాక్కొని కొట్టారు. భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. దాడికి పాల్పడ్డ నలుగురు పరారీలో ఉన్నారన్నారు.

"గోసంగికుక్కల్లారా.. మీ ప్రాణం మా చేతుల్లోనే.."

- బతుకమ్మ ఆడుతుంటే కులంపేరుతో దూషించారని పోలీస్‌స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు
- నిజామాబాద్ జిల్లా బాల్కొండలో ఘటన


స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన మహిళలు, సభ్యులు

నవతెలంగాణ-బాల్కొండ

'గోసంగి కుక్కల్లారా.. ఎంగిలి ఆకుల మీద మెతుకులు ఏరుకొని తినేవారు.. మీరు మా ఊర్లో ఉండటంతో బస్సాపూర్ గ్రామాన్ని గోసంగి బిచ్చగాళ్ల గ్రామం అంటున్నారని' కులంపేరుతో బూతులు తిడుతూ దూషించారని గోసంగి సామాజిక తరగతికి చెందిన సభ్యులు సోమవారం నిజామాబాద్ జిల్లా బాల్కొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమను దూషించి, దాడి చేసిన మున్నూరుకాపు సామాజిక తరగతికి చెందిన వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ ఘటనపై గోసంగి సంఘం జిల్లా అధ్యక్షులు ఈర్నాల వినోద్ కుమార్ మాట్లాడుతూ.. బస్సాపూర్ గ్రామంలో ఆదివారం అంబేద్కర్ సంఘం ఎదుట బతుకమ్మ ఆడుతున్న గోసంగి మహిళలపై మున్నూరుకాపు సామాజిక తరగతికి చెందిన పలువురు వ్యక్తులు వచ్చి దూషించి దుర్భాషలాడి మహిళలని చూడకుండా దాడి చేసినట్టు తెలిపారు. బతుకమ్మ ఆడుతున్న తమను హేళన చేస్తూ కులం పేరుతో దూషించినట్టు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. గొడవలు వద్దని వారించినా వినకుండా దాడి చేశారని, ఈ క్రమంలో పలువురికి గాయాలైనట్టు చెప్పారు. 'మీ ప్రాణం మా చేతుల్లోనే ఉంది' అంటూ బెదిరింపులకు దిగినట్టు వాపోయారు. గ్రామంలో ఉన్న గోసంగి కులస్తులకు రక్షణ కల్పించాలని, కులం పేరుతో మహిళలను దూషించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బస్సాపూర్ గ్రామంలోని గోసంగి కులానికి చెందిన వారికి జిల్లా గోసంగి సంఘం అండగా నిలుస్తుందన్నారు.

పెండింగ్ ఫీజులను రీయింబర్స్ చేయాలి

- స్కాలర్‌షిప్‌లూ ఇవ్వాలి : ఎస్ఎఫ్ఐ డిమాండ్

నవతెంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలో గత ఆరేండ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ. 8 వేల కోట్ల ఫీజులను విద్యార్థులకు రియింబర్స్ చేయడంతోపాటు స్కాలర్‌షిప్‌లనూ విడుదల చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి. నాగరాజు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఫీజులను విడుదల చేయకపోవడం వల్ల ఇప్పటికే చాలా రకాల ప్రవేశ పరీక్షలు పూర్తయి ఉన్నత చదువులకు వెళ్లే విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని గుర్తు చేశారు.

పేద విద్యార్థులు అప్పులు చేసి మరి సర్టిఫికెట్లు తీసుకునే పరిస్థితి రాష్ట్రంలో నెలకొందన్నారు. ఒక ప్రక్కన విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు యాజమాన్యాలు అప్పులు తెచ్చి కాలేజీలు నడిపిస్తున్నామంటూ సిబ్బందికి జీతాలు చెల్లించలేమని చెబుతున్నాయని వివరించారు. సోమవారం నుంచి కళాశాలల బంద్‌కు యాజమాన్యాలు పిలుపునిచ్చాయని గుర్తు చేశారు. ప్రభుత్వం యాజమాన్యా లతో చర్చించి పేద విద్యార్థులకు నష్టం కలగకుండా నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు. రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలో డిగ్రీ, పీజీ కళాశాలలు కంటే, ప్రయివేటు రంగంలోనే ఎక్కువగా ఉన్నాయని అన్నారు. వాటిలో చదువుతున్న పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ విద్యార్థులే నష్టపోతారని చెప్పారు. ఒక ప్రక్కన విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పుల పేర అంతర్జాతీయ పాఠశాలలను ప్రారంభం చేస్తూనే, మరోవైపు విద్యార్థులకు ఫీజులను గత ప్రభుత్వంలాగే చెల్లించడం లేదన్నారు. విద్యారంగానికి ప్రాధాన్యత తగ్గించి విద్యను ప్రయివేటీకరణ చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని వ్యాఖ్యానించారు. తక్షణమే ప్రభుత్వం ఫీజులను విడుదల చేయాలనీ, లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

డ్రగ్స్‌కు కేరాఫ్ గుజరాత్

రూ.13,000 కోట్ల విలువ చేసే మాదక ద్రవ్యాలకు కేంద్రంగా రాష్ట్రానికి చెందిన కంపెనీ

మూడు నెలల్లో 1,200 కేజీలకు పైగా కొకైన్ స్వాధీనం



ఆందోళన కలిగిస్తున్న పరిస్థితులు

న్యూఢిల్లీ : గుజరాత్‌లో గత కొంత కాలంగా భారీ ఎత్తున పట్టుబడుతున్న మాదక ద్రవ్యాలు ఆందోళనను కలిగిస్తున్నాయి. ముఖ్యంగా, రాష్ట్రానికి చెందిన ఒక కంపెనీ మాదర ద్రవ్యాలకు కేంద్రంగా నిలుస్తున్నది. తాజాగా, ఢిల్లీ, గుజరాత్ పోలీసులు భారీ ఎత్తున డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. అంకలేశ్వర్‌లోని కెమికల్ కంపెనీలో జరిపిన సోదాల్లో పోలీసులు 518 కిలోల కొకైన్‌ను సీజ్ చేశారు. దీని విలువ రూ. 5,000 కోట్లుగా ఉంటాయని విశ్వసనీయ వర్గాలు అంచనా వేశాయి. ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ ఈ నెల ప్రారంభంలో మహిపాల్‌పూర్ గోడౌన్ నుంచి 562 కిలోగ్రాముల హైక్వాలిటీ కొకైన్, 40 కిలోగ్రాముల హైడ్రోపోనిక్ గంజాయిని స్వాధీనం చేసుకున్నది. కొన్ని రోజుల వ్యవధిలోనే భారీ ఎత్తున మళ్లీ మాదక పదార్థాలు దొరకటం ఆందోళనను కలిగిస్తున్నది.

స్పెషల్ సెల్‌లోని విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. గత మూడు నెలలుగా ఇంటెలిజెన్స్ ఇన్‌పుట్‌లు, పరిశోధనల ఆధారంగా రూ. 13,000 కోట్ల విలువైన 1,289 కిలోగ్రాముల ప్రీమియం క్వాలిటీ కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పండుగల సీజన్, రాబోయే పెద్ద ఈవెంట్‌ల కోసం ఈ డ్రగ్స్ దేశంలోకి అక్రమంగా రవాణా చేయబడినట్టు సమాచారం.

రూ. 5,000 కోట్ల మాదకద్రవ్యాల దోపిడీకి కేంద్రంగా గుజరాత్‌కు చెందిన కెమికల్ కంపెనీ ఉన్నది. భారత్‌లోకి అక్రమంగా రవాణా చేయబడిన ముడి నిషిద్ధ వస్తువులను శుద్ధి చేయటంలో ఈ కంపెనీ నిమగ్నమైందనీ, దాని కార్యకలాపాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణాలో ప్రమేయం గురించి తీవ్ర ఆందోళనలను లేవనెత్తుతున్నాయని ఢిల్లీ పోలీసు వర్గాలు తెలిపాయి. ఈ కేసుకు సంబంధించి దక్షిణ ఢిల్లీకి చెందిన వ్యాపారవేత్త తుషార్ గోయల్‌తో సహా ఇప్పటివరకు 12 మంది వ్యక్తులను అరెస్టు చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న విచారణలో భాగంగా కంపెనీ సిబ్బంది, యజమానులను ప్రశ్నిస్తున్నట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. గోయల్, లండన్‌లో ఉండే ఆయన సహచరుడు జతీందర్ పాల్ సింగ్ గిల్, నిషిద్ధ సరుకుల రవాణాకు సహకరించిన మరో ఇద్దరిని కూడా అరెస్టు చేశారు. "గుజరాత్‌లోని అంక్లేశ్వర్‌కు చెందిన ఓ కంపెనీ డ్రగ్స్‌ను శుద్ధి చేస్తున్నట్టు విచారణలో తేలింది. డ్రగ్స్‌ను మొదట గోవాలో అందుకున్నారు. ఆ తర్వాత సంస్థ యాజమాన్యంలోని కర్మాగారంలో శుద్ధి చేశారు" అని ఢిల్లీ పోలీసుల్లోని కొన్ని విశ్వసనీయ వర్గాలు చెప్పాయి. ఇతర డ్రగ్స్‌తో పాటు నిషిద్ధ వస్తువులను శుద్ధి చేసి పంపేందుకు కంపెనీ నకిలీ అనుబంధ సంస్థను ప్రారంభించిందని ఢిల్లీ పోలీసు వర్గాలు తెలిపాయి.

మాదకద్రవ్యాలను యూపీకి పెద్ద సరుకులలో పంపించి, ఆ తర్వాత ఢిల్లీకి రవాణా చేశారు. అక్కడ సరుకును నిల్వ చేయటానికి, కొనుగోలుదారులను కనుగొనటానికి గోయల్, ఇతరులు బాధ్యత వహిస్తారు. ఈనెల 1న గోయల్‌కు చెందిన మహిపాల్‌పూర్‌లోని గోదాముపై స్పెషల్ సెల్ దాడి చేసింది. అక్కడ వారు 562 కిలోల కొకైన్, 40 కిలోగ్రాముల హైడ్రోపోనిక్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అక్టోబరు 10న తదుపరి విచారణలో ఢిల్లీలోని రమేష్ నగర్‌లోని ఒక దుకాణంలో అదనంగా 208 కిలోల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఫార్మా సొల్యూషన్ సర్వీసెస్‌కు గుజరాత్‌లోని కంపెనీకి లింక్‌లతో అధికారులు డ్రగ్స్‌ను గుర్తించారు.

ఈ గుజరాత్ ఆధారిత కంపెనీ వెబ్‌సైట్ ప్రకారం ప్రభుత్వేతర కంపెనీగా వర్గీకరించబడింది. దీనిని 2016, సెప్టెంబర్ 23న స్థాపించారు. ఈ సంస్థకు ఎలాంటి తయారీ లైసెన్స్ లేదని ప్రభుత్వ వర్గాలు తెలపటం గమనార్హం. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రకారం కంపెనీ చివరిగా తన బ్యాలెన్స్ షీట్‌ను గతేడాది మార్చి 31న దాఖలు చేసింది. ఈ విషయంలో సదరు కంపెనీ నుంచి ఎలాంటి స్పందనా లేకపోవటం గమనార్హం.

ఆశా వర్కర్లను పర్మినెంట్ చేయాలి

కనీస వేతనం రూ.26 వేలివ్వాలి

- ఏఎన్‌పీ, బీపీ, షుగర్ కేసుల టార్గెట్లు పెట్టకూడదు
- ఉద్యోగ భద్రత కల్పించాలి : సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి



నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

ఆశా వర్కర్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి డిమాండ్ చేశారు. సోమవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గోపాలస్వామి మాట్లాడుతూ .. ఆశావర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఏఎన్‌పీ, బీపీ, షుగర్ కేసుల టార్గెట్లు పెట్టకూడదని డిమాండ్ చేశారు. 30 సంవత్సరాల నుంచి కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్, 20 ఏండ్ల నుంచి ఆశాలు.. ఎన్‌హెచ్‌ఎం స్కీంలో భాగంగా పనిచేస్తున్నారని, వీరంతా మహిళలు, బడుగు, బలహీన వర్గాలకు చెందినవారన్నారు. కరోనా మహమ్మారి కాలంలో కూడా ముందుండి ప్రజలకు సేవలందించారని గుర్తు చేశారు. డబ్ల్యుహెచ్ఓ ఆశా వర్కర్లకు గ్లోబెల్ హెల్త్ లీడర్స్ అవార్డును సైతం అందించిందన్నారు. ప్రస్తుతం ప్రజలకు వస్తున్న సీజనల్ వ్యాధులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించి అరికట్టడంలో, ఆస్పత్రుల్లో డెలివరీల సంఖ్యను పెంచడంలో ఆశాలు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఇన్ని పనులు నిర్వహిస్తున్న ఆశాలను కేంద్ర ప్రభుత్వం నేటికీ గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశాలకు రోజు రోజుకు పనిభారం మరింత పెరుగుతున్నదని, పారితోషకాలు లేని పనులు చేయిస్తున్నా రని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోని ప్రజారోగ్య సౌకర్యాల విషయంలో ఆందోళనకర పరిస్థితి కూడా ఉందని, ఆశాల సమస్యలతో పాటు ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడానికి సరిపడా బడ్జెట్ కేటాయింపులు కేంద్ర ప్రభుత్వం చేయకపోవడం అత్యంత బాధాకరమన్నారు. జనాభా పరిమితి ప్రకారం ఆశాలనూ పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆశాల డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతూ వైద్యారోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి ఆనంద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కర్, జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, ఆశా యూనియన్ జిల్లా కార్యదర్శి బి.ప్రవీణ, అధ్యక్షురాలు మంజుల, నాయకులు భూలక్ష్మి, యాదలక్ష్మి, బాలమణి, సుజాత, రేణుక, భాగ్య, శ్రీలత, అరుణ, లక్ష్మీ, శోభ, రజిత, కావ్య, జ్యోతి, సంజీవ్ పాల్గొన్నారు.

త్వరలో మంత్రి వర్గ విస్తరణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసినట్టు టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు. వీలైనంత త్వరలో మంత్రివర్గ విస్తరణ ఉంటుందన్నారు. సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దసరా కానుకగా జిల్లాకు త్వరలోనే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల, కళాశాల మంజూరు చేయించనున్నట్టు తెలిపారు. మ్యానిఫెస్టోలో లేని హామీలను కూడా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నట్టు చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం పదేండ్లలో 30 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని, కానీ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 50వేల వరకు ఉద్యోగాలు కల్పించినట్టు తెలిపారు. రుణ మాఫీ విషయంలో ప్రతిపక్షాలు ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని, రైతులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. సోషల్ మీడియాని సోషల్ సెన్స్ లేకుండా వాడుతున్నారని, పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది తాత్కాలిక ఆనందం ఇచ్చినా దీర్ఘకాలికంగా బీఆర్ఎస్‌కు నష్టం జరుగుతుందన్నారు. జిల్లా పారిశ్రామిక అభివృద్ధిపై త్వరలో సీఎంతో చర్చిస్తామని తెలిపారు. ప్రాణహిత 20, 21వ ప్యాకేజీ పనులు వేగవంతం చేయిస్తామన్నారు. జిల్లాకు మెడికల్ కళాశాల ఆవశ్యకత ఉందని, స్టేడియం నిర్మాణానికీ ప్రయత్నం చేస్తున్నట్టు చెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్ ప్రజలను మభ్యపెడుతున్నాయని, ఆర్వోబీ విషయంలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు తెలిపారు. నిజామాబాద్ స్మార్ట్ సిటీ కావాల్సిన అవసరం ఉందని, ఎంపీ అరవింద్ ఆ దిశగా కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మెన్ మానాల మోహన్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మెన్ తాహెర్ బిన్ హందాన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు, నుడా చైర్మెన్ కేశ వేణు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పీజేసీ ప్రాఫిట్ చైర్మెన్‌గా ఈటెల బాధ్యతల స్వీకరణ

- కమిటీ ఉద్యోగులతో భేటీ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ జాయింట్ కమిటీ(పీజేసీ) ఆన్ ఆఫీసెస్ ఆఫ్ ప్రాఫిట్ చైర్మెన్‌గా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సోమవారం నాడిక్కడ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కమిటీ ఉద్యోగులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మల్కాజిగిరికి సంబంధించిన పలువురు నేతలు ఈటెలను కలిసి అభినందనలు తెలిపారు. అంతకు ముందు ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో ఈటెల రాజేందర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో భాగంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఏరియాలో కరోనా టైం లో మున్సిపల్ కార్మికులు మతి చెందారని వివరించారు. కరోనా మహమ్మారితో మరణించిన వారి కుటుంబాలకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగావకాశాలు కల్పించాలని రిక్వెస్ట్ చేశారు. కాగా, తమ విజ్ఞప్తిపై రాజ్‌నాథ్ సింగ్ సానుకూలంగా స్పందించారని ఈటెల కార్యాలయం మీడియాకు వెల్లడించింది.

18న కల్లుగీత కార్మిక సంఘం వార్షికోత్సవం

'పదేండ్ల ప్రయాణం కల్లుగీత వృత్తిలో ఉపాధి' పై సదస్సు: కేజీకేఎస్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కల్లుగీత కార్మిక సంఘం 67వ వార్షికోత్సవాన్ని 18న హైదరాబాద్‌లోని సుందరయ్య కళానిలయంలో నిర్వహించనున్నట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవి రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని ఎస్వీకేలో విలేకర్లతో మాట్లాడుతూ వార్షికోత్సవానికి బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ నూతి శ్రీకాంత్‌గౌడ్, బీసీ కమిషన్ సభ్యులు రంగు బాలలక్ష్మి, టాడీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ పల్లె రవికుమార్ గౌడ్, వివిధ కల్లుగీత సంఘాల నాయకులు హాజరవుతారని చెప్పారు. వార్షికోత్సవాల సందర్భంగా 'తెలంగాణలో పదేండ్ల ప్రయాణం-కల్లుగీత వృత్తిలో ఉపాధి అవకాశాలు' అంశంపై సెమినార్ నిర్వహించనున్నట్టు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. వెంకట నరసయ్య, నాయకులు కృష్ణ స్వామి, సుధాకర్, లింగం గౌడ్, యాదయ్య, ప్రభాకర్, ఆంజనేయులు, నరసింహ్మ, శ్రీశైలం పాల్గొన్నారు.

వికలాంగుల హక్కుల కోసం సాయిబాబా పోరాటం

- ఎన్‌పీఆర్‌డీ నివాళులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

డాక్టర్ జి ఎన్ సాయిబాబా మృతి పట్ల వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర కమిటీ సంతాపాన్ని ప్రకటించింది. సోమవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కె వెంకట్, ఎం అడివయ్య, రాష్ట్ర కోశాధికారి ఆర్ వెంకటేశ్, టీఎంకేఎంకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహ బృందం సాయిబాబా మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అడివయ్య మాట్లాడుతూ తప్పుడు కేసులు పెట్టి పాలకులు జైల్లో పెట్టారనీ, నాటి నుంచి న్యాయం కోసం నిరంతరం పోరాటం చేశారని గుర్తు చేశారు. ముంబై హైకోర్ట్ ఆయన్ను నిర్దోషిగా ప్రకటించి విడుదల చేసిందన్నారు. వైకల్యం ఉన్న సాయిబాబాకు ఆరోగ్య సమస్యలు ఉన్నాయనీ, అవి సంక్లిష్టంగా మారాయని తెలిపారు.

సగమే సబ్సిడీ..!

మత్స్య కార్మికుల జీవితాలతో దోబూచులాట

- మిగతా వాటిని మార్కెట్లో కొనాల్సిందేనా..?
- నాసిరకం చేపలను తెచ్చి వదులుతున్న కాంట్రాక్టర్లు

నాణ్యమైన చేప పిల్లలను వదలాలి

గతేడాది మేము చేపలను వదిలితే గిటకబారిపోయాయి. ముఖ్యంగా బొచ్చ చేప పిల్లలని మాకు ఇచ్చారు. అందులో కంచెలు వచ్చాయి. దీంతో సొసైటీ తీవ్రంగా నష్ట పోయింది. ఈసారైనా నాణ్యమైన చేప పిల్లలు ఇచ్చి సొసైటీని ఆదుకోవాలి.

సైదులు, నడిగడ్డ సహకార సంఘం కార్యదర్శి

సగం చేప పిల్లలకు 100 శాతం సబ్సిడీ

చేప పిల్లల్లో సగం పిల్లలను 100 శాతం సబ్సిడీకి ఇస్తున్నాం. ఇప్పటికే సింగోటం, పాలెం చెరువులోకల చేప పిల్లలను వదిలాం. మిగతా చెరువుల్లోనూ త్వరలో వదిలే ప్రయత్నంలో ఉన్నాం. నాణ్యమైన చేప పిల్లలను కాపాడుకునేందుకు సహకార సంఘ సభ్యులు కలిసికట్టుగా కృషి చేసి ఉపాధి పొందాలి.

రజిని, ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ ఏడి- నాగర్ కర్నూల్



నష్టపోతున్న మత్స్య సహకార సంఘాల సభ్యులు

నవ తెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర వ్యాప్తంగా చేప పిల్లల పంపిణీ ప్రారంభమైంది. పండుగ వాతావరణం నడుమ వారం రోజుల కిందట చెరువుల్లోకి చేప పిల్లలను వదిలారు. నాణ్యమైన చేప పిల్లలను పంపిణీ చేస్తున్నట్టు ప్రభుత్వం తెలిపింది. అయితే, మత్స్యకారుల జీవితాల్లో వెలుగు నింపుతామని చెబుతున్నప్పటికీ ఆ దిశగా అడుగులు వేయడం లేదని వారు ఆందోళన చెందుతున్నారు. గతంలో చెరువుల్లో అంతంత మాత్రంగా నీరున్న సమయంలో 100 శాతం సబ్సిడీతో చేప పిల్లల పంపిణీ జరిగింది. ఈ ఏడాది చెరువుల్లో పుష్కలంగా నీరున్నా సామర్థ్యం పేరుతో సగం చేప పిల్లలకు మాత్రమే సబ్సిడీ ఇస్తామని ప్రభుత్వం చెప్పడంపై మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. అలాంటిదేమీ లేదని, వందశాతం ఇస్తున్నట్టు అధికారులు అంటున్నారు. ఇచ్చే చేప పిల్లల తూకాల్లోనూ మోసాలు జరుగుతున్నట్టు ఆరోపణలొస్తున్నాయి. అంతిమంగా సహకార సంఘాల సభ్యులు నష్టపోతున్నారు.

కాంట్రాక్టర్లతో కుమ్మక్కు..

కాంట్రాక్టర్లు, అధికారులు కలిసి నాసిరకం చేప పిల్లలను చెరువుల్లో వదులుతున్నారన్న ఆరోపణలొస్తున్నాయి. చెరువులను బహిరంగంగా వేలం వేస్తున్నా జిల్లా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. నాగర్ కర్నూల్ చెరువును కోటి 50 లక్షల రూపాయలకు వేలం వేశారంటే ఏ స్థాయిలో డబ్బులు చేతులు మారుతున్నాయో అర్థం చేసుకోవచ్చు.

రిజర్వాయర్లు, ప్రాజెక్టులు నిర్మాణమైన తర్వాత మహబూబ్‌నగర్ జిల్లాలో మత్స్య సంపద రెట్టింపు అయింది. వాటితోపాటు కృష్ణ, తుంగభద్ర, భీమా నదులు ఉండటంతో ఇక్కడ ఉత్పత్తి అయిన మత్స్య సంపదను దేశ విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ఈ ఏడాది రిజర్వాయర్లు, చెరువులు నిండుకుండను తలపిస్తున్నాయి. ప్రతి ఏటా 100 శాతం సబ్సిడీతో చేప పిల్లలను చెరువుల్లో వదిలేది. ఈసారి అలాంటి అవకాశం కల్పించకపోవడం సరికాదంటున్నారు. కేసరి సముద్రంలో ఏడు లక్షల చేప పిల్లలను వదలాల్సి ఉండగా.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇక్కడ మూడున్నర లక్షల చేప పిల్లలు మాత్రమే వదులుతారు. కొల్లాపూర్ నియోజకవర్గం సింగోటం రిజర్వాయర్‌లో ఎనిమిది లక్షల చేప పిల్లలను వదలాలి. ఈ ఏడాది నాలుగు లక్షల చేప పిల్లల్ని 100 శాతం సబ్సిడీకి వదిలే అవకాశాలు ఉన్నాయి. పాలెం, అచ్చంపేట పరిధిలో ఉండే చెరువుల పరిస్థితి దయనీయంగా మారింది. మహబూబ్‌నగర్ జిల్లాలో 2271, నాగర్ కర్నూల్ జిల్లాలో 1739, వనపర్తి 1665, గద్వాల జిల్లాలో 750, నారాయణపేటలో 800 చెరువులు ఉన్నాయి. వీటితోపాటు వనపర్తి పరిధిలో సప్త సముద్రాలు కేఎల్ఐ పరిధిలో గుడిపల్లి, ఎల్లూరు, జొన్నల, బొగుడ, రిజర్వాయర్లు ఉన్నాయి. తుంగభద్ర, కృష్ణ, భీమా నదుల్లో సైతం అత్యధికంగా మత్స్య సంపద ఉత్పత్తి అవుతుంది. అయితే, ప్రభుత్వ నిబంధనల ప్రకారం సగం చేప పిల్లలే వదిలితే ఈ ఏడాది మత్స్య సంపద దిగుబడి భారీగా తగ్గే అవకాశం ఉంది.

చేప పిల్లల పెంపకం

అధికారులు ఆరు నెలలకు ముందే చేపపిల్లల పెంపకం కోసం కొంతమంది కాంట్రాక్టర్లకు బాధ్యత అప్పగిస్తారు. పెంచిన చేప పిల్లలను తెచ్చి చెరువులు, రిజర్వాయర్లలో పోస్తారు. చేపపిల్లల సరఫరాలో అవినీతి అక్రమాలు జరిగే అవకాశాలు లేకపోలేదు. నిబంధనల ప్రకారం లక్ష చేప పిల్లలను రెండు డీసీఎంలలో తరలించాలి. కానీ ఒక్క డీసీఎంలోనే రెండు లక్షల చేప పిల్లలను తెచ్చామని సొసైటీ సభ్యులను నమ్మబలుకుతున్నారు. ప్రతి డ్రమ్ము నుంచి చనిపోయిన వాటిని పక్కకు వేసి మొత్తం చేప పిల్లల్లో 10 శాతం తగ్గించాలి. ఇలా కాకుండా వచ్చిన చేప పిల్లల అన్నింటినీ లెక్కల్లో చూపిస్తున్నారు. చేపలు వేసే ముందు అధికారులు, సొసైటీ సభ్యులు, మత్స్య సహకార సంఘం జిల్లా అధికారులను పిలిపించి చేపలను వదలాల్సి ఉంది. రెండ్రోజుల కిందట పాలెం, సింగోటం, అచ్చంపేట పరిధిలో ఉండే చెరువుల్లో చేపలు వదిలారు. కానీ, ఆ సమయంలో అధికారులకు, మత్స్య కార్మికులకు ఎవరికీ చెప్పకుండానే చెరువుల్లో చేప పిల్లలను వదలడం పలు విమర్శలకు తావిస్తోంది. ఒక డీసీఎంలో పది డ్రమ్ములు ఉండాలి. ఒక డ్రమ్ములో 5 వేల చేప పిల్లల చొప్పున డీసీఎంలో 50 వేల చేప పిల్లలు ఉండాలి. చేప పిల్లల లెక్కల్లో సైతం తప్పుడు లెక్కలు చూపిస్తున్నారు. రిజర్వాయర్లకు అయితే ఎనిమిది సెంటీమీటర్లు, చెరువులకైతే 35 మిల్లీమీటర్ల సైజు ఉండేలా చేపలను వదలాలి. చేప పిల్లలను తూకం వేసి చెరువులకు అప్పగించాలి. ఆరోగ్యవంతమైన చేపలు 240 నుంచి 300 అయితే కేజీ చేప పిల్లలుంటాయి. కానీ ఈ నిబంధనలేవీ కాంట్రాక్టర్లు పట్టించుకోవడం లేదు.



మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్‌లో మహాసత్సంగము నగర సంకీర్తన జరిగింది. సోమవారం అష్టలక్ష్మీ దేవాలయం నుండి శ్రీ రామ కృష్ణ పురం కోపరేటివ్ సొసైటీ వరకు సంకీర్తనను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇస్కాన్ బ్రహ్మచారి ప్రణవనంద దాస్, ఇస్కాన్ ప్రతినిధులు శ్రీనివాస్ అతిప్రియ దాస్, మాయ నర్సింగ్ రావులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అష్టలక్ష్మీ దేవాలయం వ్యవస్థాపక అధ్యక్షులు గౌరీశెట్టి చంద్ర శేఖర్ గుప్త, చిలుక ఉపేందర్ రెడ్డి, రామరావ్, రమేష్ బాబు, గందే శ్రీకాంత్, విజయ లక్ష్మి, నీలిమ, రాధ, సురేఖ, అర్చన, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ -ఎల్బీనగర్



సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రజా ఉద్యమకారుడు, కవి, మేధావి కామ్రేడ్ జి.ఎన్ సాయిబాబా ఆకస్మికంగా మృతి చాలా బాధాకరం, వామపక్ష ఉద్యమాలకు తీరని లోటు అని ఈటీ నరసింహ అన్నారు. సాయిబాబా మృతికి సంతాపం తెలియజేస్తూ భౌతికకాయానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు, విఎస్ బోస్, ఆందోజు రవీంద్ర చారి, హైదరాబాద్ ఛాయాదేవి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-పెద్ద అంబర్‌పేట్

క్రీడాకారుల ప్రతిభను గుర్తించాలి



- క్రీడాకారిణికి ఉప్పల ఫౌండేషన్ ఆర్థిక సహాయం
- టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస గుప్తా

నవతెలంగాణ-నాగోల్

క్రీడలను ప్రోత్సహిస్తూ.. క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను గుర్తించాలని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్య నిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస గుప్త అన్నారు. సోమవారం నాగోల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో జాతీయ యోగ ఆసన పోటీలకు ఎంపికైన పూజితకు ఖర్చుల నిమిత్తమై ఉప్పల ఫౌండేషన్ తరపున ఆర్థిక సహాయం అందజేశారు.

ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ జాతీయ స్థాయిలో రాణించి సమాజానికి, తల్లీదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్రీడాకారులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మాయి తల్లి లక్ష్మి పూర్ణ, డాక్టర్ ఏ ఆర్ గుప్త, ఆర్య వైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'జూనియర్ ప్రో కబడ్డీ పోటీల్లో లార్డ్స్ విద్యార్థుల జయకేతనం'




నవతెలంగాణ - మీర్‌పేట్

స్టార్ స్పోర్ట్స్ సౌజన్యంతో వెంకట్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రో కబడ్డీ సీజన్ 5 లార్డ్స్ విద్యార్థులు ఫైనల్‌కు క్వాలిఫై అయ్యారని లార్డ్స్ విద్యాసంస్థల చైర్మెన్ సిద్దాల బీరప్ప తెలిపారు. మొదటి రౌండ్‌లో ఎస్సార్ డిజి పాఠశాల విద్యార్థుల పైన 16-29 స్కోర్‌తో, రెండవ రౌండ్లో భారతీ విద్యా భవన్ విద్యార్థుల పైన 17-33 స్కోర్ తో గెలుపొందారు.

ప్రో కబడ్డీలో అర్హత సాధించిన విద్యార్థులను లార్డ్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మెన్ సిద్దాల బీరప్ప, వైస్ చైర్మెన్ బెర్ల శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ సిద్దాల శ్రీలత అభినందించారు. ఈ కార్యక్రమంలో డీన్ సతీష్ గౌడ్, ప్రిన్సిపాల్స్ రామిడి సంతోష్, బానూరు శ్రీనివాస్ రెడ్డి, ఇంచార్జి అభిలాష్, పీఈటీ రమేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

జాయింట్ కమిటీ
ఆన్ ఆఫీసర్స్ ఆఫ్ ప్రాఫిట్ చైర్మెన్‌గా ఈటల



నవతెలంగాణ-హయత్ నగర్

లోక్ సభ సెక్రెటేరియట్‌లో జాయింట్ కమిటీ ఆన్ ఆఫీసర్స్ ఆఫ్ ప్రాఫిట్ చైర్మెన్‌గా మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఢిల్లీలో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన అర్బన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి. ఆయన వెంట మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరి వర్ధన్ రెడ్డి, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



- కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ నాథ్ యాదవ్

నవతెలంగాణ- నాగోల్

ప్రజల అవసరాల కోసం ప్రభుత్వం చేపడుతున్న నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల్ అరుణా సురేందర్ నాథ్ యాదవ్ అన్నారు. డివిజన్‌లోని సహదేవ్ సింగ్ నగర్‌లో సుమారు రూ.4 లక్షలా10వేల నిధులతో నూతనంగా చేపట్టనున్న వాటర్ పైప్ లైన్స్ నిర్మాణ పనులకు సోమవారం కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీ వాసులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన వాటర్ పైప్ లైన్స్ పూర్తి చేయాలని జలమండలి(హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి) శాఖ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఏరియా మేనేజర్ అర్చన, కేసిరెడ్డి పద్మా రెడ్డి, సత్య నారాయణ, సాయి, జీహెచ్ఎంసీ జవాన్ లక్ష్మయ్య, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనుల పరిశీలన

నాగోల్ డివిజన్‌లోని బండ్లగూడ రేడియల్ రోడ్డులో పెట్రోల్ బంక్ నుండి తాజ్ హోటల్ వరకు నూతనంగా చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను కార్పొరేటర్ చింతల్ అరుణా సురేంద్రనాథ్ యాదవ్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నాగోల్ నుండి ఓఆర్ఆర్ వరకు అనుసంధానంగా ఉన్న ఈ రేడియల్ రోడ్డు నిరంతరం వాహనాలతో రద్దీగా ఉంటుందని.. అందుకే ఈ సీసీ రోడ్లు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ రోడ్ల పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేంద్రనాథ్ యాదవ్, ఏఈ దీపక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు కాలనీ వాసులు పాల్గొన్నారు.



జీహెచ్ఎంసీలో
అమలు చేస్తున్న బెస్ట్ ప్రాక్టీసెస్ బేష్

- ఒడిస్సా ట్రైనీ ఐఏఎస్‌ల బృందం



నవతెలంగాణ-సిటీబ్యూరో

సాలిడ్ వ్యర్థాల ట్రీట్మెంట్ ద్వారా రీసైక్లింగ్ జరుగుతున్న విధానం ఎంతో బాగుందని ఐఏఎస్ బృందం సభ్యులు తెలిపారు. ఒడిస్సా 2023 బ్యాచ్‌కు చెందిన ప్రొబెషనరీ ఐఏఎస్ అధికారుల బృందం జీహెచ్ఎంసీలో అమలు చేస్తున్న బెస్ట్ ప్రాక్టీసెస్‌పై అధ్యయనం నిమిత్తం సోమవారం నగరానికి వచ్చిన నేపథ్యంలో వారు జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారికి జీహెచ్ఎంసీలో ట్యాక్స్, ఫైనాన్స్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ వంటి కీలక విభాగాల్లో జీహెచ్ఎంసీ తీసుకుంటున్న చర్యలను, పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం, ప్రజలకు అందిస్తున్న ఆధునిక సేవలు, సాంకేతికతపై అధ్యయనం చేశారు. జీహెచ్ఎంసీ ఆయా విభాగాల ఉన్నతాధికారులు ఐఏఎస్‌ల బృందంతో కమాండ్ కంట్రోల్ రూం సమావేశమై పారిశుద్ధ్య నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పన, జీహెచ్ఎంసీ ఆదాయ వనరులు సమకూర్చుకుంటున్న చర్యల గురించి, పర్యావరణ సుస్థిరత కోసం తీసుకుంటున్న చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారికి వివరించారు. ఈ సందర్భంగా పలువురు ఐ.ఏ.ఎస్‌లు అడిగిన పలు ప్రశ్నలకు జీహెచ్ఎంసీ అధికారులు ఆయా అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ జీహెచ్ఎంసీ ఆస్తి పన్ను చెల్లింపుల కోసం ఆన్ లైన్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చిందని, జీహెచ్ఎంసీ ద్వారా ప్రజలకు అందిస్తున్న వివిధ సేవల గురించి వివరించారు. జీ.ఐ.ఎస్ సర్వే ద్వారా జీహెచ్ఎంసీ పరిధిలోని ఆస్తులన్నింటినీ మ్యాపింగ్ చేయడం జరిగిందని, ప్రాపర్టీ ట్యాక్స్ వన్ టైం సెటిల్మెంట్ అవకాశాన్ని ప్రజలకు ఇవ్వడంతో ఏక కాలంలో పెద్ద మొత్తంలో ఆస్తిపన్ను వసూలైందని తెలిపారు. ఆస్తి పన్ను కమర్షియల్, రెసిడెన్షియల్ పన్ను లెక్కింపు విధానం గురించి వివరించారు. శానిటేషన్ జాయింట్ కమిషనర్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ నగరంలో శానిటేషన్ నిర్వహణకు చేపట్టిన పలు చర్యలు, పనిచేస్తున్న సిబ్బంది వివరాలు, స్వచ్ఛ ఆటోల ద్వారా ఇంటింటి నుండి చెత్త సేకరణ చేస్తున్నారని, సేకరించిన చెత్తను ప్రాసెసింగ్ చేయడం లాంటి వివరాలను, భవన నిర్మాణ వ్యర్థాల తరలింపుకు తీసుకుంటున్న చర్యలు, రీసైక్లింగ్ గురించి వివరించారు. హైదరాబాద్ నగరాన్ని పచ్చ, స్వచ్ఛ సిటీగా మార్చడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని తెలిపారు. నగరంలో రోజుకు 8 వేల మెట్రిక్ టన్నులకు పైగా సాలిడ్ వ్యర్థాల ట్రీట్మెంట్ ద్వారా రీసైక్లింగ్ జరుగుతుందని తెలిపారు. అనంతరం ఐ.ఏ.ఎస్‌ల బృందం జీహెచ్ఎంజీ ప్రధాన కార్యాలయంలోని కంట్రోల్ రూంను సందర్శించారు. ఈ సందర్భంగా ఓ.ఎస్.డి అనురాధ కంట్రోల్ రూం పనితీరును వారికి వివరించారు. పౌరుల ఫిర్యాదులను పరిష్కరించడానికి జీహెచ్ఎంసీ సెంట్రలైజ్డ్ పబ్లిక్ గ్రీవెన్సెస్ సిస్టంను అమలవుతుందన్నారు. దీంతో పౌరులు ఫిర్యాదులను ఆన్ లైన్‌లో నమోదు చేసి వాటి పరిష్కారం గురించి ట్రాక్ చేసుకొని పరిష్కారం చేస్తున్నట్లు దీంతో ఫిర్యాదులు పరిష్కారం జాప్యం లేకుండా పరిష్కారం చేస్తున్నట్లు పరిష్కారం అయిన తిరిగి ఫిర్యాదు దారు నుండి జవాబు చెప్పడం జరుగుతున్నట్లు వివరించారు. ఈ సందర్శనలో ప్రొబెషనరీ ఐ.ఏ.ఎస్‌లు ఆశ్ని ఏ.ఎల్, కస్తూరి పాండ, తేజస్విని బేహేరా, దుద్వల్ అభిషేక్ దిలీప్, ప్రణీత దాష్, ప్రేక్ష అగర్వాల్, సి. సరవనన్, ఎం.సి.హెచ్.ఆర్.డి ఫ్యాకల్టీ శ్రీనివాసరావులు ఉన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు సాలిడ్ వేస్ట్ ఎస్.ఈ కోటేశ్వర్ రావు, జాయింట్ కమిషనర్ మహేష్ కులకర్ణి, చీఫ్ పి ఆర్ ఓ మహమ్మద్ ముర్తుజా అలీ, ఓ.ఎస్.డి లు అనురాధ, ఏ వి.రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని వి.వైష్ణవికి అభినందనలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

తమిళనాడులోని కోయంబత్తూరులో జరిగే ఖేలో ఇండియా సౌత్ జోన్ సబ్ జూనియర్ నేషనల్‌కు హైదరాబాద్ ఖో ఖో టీమ్ తరుపున చింతల్, పద్మానగర్ ఫేస్-2 లోని శ్రీనిధి గ్లోబల్ పాఠశాలకు చెందిన వి.వైష్ణవి ఎంపికయ్యారు. ఇటీవల జిల్లా లెవల్‌లో జరిగిన ఖో ఖో పోటీల్లో అదరగొట్టిన వైష్ణవి ఇపుడు ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు జరుగనున్న నేషనల్ లెవల్ గేమ్స్‌లో కూడా విజయం సాదించాలని శ్రీనిధి స్కూల్స్ చైర్మెన్ వెంకటేశ్వర్‌రావు, ప్రెసిడెంట్ రాజేశ్వరి, ప్రిన్సిపాల్ ఎస్.కోమలాదేవి, పీఈటీ శ్రీకాంత్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

పద్మశ్రీ మొగిలయ్యకు
అండగా రాచకొండ కమిషనర్

నవతెలంగాణ-హయత్ నగర్

పద్మశ్రీ కిన్నెర మొగిలయ్యకు ప్రభుత్వం ఇచ్చిన భూమిలో గోడలను గుర్తు తెలియని దుండగులు కూల్చివేయడంతో రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు సోమవారం ఎల్బీనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో మొగిలయ్యను కలిసి సమస్య వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ భూమి పరిరక్షణకు పూర్తి బాధ్యత తీసుకుంటామని అతనికి హామీ ఇచ్చారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత దర్శనం మొగిలయ్యకు తెలంగాణ ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా, హయత్ నగర్ మండలం, భాగ్ హయత్ నగర్ సర్వే నెం.159 లో 600 గజాల భూమిని మంజూరు చేయగా.. మొగులయ్య సదరు ఫ్లాట్‌కు చుట్టూ ఫ్రీ కాస్ట్ గోడ నిర్మించుకున్నారు. ఈ నెల 11న ఫ్రీ కాస్ట్ గోడను గుర్తుతెలియని వ్యక్తులు



కూలగొట్టారని హయత్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. తక్షణమే స్పందించిన అధికారులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ కేసులో తదుపరి విచారణ చేసి, నిందితులను పట్టుకొని చట్టరీత్యా తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఆనంతరం కమిషనర్ మొగిలయ్యను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ మనోహర్, హయత్ నగర్ సీఐ నాగరాజు, ఎస్ఐ లింగా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మూసీ బాధితులు



నవతెలంగాణ - ఎల్బీనగర్

చైతన్యపురి డివిజన్ పరిధిలోని ఫణిగిరి కాలనీవాసులు ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ రెండు రోజుల కిందట ఓ ప్రముఖ వార్త ఛానెల్‌లో ఫణిగిరి కాలనీ చుట్టుపక్కల మూసీ నది పరివాహక ప్రాంతాల్లో ఉన్న కట్టడాలు కూల్చివేస్తామని వచ్చిందని పేర్కొన్నారు. ఆందోళనకు గురైన తాము ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని కలిసినట్టు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. మీరు ఎవరు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ఒక్క ఇటుక కూడా కూల్చకుండా చూస్తామని హామీ ఇచ్చారు. మీకు నేను అండగా ఉంటానని వారికి ధైర్యం చెప్పారు.

ఎమ్మెల్యేను కలిసిన వారిలో మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్ రెడ్డి, పవన్, కడియం మోహన్ రాజ్, కాలనీవాసులు వేణుగోపాల్, వీరచారి, జ్యోతి, ఆంజనేయులు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కళాభిమానులను ఆకర్షిస్తున్న ఆర్ట్ ఎగ్జిబిషన్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఢిల్లీకి చెందిన గ్యాలరీ డాట్‌వాక్, మాదాపూర్ (కావూరిహిల్స్)లోని చిత్రమయి స్టేట్ గ్యాలరీ ఆఫ్ ఆర్ట్‌లో ప్రముఖ క్యూరేటర్ ప్రేమ్‌జిష్ ఆచారితో క్యురేట్ చేయబడిన "సైరెన్స్ లల్లబీ ఇన్ ది ఫర్గాటెన్ రియల్మ్" (మర్చిపోయిన రాజ్యంలో సైరెన్ యొక్క లాలిపాట) పేరుతో ఆర్ట్ ఎగ్జిబిషన్ ప్రదర్శనను అందజేస్తుంది. ఈ ఎగ్జిబిషన్ ఈ నెల 16వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 11 నుంచి సాయంత్రం 7 గంటల వరకు వీక్షించడానికి అవకాశం ఉంటుంది. రవీందర్‌రెడ్డి, జీఆర్ ఈరన్న, జగన్నాథ్ పాండా, టి.వైకుంఠం, అజి విఎస్, మహేష్ బలిగ, సుజిత్ ఎస్ఎన్, టి.వెంకన్న, శోభా బ్రూటాలి వంటి ప్రఖ్యాత భారతీయ కళాకారులతో పాటు ఆశాజనక ప్రతిభావంతులతో రూపొందించబడిన విభిన్నమైన కళాఖండాలను ప్రదర్శించే ఈ ప్రదర్శనలో కలలు, జ్ఞాపకాలు, మనస్సులోని దాగి ఉన్న ప్రాంతాల ప్రత్యేకమైన అన్వేషణ కళాభిమానులను ఆకర్షిస్తుంది. ఈ సందర్భంగా లిక్యూరేటర్ ప్రేమ్‌జీష్ ఆచారి మాట్లాడుతూ 'సైరెన్స్ లల్లబీ ఇన్ ది ఫర్గాటెన్ రియల్మ్' భావోద్వేగాలను రేకెత్తించేలా, కల్పనాశక్తిని రేకెత్తించేలా, ఆలోచనలను రేకెత్తించే శక్తికి నిదర్శనం. పెయింటింగ్, స్కల్ప్చర్, ఇన్‌స్టాలేషన్, మిక్స్‌డ్ మీడియాతో సహా వివిధ మాధ్యమాల ద్వారా, ఎగ్జిబిషన్ వీక్షకులను వారి మనస్సుల మరచిపోయిన ప్రాంతాల్లో ప్రయాణించడానికి ఆహ్వానిస్తుంది" అని తెలిపారు.



మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 20వ డివిజన్ పరిధిలో కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి ఉద్యోగ నగర్ కాలనీలో, అన్నపూర్ణ నగర్ కాలనీ యందు ఐమాక్స్ లైట్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్లు కాలనీవాసులు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బడంగ్‌పేట్



పార్ట్ టైం అతిథి అధ్యాపక ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం



నవతెలంగాణ-శామీర్‌పేట

శామిర్ పేట మండల కేంద్రంలోనితెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ (జగద్గిరిగుట్ట) కళాశాలలో అతిథి ఒప్పంద ప్రాతిపదికన పనిచేయడానికి అధ్యాపక ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపల్ డాక్టర్ ఇష్రత్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కామర్స్ సబ్జెక్ట్ పార్ట్ టైం అతిథి ఒప్పందం ప్రకారం బోధించేందుకు ఆసక్తిగల మహిళా అభ్యర్థులు ఈ నెల 16 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పిజీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు అర్హులని, సెట్, నెట్, పి హెచ్ డీ చేసి బోధన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు.

మేడ్చల్ ఐటీఐలో సీట్ల భర్తీకి దరఖాస్తు ఆహ్వానం

- ప్రిన్సిపాల్ హనుమాన్ నాయక్

నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో కొత్తగా ప్రవేశపెట్టిన ఆరు కోర్సులలో సీట్ల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టుగా ఐటీఐ ప్రిన్సిపల్ హనుమాన్ నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 2024- 25 ఒక సంవత్సరం కోర్సులైన 1)మ్యాను ఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్,ఆటో మిషన్ 2) ఇండస్ట్రియల్ రోబోటిక్, డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ 3) ఆర్టిసాన్ యూజింగ్ అడ్వాన్స్ డ్ టూల్ అదేవిధంగా 2024-26 రెండు సంవత్సరాల కోర్సులైన 4) బేసిక్ డిజైనిర్,వర్చువల్ వెరిఫైర్ (మెకానికల్) 5) అడ్వాన్స్ డ్ మెకానిక్ టెక్ టెక్నీషి యన్, 6) మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ కోర్సులకు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. పదవ తరగతి పాసై 14 సంవత్సరాల వయస్సు పైబడిన వారు అర్హులని తెలిపారు. ఇందుకుగాను అభ్యర్థులు %షషష ట్ఱ్ వశ్రీఖఅస్త్రుఱఖ.ప్రశీజ.ఱఅ% అనే వెబ్ సైట్ నందు నమోదు చేసుకొని అడ్మిషన్ పొందుటకు 14/10/2024 తేదీ నుంచి 19/10/2024 వరకు ఉదయం 11గంటల వరకు రావాలని ప్రిన్సిపాల్ తెలియజేశారు.





దేశం గర్వించదగ్గ

మేధావిని కోల్పోవడం బాధాకరం

- సీపీఐ(ఎం) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి సత్యం
- ప్రొ. సాయిబాబాకు సీపీఐ(ఎం) జిల్లా నాయకుల నివాళ్లు

నవతెలంగాణ-కాప్రా/నేరేడ్ మెట్

దేశం గర్వించదగ్గ ఒక గొప్ప మేధావిని కోల్పోవడం బాధాకరమనిసీపీఐ(ఎం) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి సత్యం అన్నారు. ప్రముఖ విద్యావేత్త, మానవ హక్కుల కార్యకర్త, ప్రముఖ రచయితగా గుర్తింపు పొందిన మాజీ ప్రొఫెసర్ సాయిబాబా భౌతికకాయానికి సోమవారం మౌలాలి డివిజన్ జవహర్ నగర్ లోని శ్రీనివాస్ హైట్స్ లో పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి సత్యం, కార్యదర్శి వర్గ సభ్యులు కోమటి రవి, మల్కాజిగిరి మండల కార్యదర్శి ఎం కపాసాగర్, సీఐటీయూ జిల్లా నాయకులు ఎన్ శ్రీనివాస్, మండలకమిటీ సభ్యులు బంగారు నర్సింగ రావులు అశ్రునివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాయిబాబా మరణానికి కేంద్రమే నైతిక బాధ్యత వహించాలని అన్నారు. రాజ్య హింస పెరిగినప్పుడు సాయిబాబా లాంటి వాళ్ళు పుడుతూనే ఉంటారని, రాజ్య వ్యవస్థ వ్యక్తులను చంపవచ్చు కానీ వారి ఆశయాలను చంపలేదన్నారు. అక్రమ కేసులు, నిర్బంధాలు ప్రయోగించి ప్రశ్నించే వాళ్ళ గొంతు నొక్కాలని చూస్తున్న ప్రజాస్వామికవాదులు, సామాజిక ఉద్యమ కార్యకర్తలు, వామపక్ష మేధావులు, ప్రజలందరూ ప్రశ్నించాలన్నారు. ప్రజా క్షేత్రంలో సమస్యల పరిష్కారం కోసం చేసే ఆందోళనలు, పోరాటాలే సాయిబాబాకి నిజమైన నివాళులని తెలిపారు.



ప్రొఫెసర్ సాయిబాబా పార్థీవ దేహానికి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్. బాల మల్లేష్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. ఎస్. బోస్, ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్‌లు పూలమాల వేసి నివాళి అర్పించారు. నివాళ్లర్పించిన వారిలో సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్రావు, నరసింహ, సాయిలు, కోళ్ల దయానంద్, మిమ్మల్ని నరసింహ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-కాప్రా

కుషాయిగూడ పీహెచ్‌సీని సందర్శించిన కేంద్ర బృందం



నవతెలంగాణ-సిటీబ్యూరో

కేంద్ర ప్రభుత్వానికి చెందిన పర్యవేక్షక బృందం సోమవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని కుషాయిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించింది. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల కింద ముఖ్యమైన ఆరోగ్య సూచికలను సమీక్షించడానికి ఈ బృందం వచ్చింది. డీఎంఅండ్‌హెచ్ డాక్టర్ టి.రఘునాథస్వామి కేంద్ర బృందంతో కలిసి సమీక్షలో పాల్గొన్నారు. ఈ పరిశీలనలో ప్రధానంగా వ్యాక్సిన్ లాజిస్టిక్స్, పుట్టిన వెంటనే ఇచ్చే టీకాల ప్రక్రియ, ఏఈఎఫ్ఐ/అనాఫైలాక్సిస్ కిట్ల వంటి కీలక వనరుల లభ్యతపై దృష్టి సారించారు. పుట్టిన వెంటనే ఇచ్చే టీకాల నిర్వహణను ఈ పర్యవేక్షక బృందం సమీక్షించింది. టీకాలు తక్షణం అందుతున్నాయా..? హెచ్ఎంఐఎస్, యూ-విన్ వ్యవస్థల్లో సరిగ్గా నమోదవుతున్నాయా..? అనే అంశాలను పరిశీలించారు. తల్లులతో చర్చలు జరిపి, ఎంసీపీ కార్డుల ద్వారా టీకా ప్రగతిని ట్రాక్ చేయడం ఎలా జరుగుతోంది..? అన్న దాన్ని పరిశీలించారు. పుట్టిన వెంటనే టీకాలు ఎందుకు ఇవ్వలేకపోయారు..? అనే కారణాలను కూడా విశ్లేషించారు. కేంద్ర బృందం వెంట ఉప జిల్లా వైద్య, ఆరోగ్య అధికారిలు డాక్టర్ సత్యవతి, డాక్టర్ శోభ, జిల్లా ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ సరస్వతి ఉన్నారు.

మంత్రిని కలిసిన మేయర్ అజయ్ యాదవ్



నవతెలంగాణ-బోడుప్పల్

విజయదశమి పండుగ అందరికీ విజయాలు అందించాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. దసరా పండుగను పురస్కరించుకుని జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును బోడుప్పల్ కార్పొరేషన్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ సోమారం మంత్రి నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బోడుప్పల్ కార్పొరేషన్ అభివద్ధి కోసం త్వరలోనే ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని మంత్రి సూచించినట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో కార్పొరేటర్ కుంభం కిరణ్ కుమార్ రెడ్డి,కొత్త కిషోర్ గౌడ్, వెంకటేష్ గుప్త తదితరులు ఉన్నారు.

నేడు ఇందిరమ్మ ఇండ్ల స్కిం కమిటీల కోసం ప్రత్యేక సమావేశం

నవతెలంగాణ-శామీర్‌పేట

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న "ఇందిరమ్మ ఇండ్ల స్కీం" కమిటీల ఏర్పాటు కోసం నేడు మంగళవారం ఉదయం11గంటలకు తూంకుంట మున్సిపల్ కేంద్రంలోని మొగుళ్ల వెంకట్ రెడ్డి గార్డెన్ ఫంక్షన్ హాల్లో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, సీనియర్ నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్, మాజీ జెడ్పీ చైర్మెన్ శరత్ చంద్ర రెడ్డి లు హాజరవుతారని కాంగ్రెస్ తూంకుంట మున్సిపల్ అధ్యక్షుడు భీమిడి జైపాల్ రెడ్డి, శామిర్ పేట మండల అధ్యక్షుడు యాష్కీ శంకర్ గౌడ్, మూడు చింతలపల్లి అధ్యక్షుడు బొమ్మలపల్లి నర్సింలు యాదవ్‌లు సోమవారం వేరు వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సకాలంలో విచ్చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.

విద్యార్థిని చదువుకు బాసటగా ఎమ్మెల్యే

- మాజీ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా చెక్కు అందజేసిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ మధు సుధన్ రెడ్డి కాలనీకి చెందిన లింగోజీ రమేశ్ - మంగమ్మ కుమార్తె తేజ కొత్త గూడం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. అయితే వారి కుటుంబం ఫీజు కట్టలేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి తన స్వంత నిధులతో బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎంబీబీఎస్‌కు అయ్యే ఫీజు రూ. 29,000 చెక్కును మాజీ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో ఎవరైనా ఎంబీబీఎస్ సీటు సాధిస్తే ఫీజు మొత్తం తానే చెల్లిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ చర్లపల్లి డివిజన్ నాయకులు మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులకు బడ్జెట్ కేటాయించాలి

- జోనల్ కమిషనర్‌కు కార్పొరేటర్ వినతి



నవతెలంగాణ-నేరేడ్ మెట్

వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని కమ్యూనిటీ హాల్స్, రోడ్లు పనులు చాలా రోజుల నుంచి పెండింగ్‌లో ఉన్న పనులకు బడ్జెట్ శాంక్షన్ చెయ్యాలని కోరుతూ సోమవారం జోనల్ కమీషనర్ రవి కిరణ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మణ్‌లను వినాయకనగర్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని పెండింగ్‌లో ఉన్న పనులకు వీలైన త్వరగా బడ్జెట్ కేటాయించి, పనులను మొదలుపెట్టాలని కోరినట్టు చెప్పారు.

స్థంభాన్ని అమర్చారు..
లైట్లు బిగించడం మరిచారు



నవతెలంగాణ-అల్వాల్

వెంకటేశ్వర పార్కులో వీధి లైట్ల స్థంభం ఏర్పాటు చేశారు కానీ, ఆ స్థంభానికి లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రిళ్ల ఇబ్బందులు పడుతున్నట్టు స్థానికులు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారకుండా జీహెచ్ఎంసీ అధికారులు పార్కులలో వీధి లైట్లు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. వీధి లైట్లు పనిచేస్తే పార్కులు ప్రజలకు సురక్షితమైన ప్రదేశాలుగా మారతాయన్నారు.



పనులు త్వరగా పూర్తి చేయాలి

నవతెలంగాణ-అల్వాల్

పనులను ఎలాంటి ఆటంకం లేకుండా త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి సందర్భంగా పలు శాఖల అధికారులను డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈ శ్రీకాంతి, ఏఎంసీ నరసింహారెడ్డి, సూపర్డెంట్ స్వామి , అధికారులు ఏఈ రవళి,ఎం హెచ్ ఓ రజిని, సాయి, అధికారులు పాల్గొన్నారు.

సరెండర్ లీవ్స్ డబ్బులు వెంటనే చెల్లించాలి

- జీపీఎఫ్, ఆరోగ్యశ్రీ పెండింగ్స్ ఇవ్వాలి : నర్సుల డిమాండ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

సరెండర్ లీవ్స్‌కు సంబంధించిన డబ్బులు ఏండ్ల తరబడి గవర్నమెంట్ నుంచి రావడం లేదని నర్సులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవసరం కోసం దాచుకున్న జీపీఎఫ్ డబ్బులు సైతం పిల్లల చదువులు, పెండ్లిళ్లు, ఇతర అవసరాల కోసం వాడుకుందామంటే సమయానికి తీసుకోలేకపోతున్నామని, ఇబ్బందులు పడుతున్నామని నర్సులు చెబుతున్నారు. అలాగే నర్సింగ్ సిబ్బంది ఆరోగ్యశ్రీకి సంబంధించిన డబ్బు కూడా రావాల్సిన సమయంలో అందడం లేదనీ, తీవ్ర జాప్యం జరుగుతోందని నర్సులు వాపోతున్నారు. రుసుం ఇవ్వాకున్నా.. ఇన్ కమ్ ట్యాక్స్ కట్ చేస్తున్నారు కానీ, సమయానికి ఎందుకు ఇవ్వడం లేదని నర్సులు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో డాక్టర్లకు సకాలంలో ఇచ్చి, తమకెందుకు ఇవ్వడం లేదని నర్సులు ప్రశ్నిస్తున్నారు. తమ పేరు మారినా తమతో ప్రవర్తించే విధానం మాత్రం మారలేదని నర్సులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్యం అందించే విధానంలో వైద్యులు ఒకలా..? నర్సింగ్ సిబ్బంది ఒకలా..? వార్డు బాయ్ ఒకలా ప్రవర్తించరనీ, అందరూ ఒకేలా సర్వీస్ ఇస్తారనీ, ఇలాంటి సమయంలో నర్సులను ఎందుకు గుర్తించడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు రావాల్సిన పెండింగ్స్‌ను వెంటనే చెల్లించాలని కోరుతున్నారు.

అలయ్ బలయ్‌కు మాజీ మేయర్, కార్పొరేటర్ ఆహ్వానం

నవతెలంగాణ-కాప్రా

ఈనెల 20న కుషాయిగూడ ముదిరాజ్ సంఘం నిర్వహించబోతున్న అలయ్ బలయ్ కార్యక్రమానికి రావాలని కోరుతూ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ శ్రీదేవిలను కుషాయిగూడ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పిట్టల నాగరాజు ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి గడ్డల పాండు ముదిరాజ్, ముదిరాజ్ సంఘం సీనియర్ నాయకులు మల్యాల గణేష్ ముదిరాజ్‌లు కలిసి ప్రత్యేకంగా ఆహ్వానించారు.

తొలగించిన విగ్రహాలను ఏర్పాటు చేయాలి

- మున్సిపల్ కమిషనర్‌కు కౌన్సిలర్లు వినతి పత్రం అందజేత



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని అత్వెల్లి గ్రామం వద్ద చేపడుతున్న జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా జాతీయ రహదారి44 అధికారులు తొలగించిన మహనీయుల విగ్రహాలను వెంటనే ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం కౌన్సిలర్లు జాకట దేవరాజ్,మానస శ్రవణ్ గుప్తా,నారెడ్డి కష్ణవేణి,రొయ్యపల్లి సరిత మల్లేష్ గౌడ్ సోమవారం కమిషనర్ నాగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. తొలగించిన మహాత్మా గాంధీ,బాబా సాహెబ్ అంబేద్కర్,సుభాష్ చంద్రబోస్,స్వామి వివేకానంద, వేమన విగ్రహాలను వెంటనే స్థానికంగా ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో కోరినట్టు వారు తెలిపారు.స్థానిక ప్రజాప్రతినిధులకు ఎలాంటి సమాచారం లేకుండా మహనీయుల విగ్రహాలను తొలగించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తొలగించిన విగ్రహాలను తిరిగి స్థానిక ప్రజాప్రతినిధులతో సంప్రదింపులు జరిపి ప్రతిష్టించాలని వారు కోరారు. తొలగించిన విగ్రహాలకు బదులుగా కొత్త విగ్రహాలను ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రొయ్యపల్లి మల్లేష్ గౌడ్,శ్రవణ్ గుప్తాలు పాల్గొన్నారు.



మేడ్చల్ అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఎన్నికైన నాగిళ్ల బాల్ రెడ్డిని నగర తొలి మేయర్ బొంతు రామ్మోహన్, చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్‌ల సమక్షంలో చక్రిపురం కాలనీ అధ్యక్షులు రాఘవ రెడ్డి, టీచర్స్ కాలనీ వాసులు మహిపాల్ రెడ్డి, ప్రభు గౌడ్, శ్రీకాంత్ యాదవ్ తదితరులు సన్మానించారు. నవతెలంగాణ-కాప్రా

ఎమ్మెల్యేలకు దసరా శుభాకాంక్షలు





నవతెలంగాణ- మేడ్చల్

మాజీ మంత్రి,ఎమ్మెల్యే మల్లారెడ్డి,ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిలను సోమవారం రాష్ట్ర అంబేద్కర్ జై భీమ్ సేవా సంఘం అధ్యక్షులు బక్క నరేందర్, మేడ్చల్ మండల ప్రధాన కార్యదర్శి ఏర్పుల హరిలు వారి నివాసంలో వేరువేరుగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం అందజేసి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.



టీఎన్జీవోస్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్. ఎం.హుస్సేని(ముజీబ్) ఉమ్రా యాత్రను విజయవంతంగా ముగించుకుని హైదరాబాద్‌కు చేరుకున్న శుభసందర్భంగా ఆయనను సోమవారం ఆ సంఘం హైదరాబాద్ జిల్లా కార్యవర్గం అధ్వర్యంలో శాలువా కప్పి. పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి విక్రమ్, ఉపాధ్యక్షులు కె.ఆర్.రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులు కె.శ్రీనివాస్, ఈసీ ముఖీద్, ఏపీఆర్వో వహీద్, సెంట్రల్ యూనియన్ నాల్గవ తరగతి ఎంప్లాయిస్ గౌరవాధ్యక్షులు ఖాదర్, ఉస్మాన్, రామకృష్ణ, స్కూల్ ఎడ్యుకేషన్ యూనిట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఫెరోస్ అహ్మద్, ఈసీ ముజాహీద్, ప్రియా, కృష్ణ, సుదర్శన్ లక్ష్మిపతి, ఐజాజ్, రియాజ్, అతీక్, మొహ్మద్ తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-సిటీబ్యూరో



జెన్‌కో ఇంజినీర్లకు ప్రమోషన్లు...

- డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన ఇంజినీర్స్ అసోసియేషన్ నాయకులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి జెన్‌కో ఇంజనీర్లకు ప్రమోషన్లు ఇచ్చినందుకు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రత్నాకర్ రావు, సదానందం కృతజ్ఞతలు తెలిపారు. టీజీ జెన్‌కోలో పనిచేస్తున్న ఇంజినీర్లు ఎలక్ట్రికల్, మెకానికల్, టెలీ కమ్యూనికేషన్ విభాగాల్లోని 170 మంది ఏఈలు, 33 మంది ఏఏఈలకు ఏడీఈలుగా పదోన్నతి కల్పించింది. ఎలక్ట్రికల్ విభాగంలో 34 మంది ఏడీఈలకు డీఈలుగా, 7 మంది డీఈలకు ఎస్ఈలుగా, ఇద్దరు ఎస్ఈలకు సీఈలుగా పదోన్నతి లభించగా.. మెకానికల్ విభాగంలో 12 మంది ఏడీఈలకు డీఈలుగా, ముగ్గురు డీఈలకు ఎస్ఈలుగా.. సివిల్ విభాగంలో ఐదుగురు ఏఈలు, ఒక ఏఏ ఈకు ఏఈఈలుగా, ఇద్దరు ఏఈఈలకు ఈఈలుగా పదోన్నతి కల్పించిన విషయం తెలిసిందే. అదే విధంగా జెన్‌కో ఇంజనీర్లకు ప్రమోషన్లు ఇచ్చినందుకు ఎనర్జీ సెక్రటరీ రోనాల్డ్ రోజ్‌ని కలిసి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఉప ముఖ్యమంత్రిని కలిసినవారిలో అసోసియేట్ ప్రెసిడెంట్ వెంకటనారాయణ రెడ్డి, కిషోర్, సురేష్ కుమార్, పీవీ రావు, అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వేణు, అనిల్ కుమార్, సుజిత్, రాజు, రాజేష్, రెమెడీ శ్రీనివాస్, నాగరాజ్ ఉన్నారు.

టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులకు సన్మానం



నవతెలంగాణ-సిటీబ్యూరో

దసరా పండుగ సందర్భంగా టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.హుస్సేనీ(ముజీబ్)లకు ఆ సంఘం నాయకులు పూలబొకే అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, సెక్రటరీ బుచ్చిరెడ్డి, హైదరాబాద్ జిల్లా సెక్రటరీ విక్రమ్ కుమార్, సహాధ్యక్షులు కె.ఆర్.రాజ్ కుమార్, ఉపాధ్యక్షులు ఒమర్ ఖాన్, కె.శ్రీనివాస్, పబ్లిక్ సెక్రటరీ వైదిక్ శాస్త్ర, ఈసీ ముఖీద్, సెంట్రల్ యూనియన్ నాల్గవ తరగతి ఎంప్లాయిస్ గౌరవాధ్యక్షులు ఖాదర్, ఈఎస్‌టీ రాజు, స్కూల్ ఎడ్యుకేషన్ యూనిట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఫెర్రోస్ అహ్మద్, ఈసీ ముజాహిద్, ప్రియా, కృష్ణ, సుదర్శన్ లక్ష్మిపతి, ఐజాజ్, సాధిక్, అతీక్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శరన్నవరాత్రోత్సవాలు



నవతెలంగాణ-చంపాపేట్

సంతోష్ నగర్ డివిజన్ అధ్యక్షులు చింతల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గామాత దేవి అమ్మవారి మండపం వద్దకు ఏసీపీ మహమ్మద్ గౌస్ విచ్చేసి ప్రత్యే పూజలు నిర్వహించారు. ఏసీపీకి నిర్వాహకులు దసరా శుభాకాంక్షలు తెలుపుతూ శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విజయదశమి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ అధ్యక్షులు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎస్ సదన్ సీఐ ఎం. సైదయ్య, ఎస్సైలు, ఏఎస్ఐలు, సిబ్బంది భాస్కర్, ముఖేష్, పరశు రాం, వెంకట్ రెడ్డి, ముంతు, గణేష్, రవి, రాంచందర్, శశి, శశిధర్, కిరణ్, సోమేష్, బంటి, సునీత భక్తులు తదితరులు పాల్గొన్నారు..

హైదరాబాద్ మేయర్‌పై కేసు నమోదు



నవతెలంగాణ - బంజారాహిల్స్

శబ్ద కాలుష్య నిబంధనలను ఉల్లంఘిస్తూ బతుకమ్మ వేడుకలకు అనుమతించిన సమయానికి మించి అధిక డెసిబుల్ సంగీతాన్ని పెట్టారనే ఆరోపణలపై జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిపై బంజారాహిల్స్ పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేశారు. ఆమెతో పాటు బతుకమ్మ వేడుకల నిర్వాహకులు, డీజే నిర్వాహకులపై కూడా కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే... ఈ నెల 10న బంజారాహిల్స్ ఎన్‌బీటీ నగర్ లో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకలకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి హాజరయ్యారు. అయితే రాత్రి 11.45 గంటల తర్వాత మ్యూజిక్ పెట్టడంతో స్థానిక పోలీసులు అక్కడికి చేరుకుని డీజే సౌండ్స్ అభ్యంతరం తెలిపారు. దీనికి మేయర్, నిర్వాహకులు ఒప్పుకోలేదు. అలాగే మేయర్ కొన్ని వ్యాఖ్యలు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలు వైరల్ కావడంతో వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షల వెల్లువ



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి క్యాంప్ కార్యాలయానికి ఆదివారం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్, జల్ పల్లి మున్సిపల్ నియోజకవర్గం అన్ని ప్రాంతాల నుంచి ప్రజలు తరలి వచ్చి ఎమ్మెల్యేకు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తనపైన ఉన్న అభిమానంతో తరలివచ్చి, పలకరించి శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ ఎంతో రుణపడి ఉంటానని చెప్పారు. ముఖ్యంగా తన నియోజకవర్గ ప్రజలను కంటికి రెప్పలాగా కాపాడుకుంటానని అన్నారు. విచ్చేసిన ప్రతి ఒక్కరిని ఆప్యాయతతో పలకరించి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కార కోసం నిరంతరం పోరాడుతానని అందరికీ హామీ ఇచ్చారు.

ప్రజావాణి విజ్ఞప్తుల పరిష్కారానికి చొరవ చూపాలి

- అడిషనల్ కమిషనర్ నళిని పద్మావతి
- జీహెచ్ఎంసీ పరిధిలో ప్రజావాణికి 78 అర్జీలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజావాణి విజ్ఞప్తుల పరిష్కారానికి చొరవ చూపాలని అడిషనల్ కమిషనర్ నళిని పద్మావతి సంబంధిత అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ నగరంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి అడిషనల్ కమిషనర్ నళిని పద్మావతితో పాటుగా అడిషనల్ కమిషనర్లు యాదగిరి రావు, వెను గోపాల్ రెడ్డి అడిషనల్ సీ.సీ.పీ గంగాధర్ విజ్ఞప్తులను స్వీకరించారు. ఆయా ఆర్జీలను సంబంధిత అధికారులకు అందజేసి వెంటనే చర్యలు తీసుకొని పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా నళిని పద్మావతి మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన విజ్ఞప్తులను త్వరితగతిన పరిష్కరించడం పై ఆయా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా (6) విన్నపాలు రాగా సంబంధిత అధికారులకు పరిష్కారానికి పంపారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాల యంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 26 విన్నపాలు రాగా అందులో టౌన్ ప్లానింగ్ 12, ట్యాక్స్ సెక్షన్ 06, సి.ఈ మెయింటెనెన్స్ 02, ఎఫ్.ఎ సెక్షన్ 02, ఎస్టేట్, అడ్వర్టైజ్‌మెంట్, హెల్త్, ఎల్.డబ్ల్యూ.ఎస్ విభాగాలకు ఒక్కొక్కటి చొప్పున విన్నపాలు వచ్చాయి. జీహెచ్ఎంసీ పరిధిలో ఆరు జోన్లలో మొత్తం 52 అర్జీలు వచ్చాయి. అందులో కూకట్‌పల్లి జోన్‌లో 25, సికింద్రాబాద్ జోన్‌లో 14, ఎల్బీనగర్ జోన్‌లో 05, చార్మినార్ జోన్ లో 04, శేరిలింగంపల్లి జోన్‌లో 03, ఖైరతాబాద్ జోన్ లో ఒక అర్జీ వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ చీఫ్ అబ్దుల్ వకీల్, ఎంటమాలజీ డా.రాంబాబు, జాయింట్ కమిషనర్ మహేష్ కులకర్ణి, సి.ఈ మెయింటెనెన్స్ భాస్కర్ రెడ్డి, ఈ.వీ.డి.ఎం ఏసిపి సుదర్శన్, ఆయా విభాగాల అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

క్లిక్ చేస్తే చాలు... గూగుల్ మ్యాప్‌లో చిట్టా

- ఒక్కో ప్రాంతంలో ఎన్ని సార్లు ఫిర్యాదులు అందినవి, పరిష్కరించిన వివరాలు, మ్యాన్ హోళ్లు, డీసిల్టింగ్ వివరాలు రోజూ ఆన్ లైన్‌లో నమోదు చేయాల్సిందే
- 90 రోజుల స్పెషల్ డ్రైవ్ పై జలమండలి ఎండీ సమీక్ష



నవతెలంగాణ-సిటీబ్యూరో

జలమండలి చేపట్టిన 90 రోజుల స్పెషల్ డ్రైవ్ సత్ఫలితాలనిస్తోందని ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. సోమవారం ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారులతో . సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌పై ప్రధాన కార్యాలయంలో డాష్ బోర్డు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇందులో సీవరేజ్ ఓవర్ ఫ్లో, కలుషిత నీరు, రోడ్లపై సిల్ట్ తదితర వాటిపై ఎంసీసీకి వచ్చే ఫిర్యాదులను ఆయా క్యాన్ నంబర్లను జీపీఎస్ ఆధారంగా గూగుల్ మ్యాప్‌లో నమోదు చేస్తున్నామన్నారు. ఈ నమోదు ఒక్కో ప్రాంతంలో ఎన్ని సార్లు ఫిర్యాదులు అందినవి, ఎన్నిసార్లు పరిష్కరించిన వివరాలను ఆ మ్యాప్‌లో ఒక బబుల్ (బుడగ) లా కనిపించేలాగా ఏర్పాటు చేశామన్నారు. ఫిర్యాదుల సంఖ్యను బట్టి ఆ బబుల్ పరిమాణం మారుతుందని చెప్పారు. ఈ ఏర్పాటు వల్ల సమస్య తీవ్రతను బట్టి అధికారులు దాన్ని పరిష్కరించే వీలుందన్నారు. మ్యాన్ హెూళ్లు, డీసిల్టింగ్ వివరాల్ని రోజూ ఆన్ లైన్‌లో నమోదు చేయాలని అధికారులకు ఎండీ సూచించారు. మ్యాన్ హెూళ్లలో తీసిన వ్యర్థాలను (సిల్ట్) డంపింగ్ యార్డుకు తరలించాలని ఆదేశించారు. ఎంసీసీలో వచ్చే ఫిర్యాదులపై దృష్టి సారించాలన్నారు. 90 రోజుల స్పెషల్ డ్రైవ్ ద్వార మంచి ఫలితాలొస్తున్నాయని, ప్రజల్లో సైతం మంచి అభిప్రాయం వస్తోందన్నారు. పనితీరు కనబరుస్తుందన్నందుకు సిబ్బందిని, అధికారులను ఎండీ ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే రోజుల్లోనూ ఇదే వేగంతో కష్టపడితే మంచి ఫలితాలు సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. ఇక డ్రై బోర్‌వెల్స్‌పై కొనసాగుతన్న సర్వేను వేగవంతం చేయాలని ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వినియోగదారులు తమ ఇండ్లల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయని వారికి నోటీసులు జారీ చేయాలన్నారు. వచ్చే జనవరి నుంచి ట్యాంకర్ బుక్ చేస్తే అదనపు ఛార్జి వసూలు చేస్తామని తెలిపారు. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని వినియోగదారులకు ఎస్సెమ్మెస్ రూపంలో పంపించడంతో పాటు నేరుగా వారికి పత్రాలు అందజేయాలన్నారు. సమావేశంలో ఓటీఎస్ పైనా ఎండీ చర్చించారు. వినియోగదారుల బకాయిలకు సంబంధించి వివరాలను ఎస్సెమ్మెస్ ద్వారా పంపించాలన్నారు. అందులో బిల్లు చెల్లింపునకు చెందిన లింకును కూడా పంపించాలని, తద్వారా వారికి సులభంగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఈఎన్సీ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, డైరెక్టర్ ఆపరేషన్స్-2 స్వామి, డైరెక్టర్ ఆపరేషన్స్-1 విజయరావు, సీజీఎంలు, జీఎంలు, డీజీఎంలు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-ఓయూ

అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయించుకోలేని వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో మేలు చేస్తుందని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి అన్నారు. తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన రెడ్డితో కలిసి వారు సీఎంఆర్ఎఫ్ చెక్కును బాధితుడు మొహమ్మద్ అర్షాదుకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్ద మనసుతో రాష్ట్ర ప్రజలకు తానున్నానని భరోసా కల్పిస్తూ, వారికి వైద్య పరంగా ఎటువంటి ఇబ్బందులు రాకుండా సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేస్తూ అండగా నిలుస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పవన్ కళ్యాణ్, ఖాజా పాషా పాల్గొన్నారు.

పీడిత ప్రజల పక్షపాతి సాయిబాబాకు జోహార్లు

- ప్రొఫెసర్ కొండా. నాగేశ్వర్



నవతెలంగాణ-ఓయూ

సుమారు మూడున్నర దశాబ్దాల పాటు దళితుల, గిరిజనుల, ఆదివాసీల, మైనారిటీల హక్కుల కోసం పోరాడిన హక్కుల కార్యకర్త ప్రొఫెసర్ సాయిబాబా మరణం పీడిత ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని ఓయూ ప్రొఫెసర్ కొండా. నాగేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే అంత రాలు లేని సమాజం కోసం నిరంతరం ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆయన పోరాటం చేశారని తెలిపారు. సకలాంగుల చేయనటువంటి ఒక మహోన్నతి త్యాగం ఈ దేశం కోసం సాయిబాబా చేశారని చెప్పారు. నిరాధారమైన ఆరోపణలతో సాయి బాబాను అకారణంగా బీజేపీ ప్రభుత్వం పదేండ్లపాటు బంధించినా మొక్కోవని దీక్షతో తన పోరాటం కొనసాగించారని తెలిపారు. కనీస మానవీయ, కనికరం లేని ఫాసిస్ట్ ప్రభుత్వ విధానాలు ఫలితంగా సాయిబాబా మానసిక ఒత్తిడికి గురయ్యారన్నారు.. ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా కేంద్ర ప్రభుత్వం ప్రొఫెసర్ సాయిబాబా మరణానికి నైతిక బాధ్యత వహించాలని అన్నారు. ప్రజాస్వామ్యంలో అశాంతి, నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని.. రాజ్యాంగం ప్రసాదించిన హక్కులలో భాగంగానే ప్రొఫెసర్ సాయి బాబా వివిధ వర్గాల రాజ్యాంగ హక్కులపై అలుపెరుగని మేధో పోరాటం చేశారని చెప్పారు. సాయిబాబా మరణానికి యూనివర్సిటీల ఆచార్యుల పక్షాన, ప్రజా సంఘాల పక్షాన జోహార్. అమర్ రహే ప్రొఫెసర్ సాయిబాబా అని అన్నారు.



కుమ్మరిగూడ ముత్యాలమ్మ దేవాలయంలో విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగుడిని కఠినంగా శిక్షించాలని మాజీ కార్పొరేటర్ వసంత యాదవ్, నర్సింగరావు డిమాండ్ చేశారు. విగ్రహం ధ్వంసం చేయడంతో ఆలయం వద్ద వారు ఆందోళన చేపట్టారు.
నవతెలంగాణ-బేగంపేట

మంచినీటి సమస్య పరిష్కారానికి ఆందోళనలు తప్పవు

- బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ



నవతెలంగాణ-కంటోన్మెంట్

మంచినీటి సమస్య పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదంటూ బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ మండిపడ్డారు. మంచినీటి సమస్య పరిష్కారానికి ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. సోమవారం ఆరో వార్డులోని మహాత్మా నగర్‌లో బస్తీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు మంచినీటి సమస్య ఇతర సమస్యలు చెప్పారు. అయితే మంచినీటి సమస్య కోసం కంటోన్మెంట్ కృషి చేస్తోందని.. కానీ రాష్ట్ర ప్రభుత్వం కంటోన్మెంట్ బోర్డుకు కావలసిన నీటిని సరఫరా చేయడం లేదన్నారు. దానివల్ల నీటి తీవ్రత ఎక్కువగా ఉందన్న విషయాన్ని ఆయన చెప్పారు. రానున్న రోజుల్లో మంచినీటి సమస్య పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వంపై ఆందోళన కార్యక్రమం చేపట్టనున్నట్టు చెప్పారు. అవసరమైతే స్థానికులందరూ కూడా ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు .అలాగే స్థానికులు చెప్పిన సమస్యలు అధికారుల దృష్టికి తీసుకుపోయి తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సాయిబాబాది ప్రభుత్వ హత్యే

- హక్కుల ఉద్యమానికి తీరని లోటు.
- సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కంపెల్లి శ్రీనివాస్



నవతెలంగాణ-ఓయూ

ప్రొఫెసర్ సాయిబాబా మరణం హక్కుల ఉద్యమానికి తీరని, లోటని ఇది ముమ్మాటికి సర్కారీ హత్యేనని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కంపెల్లి శ్రీనివాస్ అన్నారు.తన జీవితం చివరి శ్వాస వరకు పీడిత ప్రజల గొంతుకగా నిలబడ్డారు సాయిబాబా అన్నారు. అక్రమ కేసులు బనాయించి అన్యాయంగా ఏండ్ల తరబడి అండ సెల్ లో నిర్బంధించి వైద్యం అందించకుండా హింసించినా రాజీ పడకుండా తాను నమ్మిన సిద్ధాంతం కోసం చివరి శ్వాస వరకు నిలబడిన పోరాటయోధుడు సాయిబాబా అని కొనియా డారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని దేశవ్యాప్తంగా హరించబడుతున్న ఆదివాసి హక్కుల కోసం, వారిపై జరుగుతున్న హింస లైంగిక దాడులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని.. అదే సాయిబాబాకు అసలైన నివాళి అన్నారు. సాయిబాబా కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

సరికొత్త రుచులకు వేదికగా నగరం

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్ పి.విజయ రెడ్డి



నవతెలంగాణ-బంజారాహిల్స్

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బ్రాండ్లు తమ బ్రాంచీలను నగరంలో ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు రావడం అభినందనీయమని, ఇది నగర అభివద్ధికి ఎంతో దోహదం చేస్తుందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్ పి,విజయ రెడ్డి అన్నారు. సరికొత్త రుచులకు వేదికగా నగరం మారుతోందన్నారు. గుజరాత్‌లో ఎంతో ప్రాచుర్యం పొందిన హెల్లి అండ్ చిల్లీ రెస్టారెంట్‌ను ఖైరతాబాద్‌లో కార్పొరేటర్ విజయారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫుడ్‌రంగంలో నగరం రోజురోజుకు అభివద్ధి చెందుతున్నదని, ఏ దేశానికి చెందిన వారు వచ్చినా వారి వారి ఆహారపు అలవాట్లకు తగినట్టుగా ఆహారం దొరుకుతుందని అన్నారు. అనంతరం నిర్వాహకులు షుజావుదదీన్ మాట్లాడుతూ...హెల్లి అండ్ చిల్లీ రెస్టారెంట్ ఫుడ్ రంగంలో ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో సైతం నమోదై ఉన్నదని, నాణ్యమైన సేవలకు ఇది పేరుగాంచిందని అన్నారు.ఈ రెస్టారెంట్‌లో వినియోగదారులు సరికొత్త అనుభూతికి లోనయ్యేలా బర్గర్, కాఫీలలో వారి పేర్లతో అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు జమీర్, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా తర్వాత ఎక్కువ కిక్కిచ్చేది ఫుడ్ మాత్రమే



- నటుడు నిఖిల్ సిద్ధార్థ్

నవతెలంగాణ-బంజారా హిల్స్

తనకు గోదావరి జిల్లాల రుచులతో పాటు సినిమా తర్వాత ఎక్కువగా కిక్కిచ్చేది ఏదైనా ఉందంటే అది ఫుడ్ మాత్రమేనని నటుడు నిఖిల్ సిద్ధార్థ్ అన్నారు. నగరంలో కేజీఎఫ్(కృష్ణ గోదావరి ఫ్లేవర్స్) పేరుతో ఏర్పాటు చేసిన రెస్టారెంట్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేజీఎఫ్ అనగానే ఎవరికైనా సినిమా గుర్తొస్తుందని.. కానీ ఈ పేరు నుంచి లోకల్ క్రియేటివిటీతో కృష్ణ, గోదావరి అంటూ రెస్టారెంట్‌ను ఏర్పాటు చేయడం బాగుందన్నారు. నిర్వాహకులు మాట్లా డుతూ నగరంలో తమది ఇది తొలి బ్రాంచ్ అని, త్వరలోనే నగర వ్యాప్తంగా మరిన్ని శాఖలు తెరిచేందుకు ప్రయత్ని స్తున్నామని తెలిపారు.

ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ మాట్లా డుతూ మనం బతకడంతో పాటు నలుగురిని బతికించాలని.. రెస్టారెంట్‌తో నలుగురికి ఉపాధి కల్పించడం మంచి విషయమని అన్నారు. భోజన ప్రియులకు రుచితో పాటు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, జగదీశ్వర్‌గౌడ్, రవికుమార్ యాదవ్, మంజుల, రగునాథ్‌రెడ్డి, రాఘవరావు, నిర్వాహకులు శ్రీకాంత్ పెద్ది, సాగర్ సజ్జ, భరత్ చెమికల, సందీప్ తుమటి, ఫణి జెట్టి, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

రవీందర్ బాగున్నావా..? మీ కార్యక్రమాలు బాగున్నాయి..

- మంచి భవిష్యత్ ఉంది.. సమస్యలపై పోరాటం చేయు
- బీఆర్ఎస్ సీనియర్ నేత రవీందర్ యాదవ్‌కు కేసీఆర్ ప్రశంసలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను శేరిలింగంపల్లి యువనేత రవీందర్ యాదవ్ సోమవారం తన జన్మదినం సందర్భంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా రవీందర్ యాదవ్‌ను కేసీఆర్ ప్రత్యేకంగా అభినందించారు. పార్టీ కార్యక్రమాలు చాలా బాగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. రవీందర్ యాదవ్‌కు బర్త్ డే విషెస్ తెలిపి శాలువాతో సన్మానించారు. రవీందర్ యాదవ్‌కు మంచి భవిష్యత్ ఉందని, తెలంగాణ ఉద్యమంలో పోరాడిన విధంగా ముందుకు వెళ్లాలని సూచించారు. పార్టీ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొంటున్న తీరును, శేరిలింగంపల్లిలోని పార్టీ వివరాలను కేసీఆర్ అడిగి తెలుసుకున్నారు. సేవా కార్యక్రమాల్లో ముందు ఉండటంపై కేసీఆర్ ప్రత్యేకంగా అభినందించారు. పార్టీ కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకువెళ్లాలని సూచించినట్టుగా రవీందర్ యాదవ్ తెలిపారు. కష్టపడి పని చేసే వారికి పార్టీలో సరైన గుర్తింపు లభిస్తుందని కేసీఆర్ వెల్లడించారన్నారు. ప్రతి ఏడాది లాగే తమ అధినేత కేసీఆర్‌ను కలిసి, తన జన్మదినంను జరుపుకోవడం సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. శేరిలింగంపల్లిలో ఎంత మంది నేతలు పార్టీని వీడినా వచ్చిన నష్టమేమి లేదని రవీందర్ యాదవ్ అన్నారు. అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లిలో పార్టీని గెలిపిస్తామని, ప్రజల తరుపున పోరాటం కొనసాగిస్తామని వెల్లడించారు. త్వరలోనే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయనున్నట్టు స్పష్టం చేశారు.

వస్త్రం బై సింఘానియాస్ స్టోర్ ప్రారంభం



- ప్రారంభించిన మిస్ యూనివర్స్ ఆంధ్రప్రదేశ్ చందన జయరామ్

నవతెలంగాణ - బంజారాహిల్స్

స్వచ్ఛమైన చేనేత నైపుణ్యానికి ప్రసిద్ధి చెందిన సింఘానియా వారసత్వ వస్త్రం బై సింఘానియాస్ మొదటి స్టోర్‌ను సోమవారం నగరంలోని గచ్చిబౌలిలో మిస్ యూనివర్స్ ఆంధ్రప్రదేశ్ 2024 చందన జయరామ్ ప్రారంభించారు. అనంతరం షోరూంలో కొలువుదీరిన ఫ్యాషన్ వస్త్రాలను తిలకిస్తూ సందడి చేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ... సమగ్రమైన షాపింగ్ అనుభవాన్ని అందిచేందుకు వస్త్రం ఇక్కడ ఏర్పాటు కావడం అభినందనీయమన్నారు. నేటి మగువల మనోభావాలు, ఫ్యాషన్ ట్రెండ్‌కు అనుగుణంగా ఫ్యాషన్ మిళిత వస్త్రోత్పత్తులు ఆకట్టుకుంటున్నాయని తెలిపారు.వస్త్రం బై సింఘానియాస్ డైరెక్టర్, ఫ్యాషన్ డిజైనర్ శైలేష్ సింఘానియా మాట్లాడుతూ ఫాస్ట్ ఫ్యాషన్ ఉత్పత్తులతో పాటు చీరలు, సమకాలీన దుస్తులు, వైవిధ్యమైన ఫ్యాషన్ అవసరాలకు అనుగుణంగా రెడీ టూ వేర్ వంటి వస్త్రోత్పత్తులకు ప్రత్యేకతగా వస్త్రం అందుబాటులోకి తీసుకు వచ్చామని చెప్పారు. హైదరాబాద్‌లో మరో నాలుగు బ్రాంచీలను ప్రారంభించనున్నట్టు తెలిపారు.

దసరా వేడుకల్లో నాట్య కళా ప్రదర్శనతో సందడి




నవతెలంగాణ-కల్చరల్

దసరా వేడుకల సందర్భంగా శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై బంగారు తెలంగాణ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహణలో అంతర్జాతీయ నృత్యోత్సవం జరిగింది. తెలుగు రాష్ట్రాలలో పేరుగాంచిన కళాకారులు తమ శాస్త్రీయ జాన పద నృత్యాలతో సందడి చేశారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ పార్టీ నేత నగేష్ ముదిరాజ్ పాల్గొని మాట్లాడుతూ నాట్యం మానసిక శారీరక ఆరోగ్యానికి సాధనం అన్నారు. సంఖ్యా శాస్త్రవేత్త దైవజ్ఞ శర్మ మాట్లాడుతూ సంస్థ నిర్వాహకుడు విక్కీ మాస్టర్ స్వయంగా నృత్య కళా కారుడు అని చెప్పారు వేదిక పై నరసింగ్ రావు, నృత్య గురువులు లత రావు కావేటి భానుశ్రీ పాల్గొనగా సంస్థ స్థాపకుడు విక్కీ మాస్టర్ అధ్యక్షత వహించి కార్యక్రమ వివరాలు తెలిపారు ఈ సందర్భంగా నృత్య కళా కారుల కు అవార్డ్స్ బహుకరించారు. రమణా చారి వ్యాఖ్యానం సందర్భోచితంగా ఉంది

పద్య నాటకాలు తెలుగు భాషా సంపద



నవతెలంగాణ-కల్చరల్

పద్య పౌరాణిక నాటక సాహిత్యం తెలుగుభాషా సంపద అని ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ ఎం కె రాము అన్నారు. ఈ సంపద ను పరిరక్షించుకుని ముందు తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వం తో పాటు సమాజం పై ఉందని అయన చెప్పారు. శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా దీక్షితులు కళా వేదిక పై గాన సభ సౌజన్యంతో ఆరాధన సాంస్కృతిక సంస్థ నిర్వహణలో ఐదు రోజుల పాటు జరిగే పద్య నాటకోత్సవం సోమ వారం ఆరంభం అయింది. తిరుపతి వెంకట కవులు రచించిన పాండవోద్యోగ విజయాలు పౌరాణిక పద్య నాటకంలోని ద్వారక దృశ్యం మయ సభ దుర్యోధనుని భంగ పాటు దృశ్యాల ప్రదర్శన జరిగింది. సళ్వా చారి దుర్యోధనునిగా రసవత్తరంగా నటించగా కృష్ణునిగా బాబూరాజు పద్య పఠనం తో ప్రేక్షక ప్రశంస అందుకున్నారు. అర్జుననిగా నారాయణ స్వామి దృశ్యం రక్తి కట్టించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ రాము పాల్గొని బాబూ రాజును సాల్వ చారిని, నారాయణ స్వామిని సత్కరించి మాట్లాడారు. తిరుపతి వెంకట కవులు పద్యాలు గ్రామీణ ప్రాంతాల రైతులు నోట కూడా నాటి కాలం లో వినవచ్చేవి అన్నారు. యువ కళా వాహిని అధ్యక్షులు లంక లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించిన వేదిక పై కళా పోషకులు వీర భోగ వసంత రాయలు ఉమర్ ఖాన్ అలి తదితరులు పాల్గొన్నారు. సంస్థ అధ్యక్షులు లోకం కృష్ణయ్య స్వాగతం పలికారు.



మౌలాలిలోని ప్రొఫెసర్ సాయిబాబా భౌతిక కాయానికి సోమవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యేలు కెపి.వివేకానంద్, మాధవరం కృష్ణారావు, కాలేరు వెంకటేష్ పూలమాలవేసి నివాళు లర్పించి వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

21 నుంచి 27 వరకు గ్రూప్-1 మెయిన్స్

- అధికారులు సమన్వయంతో పని చేయాలి
- పరీక్ష ప్రశాంతంగా జరిగేలా చూడాలి
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఈ నెల 21 నుంచి 27వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్ -1 సర్వీసెస్ మెయిన్స్ రాత పరీక్ష ఉంటుందని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఈ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులను మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రాల్లోనికి అనుమతిస్తారని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు సమన్వయంతో పరీక్షలు సజావుగా, ప్రశాంతంగా జరిగేలా చూడాలని సూచించారు. గ్రూప్ -1 సర్వీసెస్ మెయిన్స్ రాత పరీక్షకు జిల్లాలో 27 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని తెలిపారు.

ప్రజావాణికి 33 ఫిర్యాదులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా లా ఆఫీసర్ చంద్రావతితో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి స్వీకరించారు. ప్రజావాణికి 33 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలనీ, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

పలువురికి శుభాకాంక్షలు తెలిపిన దొడ్ల









నవతెలంగాణ-కూకట్‌పల్లి

జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో నూతనంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన నరసింహులుని యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ కలిసి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, షౌకత్ అలీ మున్నా, యాదగిరి, సంగమేష్, మహేష్, మజర్, ఫారూఖ్, ఖలీమ్, మల్లేష్, నాగరాజు, సంతోష్ బిరాదర్, ఉమేష్, వెంకటకృష్ణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ,ఎమ్మెల్సీ లకు శుభాకాంక్షలు తెలిపిన దొడ్ల రామకృష్ణ గౌడ్

దసరా పర్వదిన శుభ సందర్భంగా.. కూకట్‌పల్లి శాసనసభ్యులు, మాధవరం కృష్ణారావుని, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని, వారి కార్యాలయాల్లో కార్పొరేటర్ జగన్, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.

జగదిరిగుట్ట సీఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన నరసింహులుని టీటీడీపీ రాష్ట్ర సీనియర్ నాయకులు, శ్రీరామోజు శివ కుమార్ శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి టీడీపీ డివిజన్ కమిటీ సిద్దయ్య, అర్జున్, శేఖరరెడ్డి, రాంబాబు, టీ.ఎన్.ఎస్.ఎఫ్ సాయిరామ్, వెంకటేష్, అంజి, శ్రీధర్, మారయ్యా, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలకు దసరా పండుగ శుభాకాంక్షలు





నవతెలంగాణ-కుత్బుల్లాపూర్/దుండిగల్

కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతి నిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సంక్షేమ సంఘాల సభ్యులు ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్‌ని కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జగజ్జనని అయిన అమ్మవారి కటాక్షాలు ఎమ్మెల్యే సంపూర్ణంగా ఉండాలని కోరుకుంటూ వేద పండితులు అమ్మవారి ఆశీర్వాదం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ.... దసరా పండుగను పురస్కరించుకొని అమ్మవారి దయ, కృపాకటాక్షాలతో ప్రజలంతా అష్టైశ్వర్యాలు, సుఖ సంతోషాలతో జీవించాలన్నారు.

కోలన్‌కు విజయ దశమి శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు, ప్రజలు..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు సోమవారం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కలిసి విజయ దశమి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కోలన్ ప్రజలందరికి విజయ దశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ శాంతులతో జీవించేలా ఆ దుర్గా మాత ఆశీర్వదించాలని ప్రార్థించారు. చెడు పై మంచి సాధించిన విజయమే దసరా పండుగ అని చెడు పై పోరాడి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి మనందరం కృషి చేయాలని తెలిపారు.

మాజీ ఎమ్మెల్యేకు దసరా శుభాకాంక్షల వెల్లువ ...

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని నిజాంపేట్, కొంపల్లి తదితర కాలనీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సోమవారం మాజీ ఎమ్మెల్యే,కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ప్రత్యేకంగా కూన శ్రీశైలం గౌడ్‌ని తన నివాసం వద్ద కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి అత్యధిక నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తానని అన్నారు.



తల్లితో సహా కుమారుడి అదృశ్యం

నవతెలంగాణ-బాలానగర్

భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు వచ్చిన నేపథ్యంలో.. గొడవలు రావడంతో డీమార్ట్‌కు వచ్చిన ఓ మహిళ కుమారుడితో సహా అదృశ్యమైన సంఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాలానగర్ సీఐ నరసింహరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఆస్ బెస్టాస్ కాలనీకి చెందిన లక్ష్మి, తన ఇద్దరు కుమారులతో కలిసి ద్విచక్ర వాహనంపై ఆదివారం సాయంత్రం ఐడీపీఎల్ కాలనీ సమీపంలోని డీమార్ట్‌కు వెళ్లింది. ఆ క్రమంలో సరుకులు తీసుకుని పెద్ద కుమారుడికి ఇచ్చి వాహనంపై వెళ్లి ఇంట్లో పెట్టాలని చెప్పింది. అనంతరం ఆమె తన సెల్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఎనిమిదేండ్ల చిన్న కుమారుడితో సహా అదృశ్యమైంది. ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఆమె భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. భర్తతో గొడవలు జరగడంతో ఆమె చిన్న కుమారుడితో ఇంటి నుంచి వెళ్లిందని పోలీసులు వివరించారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

గాంధీని కలిసిన అవోపా సభ్యులు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

దసరా పండగ సందర్భంగా.. పీఏసీ చైర్మెన్, ఎంఎల్ఏ అరికపూడి గాంధీని, సీనియర్ నేత నాయినేని చంద్రకాంత్ రావుని కలిసి శుభాకాంక్షలు తెలిపిన ఆర్య వైశ్య ప్రముఖులు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అవోపా ఆర్గనైజింగ్ సెక్రటరీ కట్ట రవి కుమార్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు పెండ్యాల నాగరాజు, జోన్ సెక్రటరీ రఘు వంశి, మేడ్చల్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జయ కుమార్, వైస్ ప్రెసిడెంట్ సాయి ప్రసాద్, కూకట్‌పల్లి అధ్యక్షులు సురేష్ కుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

దసరా శుభాకాంక్షలు తెలిపిన శ్రీధర్ రెడ్డి..

తెలంగాణ రాష్ట్ర పీఏసీ చైర్మెన్ శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరేకపూడి గాంధీని ఆయన నివాసంలో, పాపిరెడ్డి నగర్ సీనియర్ నాయకుడు చిట్టి రెడ్డి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో.. కలిసి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా జగద్గిరిగుట్ట నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన నర్సింలుని, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణని మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావుని శాలువాతో సన్మానించి, దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చర్ల రామకృష్ణారెడ్డి మాయ రాజయ్య గడ్డం రాజశేఖర్ రెడ్డి దొడ్ల రామిరెడ్డి, లక్ష్మమ్మ యాదవ్, తదికల రాజిరెడ్డి, రమేష్ యాదవ్, రవీందర్ రెడ్డి, యాదగిరి వడ్డెర, దాకూరి అక్కిరెడ్డి తదితరులున్నారు.



తుల్జాబాల భవాని ఆలయానికి కాలినడకన..



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని శ్రీ కనకదుర్గ దేవాలయం నుండి భక్తులు ఫతేనగర్ వాసులు కాలినడకతో శ్రీ తుల్జా భవాని అమ్మవారికి మొక్కు బడులతో కొంతమంది భక్తులు కాలినడకతో ప్రారంభించారు. వీరు మూడు నుండి నాలుగు రోజులు నడక ప్రయాణంతో అమ్మవారి దగ్గరికి చేరుకుంటారు. వీరికి అమ్మవారి ఆలయ అర్చకుడు దుర్బల కాశీనాథ్ శర్మ వారికి అమ్మవారి ఆశీస్సులు అందించినారు. ఇందులో భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొని వారిని అభినందించారు. అమ్మవారి అనుగ్రహంతో వారు క్షేమంగా వారి వారి గృహానికి రావాలని అమ్మవారిని కోరారు. ఈ కార్యక్రమంలో ఎర్రవల్లి అశోక్ చారి, గుమ్మడిదల విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు ఓట్ల శంకరాచారి పాల్గొన్నారు.

తండ్రి, కొడుకులపై కుక్కల దాడి



నవతెలంగాణ-దుండిగల్

బౌరంపేటలో తండ్రి కొడుకులపై వీధి కుక్కల దాడిచేయడంతో ప్రజలు కుక్కలు కనిపిస్తే చాలు భయ భ్రాంతులకు గురియవుతున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బౌరంపేట్‌లో ఆదివారం రాత్రి పనిమీద బయటకు వెళ్లిన కుమ్మరి మల్లయ్య, తన కుమారుడిని తీసుకొని ఇంటికి వస్తుండగా.. వీధి కుక్కలు వారిద్దరిపై దాడి చేశాయి. నెల రోజుల క్రితం ఇదే గ్రామంలో బాలుడిపై కుక్కల దాడి మరవకముందే మరో సారి వీధి కుక్కల స్వైర విహారం చేయటం పై స్థానికులు మండిపడుతున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే కుక్కల బెడద లేకుండా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

IN THE COURT OF THE HON'BLE VII JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURTS AT: HYDERABAD
O.S.No.2806 of 2019

Between:
Canara Bank, Afzalgunj Branch, Hyderabad
...Petitioner/Plaintiff
And
Smt M. Nagamani and another
...Respondent-1/Defendant-1

To
1.Smt M.Nagamani W/o M.Shiva, aged about 43yrs, Occ: Business, R/o H.No.11-13-528, Alakapuri, Yadav Nagar, Hyderabad- 500035. PH NO: 9642182778.

Take notice that the above named Plaintiffs have instituted the above suit against you for recovery of Rs.1,10,534/- together with costs and future interest. You are hereby summoned to appear before the Hon'ble Court in person **on the 30th October, 2024, at 10.30 am.** In default of your appearance on the day aforementioned, the suit will be heard and determined in your absence.

//By Order of the Court//
N.VENUGOPALARAO
ADVOCATE
1-2-234/2/1, PLOT NO.2/P, ROAD NO. 4, SRL COLONY, KOTHAPET, HYDERABAD
Cell: 98492 64568

IN THE COURT OF THE III JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS, AT: HYDERABAD.
O.S.NO.4676 OF 2018.

Between:
Soma Satyanarayana and others
...PLAINTIFFS.
Vs.
1.The Tahsildar, Nampally Mandal, Hyderabad District,
2.All Concerned.
...DEFENDANTS.

To,
All Concerned.

Please take Notice that the Plaintiffs filed the above suit to declare the Plaintiffs as the legal heir of deceased Soma Sumitra for their legal status. Any person/s having any claim or objections should appear before Hon'ble Court **on 4-11-2024 at 10-30 AM** sharp with all documentary evidence either in person or through counsel failing which the matter will be decided by the Hon'ble Court.

(BY ORDER OF THE COURT)
M.PENTA REDDY
Advocate.
Plot No.258, Prashanth Nagar Colony, Bandlaguda Jagir village, Rajendra Nagar Mandal, R.R.Dist
Ph: 98480 96495
COUNSEL FOR THE PLAINTIFF

SUMMON NOTICE
BEFORE THE HON'BLE DEPURTY REGISSTRAR OF CHITS/ ARBITRATOR NALGONDA DISTRICT AT NALGONDA
FILE No. A.A/CF/NO/MNL/NLG : 119 OF 2024

BETWEEN:
M/s. SHRIRAM CHITS (INDIA) PVT LTD, Miryalaguda Branch, Represented by its Jr.Manager (Legal), M.Nagi Reddy, S/o. M.Srinivasa Reddy, Age about 38years,R/o. NalgondaTown and District. ....DISPUTANT.
AND
1.Abbanapuri.Veenaja, W/o.Nagendra Chary,DoB: 08.10.1995,Occ:Bussines (Manwitha Fashions Kids Wear And Ladies Wear), R/o:H.No: 7-278/3, Road No:1, Chaithanya Nagar, Miryalaguda (Town&Mndl), Nalgonda (Dist.), Pin Code - 508207.
2.Malipeddi.Chiranjeevulu, S/o. Ramakistaiah, DoB: 10.04.1970, Occ: Warden Group-I/MatronGroup-I, (Emp Id: 1703453), O/o: Wrden/Matron, Govt. Home for VH Men, M.G. Nagar, Hyderabad (Dist.)., R/o: H No: 8-3-775,Flat No 404, Sai Srinivasa Residency, Yellareddygudda, Ameerpet, Khirathabad Hyderabad (Dist.), Pin Code - 500073.
3.Vallapudasu.Krupamma, W/o. Yohan, DoB: 06.10.1978, Occ: Secondary Grade Teacher, MPUPS Singaram, (Emp.Id: 1923749), O/o: Mandal Educational Officer, M.P. Munugode, Munugode (Mndl), Nalgonda (Dist.), R/o:H.No: 5-4-78/1, Church Compound Near Clock Tower, RP Road, Nalgonda (Town&Mndl), Nalgonda (Dist.).Pin Code - 508001.
4.Juttukonda.Venkateswarlu, S/o. Pichaiah,DoB: 14.05.1977, Occ: Secodary Grade Teacher, MPPS Metya Thanda, (Emp. Id: 1929458), O/o: Gazetted Head Master, ZPHS Tripuravaram Complex, Ananthagiri (Mndl), Suryapet (Dist.), R/o: H.No: 12-155/7/26/D, Sai Nagar, Behind Red Chill, Kodad (Town&Mndl), Suryapet (Dist.), Pin Code - 508206.
5.Abbanapuri.Nagendra Chary, S/o. Bikshamaiah,DoB: 10.08.1988, Occ: Development Executive Officer, Miryalaguda (Town&Mndl), Nalognda (Dist.) .O/o: Margadarsi Chit Fund Private Limited, Miryalaguda (Town&Mndl), Nalgonda (Dist.), R/o: H.No: 7-278/3, Road No.1, Chaithanya Nagar, Miryalaguda, (Town&Mndl), Nalgonda (Dist.).Pin Code - 508207.
....Defendants/Opponents/ Respondents.

Where as the above named Disputant has made an application for reference of the dispute with regard to non payment of subscription U/s 32 of Chit Fund Act 1982, and Demand for consolidated payment of future subscriptions with interest U/s 33 of Chit Fund Act, 1982, for the chit series MVLR.03Ticket No. 43hich was sanctioned bearing prior sanction order No.NG141020P158/2020and dated on:14.10.2020 to be examined under the provisions of Section 64 of Chit Funds Act 1982.

As on the date of filing disputed Claim is Rs. 9,60,134-00

You are hereby directed to appear before the Deputy Registrar of Chits/ Arbitrator, Nalgonda District Registrar Office Municipal Complex Nalgonda Town and District. In person duly on Dt. 30-10-2024At 11.00 A.M., in the show cause why the application should not be complied with that we may cause for to be done.

Please take notice that if no appearance is made on the above mentioned date and time and no counter is filed, the case will be disposed on its merits as exparte.

DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR NALGONDA DISTRICT. DISTRICT REGISTRAR OFFICE MUNCIPAL COMPLEX NALGONDA.

IN THE COURT OF THE HON'BLE CHAIRMAN OF THE MOTOR ACCIDENT CLAIM TRIBUNAL-CUM-VI ADDL.DISTRICT AND SESSIONS JUDGE-CUM-VI ADDL. MSJ RANGA REDDY DISTRICT :: AT: KUKATPALLY
M.V.O.P. NO.5 OF 2024

BETWEEN:
Smt.Duvvuri Bhargavi
...CLAIMANT
AND
Renuka Enterprises & 2 others
...RESPONDENTS

To
Renuka Enterprises, office at Flat No.404, Block-B, Plot No.286, 287, KVR Valley, Mallampet, Quthbulla pur, Malkajgiri, Medchal-Malkajgiri District, Telangana-500 090

You the above named Renuka Enterprises, is hereby informed Smt. Duvvuri Bhargavi, had filed the above petition for compensation under section 166 (1)(a) of the M.V. Act, 1988 and Rules 475/1b of T.S.M.V. Rules 1989 R/w section 140 (c) of the M.V. Act, 1988.

The above MVOP stands posted on 30-10-2024 for your appearance. You are hereby directed to appear in this court in person or by a pleader duly instructed **on the 30th day of October, 2024 at 10:30 O' clock** before the Hon'ble VI Addl. District and Sessions Judge, Ranga Reddy District at Kukatpally and submit your grievances.

// by order of the court //
M/s.G.SHANTI & ADVOCATES ASSOCIATES
DIAL : 98496 19000

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE : RANGA REDDY DISTRICT AT : HAYATHNAGAR
O.S.No of 2024

Between :
1. Animonie Yashoda W/o. late Animonie Balraj Aged about 47 years Occ: Housewife
2. Animonie Vinay S/o. late A,Balraj Aged about 29 years Occ: Pvt. Employee,
3. A.Alekhya D/o. Late A.Balraj Aged about 28 years Occ: Housewife
4. A.Akhila D/o, Late A.Balraj Aged about 26 years Occ: Housewife

All are R/o. H.No.5-6-581, Plot No.793/1, SKD Nagar, BN Reddy Nagar, Vanasthalipuram, Ranga Reddy District - 500070
.... Plaintiffs
And
1. Punjab National Bank Rep. by its Branch Manager, Dilsukhnagar Branch, 16-11-384, Ground Floor, Prashanth Complex, Dilsukhnagar, Hyderabad — 500066
2. Punjab National Bank Rep. by its Regional Manager, Circle Office, Regency Plaza, 1* Floor, Plot No.3, H.No.7-1-450/RP/3/1/A, Maithri Vihar Lane, Ameerpet, Hyderabad - 500016
3. All concerned .. Defendants

TO:
All concerned including above Defendants

The Hon'ble Court directed issuance of notices by way of publication to inform the defendants herein above that the above suit filed by the Plaintiffs for death declaration of Animonie Balraj & his Legal Heirs - is posted on 23/10/2024 and therefore anyone interested in the matter & having any objections for the reliefs prayed by the Plaintiffs, may appear before the Hon'ble Court at 10.30 AM on the above date - either personally or through their Counsel - to state their objections, if any. Please note that if you do not appear, the matter will be heard & decided in your absence.

K. Lakshminarayana, Advocate
Mob.No. 9301036047
(BY ORDERS OF THE COURT)

IN THE COURT OF THE HON'BLE PRL. SENIOR CIVIL JUDGE, RANGAREDDY DISTRICT AT L.B.NAGAR

	IN		
I.A.No.	**537**	**OF**	**2023**
	IN		
I.A.No.	**80**	**OF**	**2016**
	IN		
O.S.No.	**556**	**OF**	**1995**

BETWEEN:
U.Parvathalu (Died per L.Rs) and others
..Petitioners/Plaintiffs
AND
U.Pedda Sathaiah (Died per L.Rs) and others
..Respondents/Defendants

To,
1. Smt. A.Bharathamma D/o U.Peddasathaiah, Aged about 45 years, Occ: Housewife.
2. Battu Laxmaiah, S/o Ramulu, Aged about 38 years, Occ: Govt. employee.
3. Battu Sabitha alias Subhadra, D/o Ramulu, Aged about 39 years, Occ: Housewife.
4. Battu Nagamma, D/o Ramulu, Aged about 36 years, Occ: Housewife.
5. Battu Vanaja, D/o Ramulu, Aged about 35 years, Occ: Housewife.

Take notice that the above I.A.No 537 of 2023 is filed by the Petitioners/ Plaintiffs to implead the legal heirs of Late Samala Sheshikala who died on 05-02-2023 in and the same is posted on 08-11-2024. If any of above person or persons having any Objections or Claims they may appear before the above court on 08-11-2024 at 10:30 a.m. either in person or through an Advocate, failing which the matter will be decided basing on the documents available on record.

SCHEDULE OF THE PROPERTY
All that Agricultural lands bearing Sy.Nos. 32 to 40, 42 to 46 and 48 to 50 wet and dry, Situated at Balijeguda Village, Abdullapurmet Mandal, Rangareddy District, Under the Gram Panchayat of Balijeguda Village, Registration District, Rangareddy District, Sub-District Amberpet Kalan.

(BY ORDER OF THE COURT)
P.V.YADAGIRI SHARMA
ADVOCATE
Phone: 9010686000/9505686000
(COUNSEL FOR THE PETITIONERS/ PLAINTIFFS)

PASSPORT LOST
I, **EMANI PADMAVATHI, W/o.EMANI BHAVANI PRASAD** R/o.H.No:16-10-234/4/8, Opp:Sowbaghya Apartments, Municipal colony, Old Malakpet, Hyderabad-36 Telangana. Lost **My Passport Bearing No: E0105828** While shifting the house from Old Malakpet to Municipal colony.

IN THE COURT OF HON'BLE V JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS HYDERABAD, AT:HYDERABAD
O.S.No.3343 OF 2023

Between:
A.Narendar
...Plaintiff
And
A.Mallesh
...Defendant

To,
A.Mallesh, S/o.Late.Narasappa, Aged about 32yrs, Occ: Business, R/o.H.No. 4-26/2, Manikonda Grampanchayath, Hyderabad, T.S-500008.

NOTICE
Please take notice that the Plaintiff herein have filed the above O.S No. 3343 of 2023 for Suit for prefectural Injunction from restraining the defendant. You are hereby wanted to appear in this Court in person or any pleader duly instructed **on this 24 th Day of October 2024 at 10:30** in forenoon to show cause of this Original Suit, failing which the said Suit will be heard and determined ex-parte.

(BY ORDER OF COURT)
M/s.NIKADI VENKATESH SUNNAPU VIVEKANANDA ADVOCATES- HYDERABAD
OFFICE: Flat No.209, Lorven Complex, Chaitanyapuri, Dilsukhnagar, Hyderabad- 500060
Cell No. 9494405562
Counsel for the Plaintiff

IN THE COURT OF THE HON'BLE VII JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURTS AT: HYDERABAD
O.S.No.5378 of 2022

Between:
Canara Bank, Abids Branch, Hyderabad
...Petitioner/Plaintiff
And
Mr.Ibrahim Shaik
...Respondent/Defendant

To
Mr.Ibrahim Shaik S/o Bobjohn, aged about 52yrs, Represented by its Sole Proprietor M/s Razaan Enterprises, Occ:Business, R/o 6-2-106, Jammibanda Bazar, Khammam-507001.
PH NO: 9642794577.

Take notice that the above named Plaintiffs have instituted the above suit against you for recovery of Rs.2,95,577/- together with costs and future interest. appear before the Hon'ble You Court are hereby summoned to in person **on the 05th November, 2024, at 10.30 am.** In default of your appearance on the day aforementioned, the suit will be heard and determined in your absence.

//By Order of the Court//
N.VENUGOPALARAO
ADVOCATE
1-2-234/2/1, PLOT NO.2/P, ROAD NO. 4, SRL COLONY, KOTHAPET, HYDERABAD
Cell: 98492 64568

IN THE COURT OF THE HON'BLE II ADDL. SENIOR CIVIL JUDGE: R.R.DIST COURT AT: NTR NAGAR
E.P.No.65 OF 2014
IN
ABR/CF/No. 305 OF 2014

Between:
M/s.Margadarsi Chit Fund Pvt Ltd.
...Decree Holder
and
Mr.C.Alwal Reddy & Others
...Judgement Debtors

To
Mr.C.Alwal Reddy, S/o.C.Krishna Reddy, R/o.H.No.2-3-142, Adarsh Nagar, Road No.1, NagoleR.R.Dist
...J.D.No.01

TO WHOMSOEVER IT MAY BE CONCERN
In the above mentioned E.P., the below mentioned property is brought for Sale to realize the Decree Debt of Rs.12,26,230/-. Auction is going to be held on 30.10.2024 at Court premises at 10.30 A.M., Therefore, whoever is interested in purchasing the property can attend and participate in bid which is opened to one and all.

SCHEDULE OF PROPERTY BELONGING TO JDR.No.1 MR.C.ALWAL REDDY, REGISTERED VIDE DOCUMENT NO.5217/2006. DT.12.04.2006.
All that the Farm Site No.85, admeasuring 200 Sq.Yds., or 167. 36 Sq.Mtrs., in Survey No.258 and 259, in MILLINIUM MEADORS, situated at PEDDASHAPUR VILLAGE and Gram Panchayat, Shamshabad Mandal, R.R.District. Registration under the SRO-Shamshabad, R.R.District and which is bounded as follows:-
North: Farm Site No.84,
South: Farm Site No.86,
East::30'-0' Ft Wide Road
West: Farm Site No.82

The terms and conditions of the sale may be ascertained from the Bailiff of the said Court.

((BY ORDER OF THE COURT))
M.RAHUL & A.LAVAN KUMAR
#Flat No.405, B-Block, Mahalakshmi Estates. Nizampet Road. Kukatpally. Hyderabad

---

IN THE COURT OF THE HON'BLE II ADDL. DISTRICT JUDGE: R.R.DISTRICT AT: L.B.NAGAR
E.A.No.410 of 2022
In
E.P.NO.355 OF 2015
IN
O.P.1428 OF 2008

BETWEEN:
D.Raj Kumar and others
... Petitioners/Decree Holders
And
K.Balchander and another
... Respondents/Judgment Debtors

To,
1.Sri K.Balchander. S/o Sri K.Bakanna, aged about: Major, Occupation: Driver, R/o.7-89, Kollapur Mahabubnagar,
2.Sri R.LOKANATHAM. S/O R.RAJU, aged about: major, Occupation: Business, R/o.1-122 Guttala Begumpet, Madhapur, Ranga Reddy..
...J.D.No.1 and 2

Please take notice that the above petitioners/DHRs have filed the above application under section 5 of Limitation Act against you. The above application is stand posted to 22.10.2024 for your appearance. Therefore you are required to appear before the above mentioned Court **on 22.10.2024 at 10:30 A.M** in person or through your advocate, otherwise the matter will be decided in your absence.

//BY COURT ORDER//
Sd/-
L.Srinivas Rao, Advocate,
Office: 5-1-519, New Bhoiguda, Secunderabad - 500003,
Cell:9848996020.

IN THE COURT OF THE HON'BLE CHIEF JUDGE, CITY CIVIL COURT, AT: HYDERABAD.
MVOP.NO.2000 OF 2023

Between
Afroz Ahmed
...Petitioner
AND
Vinjari Shanker and others.
...Respondents.

To
(1)Vinjari Shanker, S/o.Vinjari Kishtaiah, Aged major, Occ: owner of car, R/o.H.No.3-73/1, Deshaipet Banswada, Kamareddy-503 187. Telangana. (Respondent No.1)
(2)V.Rushikesh, S/o.V.Shanker, Aged about 22 yrs, Occ: Driver, R/o.H.No.3-73/1, Deshaipet, Banswada, Kamareddy-503 187. Telangana (Respondent No.2)

Please take notice that the in MVOP. No. 2000 of 2023 on the file of the Hon'ble Chief Judge, City Civil Court, Hyderabad is filed by the petitioner against you for claiming compensation in a motor accident. The said matter is posted **on 28-10-2024 at 10-30 A.M.** for your appearance. You are hereby summoned to appear before the Hon'ble Chief Judge, City Civil Court at Hyderabad in person or through pleader on the above date. On your absence you will be set exparte and the matter will be decided against you.

// BY ORDER //
MOHAMMED ISMAIL
ADVOCATE
NO.13 II FLOOR, TWIN CITY COMPLEX, M.J.MARKET, HYDERABAD.
Mobile 9246157595

IN THE COURT OF THE HON'BLE IX ADDL DISTRICT JUDGE RANGA REDDY DISTRICT, AT: L.B.NAGAR
I.A.NO.286 OF: 2023
IN
O.S.NO:1197 OF: 2022

Between :
Naragudem Janabai & others
...Petitioners/Plaintiffs
And
Jonnada Ramulu & others
...Respondents/Defendants
And
Veluru Vijaya Raghava Choudary & others
...Respondents/Proposed defendants No.18 to 20

To,
R19.Veluri Vijaya Bhaskar Chowdary S/o.Late Narayana, Aged about: 44yrs, Occ: Business, R/o.H.No. 1-95/B/15/2/P, Petunia-2 Nectar Gardens, Madhapur, Sherilingampally Mandal, R.R.Dist.

Please take notice that the above said suit O.S.NO.1197 OF: 2022 has been filed for Partition & Separate Possession in respect of the suit schedule lands. In this present suit the petitioners/plaintiffs filed and I.A.No. 286 of 2023 under Order 1rule 10 for impleading you & 2 others as Proposed Respondents /defendants No. 18 to 20 as you are the necessary parties to the main suit, in the said I.A. you arrayed as Proposed Respondent / Defendant No.19. As per the order of Hon'ble Court Vide orders dated: 30-09-2024 in I.A.No.882/2024, I issuing a notice to you through this publication, and the said I.A.No. 286 Of: 2023 is posted on 30/10/2024 for your appearance. Therefore if you have any objections in this regard please appear before the Hon'ble IX Addl District Judge, R.R.District at L.B.Nagar on 30/10/2024 by 10.30 A.M., by person or through your counsel failing which the matter shall be decided in your absence basing on the merits of the case.

G.MADHAN MOHAN RAO
Advocate
R/o. H.No. 1-8-39, Vikas Nagar, Dilsukhnagar, Hyd-60.
Ph: 9490315995.

ఎమ్మెల్సీని కలిసిన యాదగిరి

నవతెలంగాణ - ధూల్ పేట్

శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సిరి కొండ మధుసూదనా చారి బాధ్యత లు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను గోషామహల్ నియోజక వర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ ఉద్యమ నాయకుడు, నియోజక వర్గం ఎస్సీసెల్ అధ్యక్షుడు జి. యాదగిరి కలిశారు.



నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

12

హైదరాబాద్

మంగళవారం | అక్టోబర్ 15, 2024 | www.navatelangana.com



చుడీ బజార్‌లోని డాక్టర్ అంబేద్కర్, డాక్టర్, లోహియా ఫంక్షన్ హాల్‌లో చూడి బజార్ మాదిగ బంధు మిత్ర సంఘం నాయకులు వెంకటేష్, అనిల్ కుమార్, క్రాంతి జుమార్, జనార్దన్, ప్రవీణ్ కుమార్ పృథ్వీరాజ్ సుమన్ కుమార్ అధ్వర్యంలో.. 5వ సంవత్సరం బతుకమ్మ, దాండియా వేడుకలు ఘనంగా నిర్వహించారు.

నవతెలంగాణ - ధూల్ పేట్

19న సుందరయ్య కళా నిలయంలో
పురస్కార ప్రదానోత్సవం



నవతెలంగాణ - ముషీరాబాద్

అరుణోదయ నాగన్నకు సుద్దాల అవార్డును ఈ నెల19న సుందరయ్య కళా నిలయంలో పురస్కార ప్రధాన ఉత్సవంలో అందజేస్తామని సుద్దాల ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుద్దాల అశోక్ తేజ అన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో బ్రోచర్ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి సుద్దాల అశోక్ తేజ హాజరై మాట్లాడుతూ.. సుద్దాల హనుమంతు జీవిత పర్యంతం పస్తులే ఆస్తిపాస్తులుగా నమ్మిన నిజమైన ప్రజాకవి అని తుది శ్వాస వరకు ఆఖరి పోరాటం ఆపని నిజాయితీ నిబద్ధత కలిగిన ఆదర్శనీయ ప్రజాకవి అని అన్నారు.

కళాకారుడుగా ఏ పాటకైనా పల్లవి శతఘ్నిలా ఉండాలని ప్రజా గీతానికి మార్గ నిర్దేశకుడిగా కడ ఊపిరి దాకా జీవించిన ప్రజాకవి సుద్దాల హనుమంతు జానకమ్మ జాతీయ పురస్కారం 2024వ అవార్డును అరుణోదయ నాగన్నకు ఈ సంవత్సరం ప్రకటిస్తున్నాం అని అన్నారు. నాగన్న 50 సంవత్సరాలుగా ప్రజాపాటలే ఉచ్ఛ్వాస నిశ్వాసగా రాజీపడని పాటకు వెయ్యేళ్ళని నమ్మిన పేదరికం పుట్టలా చుట్టుముట్టిన ప్రజా వాల్మీకిలా ప్రజ్వలిస్తున్న గాయక నాయకుడు అరుణోదయ నాగన్న 2024 సంవత్సరానికి సుద్దాల హనుమంతు జానకమ్మల జాతీయ పురస్కారాన్ని అందజేస్తున్నామని ఈ సందర్భంగా వారికి రూ.25 వేల నగదు బహుమతిని కూడా అందజేస్తామని అన్నారు.

అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జస్టిస్ బీమపాక నగేష్, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్, హైదరాబాద్ ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు, సభాధ్యక్షులుగా సుద్దాల అశోక్ తేజ, డాక్టర్ పోరెడ్డి రంగన్న ,ఆత్మీయ అతిథిగా శ్రీ యోచన, ప్రత్యేక సన్మానం అందం వెంకట్ రెడ్డి, బీసు బిక్షపతి పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, తెలంగాణ బాలోత్సవం కార్యదర్శి ఎస్ సోమయ్య, తెలంగాణ బాలోత్సవం ఉపాధ్యక్షురాలు కే సుజావతి జి.బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

16న మహాధర్నాను జయప్రదం చేయండి

- రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ బాలసుబ్రమణ్యం



నవతెలంగాణ - సుల్తాన్ బజార్

ఈ నెల 16 న హైదరాబాద్ డైరెక్టరేట్ ఎస్‌హెచ్ ఎం రాష్ట్ర కార్యాలయం ముందు మహాధర్నా నిర్వహించనున్న నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్ హెచ్ ఎం) కు చెందిన ఎస్‌హెచ్‌ఎం. అల్ క్యాడర్స్ ఉద్యోగులు పాల్గొంటున్నట్లు ఎస్‌హెచ్‌ఎం ఆల్ క్యాడర్స్ ఉద్యోగుల రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ బాలసుబ్రమణ్యం తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. ఎస్‌హెచ్‌ఎంఆల్ క్యాడర్స్ ఉద్యోగులకు క్యాడర్స్ బేసిక్ వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీ.ఓ. నెంబర్ 510 ప్రకారం 2018 నుంచి 2024 వరకు అల్ క్యాడర్స్ ఉద్యోగులకు వేతనాలు పెంచాలని, అనేక సంవత్సరాలుగా సేవలం దిస్తున్న ఆల్ క్యాడర్స్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. హెల్త్ కార్డ్స్ ఇవ్వాలని , ఉద్యోగితోపాటు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా మూలవేతనం చెల్లించాలని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖలో ఉన్న ఖాళీలలో ఎస్‌హెచ్‌ఎం ఉద్యోగులను క్యాడర్ వైస్‌గా విలీనం చేయా లని కోరారు. మహిళా ఉద్యో గులకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని ప్రభుత్వా నికి విజ్ఞప్తి చేశారు. ప్రతినెల 1వ తేదీన ఉద్యోగులకు వేతనాలు ప్రభుత్వం చెల్లించాలని పేర్కొన్నారు. సంవత్సరానికి ప్రతి ఒక్కరికి 35 క్యాజువల్ లీవ్స్ మంజూరు చేయాలని, ఎస్‌హెచ్‌ఎం ఉద్యోగి మరణించినట్లయితే వారి కుటుంబంలో ఒకరికి అర్హతను బట్టి ఉద్యోగం ఇవ్వాలని అన్నారు. పలు రాష్ట్రాలలో ఎస్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేశారు. రెగ్యులరైజేషన్ చేసిన రాష్ట్ర లు హర్యానా, మణిపూర్, హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్ర ఒడిస్సా చేశారు అని.. ప్రభుత్వానికి విన్నవించారు. అదే మాదిరిగా అల్ క్యాడర్ ఉద్యోగులను తెలంగాణ రాష్ట్రంలో అల్ క్యాడర్స్ ఉద్యోగులను క్రమబద్ధీకరించా లని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

డిగ్రీ కళాశాల బంద్‌పై
ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి



- పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోనగిరి మధు, పాడపగి నాగరాజు

నవతెలంగాణ - ముషీరాబాద్

డిగ్రీ కళాశాల బందుపై ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి అని.. విద్యాసంస్థల మధ్యలో విద్యార్థులను బలి చేయకండి అని పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోనగిరి మధు, పాడపగి నాగరాజు అన్నారు. సోమవారం విద్యానగర్‌లోని సీపీ భవన్‌లో పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బోనగిరి మధు అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోనగిరి మధు, పొడపంగి నాగరాజులు హాజరై మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఓయూ కేయూ యూనివర్సిటీల పరిధిలో ఉన్న డిగ్రీ కళాశాల యాజమాన్యాలు నిరవధికంగా కళాశాల బందుకు పిలుపునిచ్చాయి. ఈ బంధువలన మధ్యతరగతి విద్యార్థుల చదువు ఆగమయ్యే పరిస్థితి నెలకొంది. ఒకపక్క డిగ్రీ సెమిస్టర్ ఎగ్జామ్ ఫీజులు కట్టి ఎగ్జామ్స్ ప్రిపేర్ అవుతున్న వేళ డిగ్రీ కళాశాల బంద్ చేయడంతో విద్యార్థులందరూ విద్యకు దూరమై ఆగమయ్యే పరిస్థితి నెలకొంది అని తెలిపారు. గత నెల రోజుల నుండి విడుదల చేయాలని ప్రధాన డిమాండ్ తో డిగ్రీ కళాశాల యజమాన్యాలు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన ప్రభుత్వం పట్టించుకోకపోవడంతోనే నేడు వారు నిరోధిక సమ్మెకు దిగామంటూ యాజమాన్యాలు ప్రకటించాయి. కావున తక్షణమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ కళాశాల యాజమాన్యాలతో చర్చలు జరపాలి అని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థుల పక్షాన రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ ఉద్యమాలు చేపట్టుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పీడీఎస్‌యూ ఆవిర్భవించి 50 ఎండ్లు నిండిన సందర్భంగా అక్టోబర్ 24న ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో పీడీఎస్‌యూ రెండు సంస్థల ఆధ్వర్యంలో అర్ధ శతోత్సవ సభను నిర్వహిస్తున్నామని ఈ సభకు ప్రస్తుత పూర్వ పీడీఎస్‌యూ విద్యార్థులు మేధావులు, ప్రజాతంత్ర ,లౌకికవాదులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మంద నవీన్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు గుర్రం అజయ్, నరసింహారెడ్డి రాష్ట్ర కోశాధికారి మామిడాల మహేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తీగల శ్యామ్, మాదారపు నాగరాజు, సందీప్ పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు..

- అబిడ్స్ ట్రాఫిక్ ఎస్ఐ మహేష్ నాయుడు



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

లైసెన్స్ లేకుండా ద్విచక్ర వాహనం నడిపితే చట్టపరంగా ఖఠిన చర్యలు ఉంటాయని అబిడ్స్ ఎస్ఐ మహేష్ నాయుడు అన్నారు. అబిడ్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. వాహనంపై ట్రిపుల్ రైడింగ్ చేస్తే జరిమానా విధిస్తామన్నారు. అధిక పొల్యూషన్ వాహనాల పై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. వాహనదారులుహారన్ నిషేధించే ట్రాఫిక్ గుర్తు ఉన్న ప్రదేశంలో అనవసరంగా హారన్ మోగిస్తే చాలాన్ విధిస్తామన్నారు. ఫోర్ వీలర్ నడుపుతున్నప్పుడు సీట్ బెల్ట్ ధరించాలన్నారు.డ్రైవింగ్ లైసెన్స్‌ను లేనివారికి వాహనం ఇస్తే చట్టపరంగా చర్యలతో పాటు జైలు శిక్ష అనుభవిస్తారన్నారు. 14 ఏండ్లలోపు పిల్లలుకు వాహనాలు ఇవ్వవద్దన్నారు. పిల్లల వాహనాలు ఇస్తే వెహికల్ ఓనర్లు పై కేసు నమోదు చేసి చాలాన్ తోపాటు జైలు శిక్ష అనుభవిస్తారన్నారు. లైసెన్స్, నెంబర్ ప్లేట్ లేకుండా వాహనం నడిపితే మోటర్ వెహికల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. మోటార్ వెహికల్ నిబం ధనల ప్రకారం వాహన దారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. బుల్లెట్ వాహనాలకు సైలెన్సర్లతో వింత శబ్దాలతో తోటి వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తే వాహనాలను సీజ్ చేసి లైసెన్స్ రద్దు చేస్తామని వాహనదారులకు హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలన్నారు.

బడులకు..కొత్త టీచర్లు

- జిల్లాకు 584 మంది ఉపాధ్యాయుల రాక
- నేడు పోస్టింగ్..రేపు విధుల్లో చేరిక
- తీరనున్న ఉపాధ్యాయుల కోరత..!



నవతెలంగాణ-సిటీబ్యూరో

సర్కారు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరనుంది. రేపటి నుంచి కొత్త సార్లు ప్రభుత్వ బడులకు రానున్నారు. ప్రభుత్వం డీఎస్సీ-2024 ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 11,062 పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా జిల్లాకు నూతనంగా 584 మంది టీచర్లు రానున్నారు. ఇటీవలే సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్న టీచర్లకు నేడు కౌన్సిలింగ్ నిర్వహించి.. పోస్టింగ్స్ ఆర్డర్స్ ఇవ్వనున్నారు. బుధవారం మండల విద్యాధికారుల కార్యాలయాల్లో రిపోర్టింగ్ చేసి.. వెనువెంటనే తమకు కేటాయించిన పాఠశాల విధుల్లో చేరనున్నారు. దీంతో నూతన ఉపాధ్యాయుల రాకతో ప్రభుత్వ పాఠశాలల్లో బోధన కష్టాలకు చెక్‌పడనుంది.

జిల్లాలో మొత్తం 776 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, ఎయిడెడ్ పాఠశాలలున్నాయి. వీటిలో లక్షకుపైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కాగా ప్రధానోపాధ్యాయులు (గ్రేడ్-2), స్కూల్ అసిస్టెంట్స్, సెకండరీ గ్రేడ్ టీచర్లు మొత్తం 4600కుపైగా విధులు నిర్వర్తిస్తున్నారు. వాస్తవానికి జిల్లాకు సుమారు 6వేల మంది టీచర్లు అవసరం ఉంటుందని సమాచారం. గత కొంత కాలంగా ఉపాధ్యాయుల భర్తీ లేకపోవడం.. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్లు లేక.. దానికితోడు సబెక్టు టీచర్ల కొరత తీవ్రంగా వేధించింది. అయినప్పటికీ విద్యార్థుల చదువులకు ఎలాంటి ఆటంకం లేకుండా విద్యాశాఖ అధికారులు సర్దుబాటు ప్రయత్నాలు చేశారు. ముఖ్యంగా అదనంగా ఉపాధ్యాయుల ఉన్న పాఠశాలల నుంచి లేనిచోట సర్దుబాటు చేయడంతో పాటు మరికొన్ని చోట్ల ఎస్జీటీల సేవలు ఉపయోగించుకున్నారు. అయితే సంఖ్యకు సరిపడ టీచర్లు లేనికారణంగా సర్కారు బడుల్లో కొంతకాలంగా విద్యా ప్రమాణాలు మీద ప్రభావం పడుతోంది. ఈ పరిస్థితిని అధిగమించడానికి ప్రభుత్వం డీఎస్సీని ప్రకటించడంతో పాటు ఈ ఏడాది జూలై 18 నుంచి ఆగస్టు 5 వరకు ఆన్‌లైన్‌లో డీఎస్సీ పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. సెప్టెంబర్ 30న ఫలితాలు ప్రకటించింది. ఈ నెలలో మెరిట్ మార్కుల ఆధారంగా 1:3 పద్ధతిలో అభ్యర్థులను ఎంపిక చేసి సర్టిఫికెట్లు పరిశీలన.. వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తిచేశారు. ఎంపిక అయిన అభ్యర్థులకు ఈనెల 9న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. మొత్తంగా ఖాళీగా ఉన్న స్థానాల్లో 584 మంది కొత్త టీచర్లు వస్తుండటంతో సర్కారు బడుల్లో విద్యా బోధన మెరుగుపడే అవకాశం ఉందని ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల నేతలు అభిప్రాయపడుతున్నారు.

616లో.. 584 మందికే పోస్టింగ్ ఆర్డర్స్..!

వాస్తవానికి జిల్లాలో 878 ఉపాధ్యాయ పోస్టులకుగాను 262 పోస్టులకు సంబంధించి వివిధ కారణాలతో అభ్యర్థుల ఎంపిక పెండింగ్‌లో పెట్టారు. దీంట్లో ప్రధానంగా ఉర్దూ మీడియంలో రిజర్వేషన్ కేటగిరిలో అభ్యర్థులు లేకపోవడం, స్పెషల్ ఎడ్యూకేషన్ ఆఫీసర్లు, పీఈటీ పోస్టులకు సంబంధించి కోర్టు కేసుల కారణంగా జాబితా విడుదల చేయలేదు. వీరిని మినహాయించి.. మొత్తం 616 మంది అభ్యర్థులను తొలుత ఎంపిక చేశారు. కానీ సర్టిఫికేషన్ వెరిఫికేషన్‌లో తప్పుల వల్ల మరో 32 మంది అభ్యర్థుల పోస్టింగ్స్ ఆర్డర్స్ పెండింగ్‌లో పడ్డాయి. ప్రస్తుతానికి సదరు అభ్యర్థులను విద్యాశాఖ పక్కకు పెట్టి... మిగిలిన 584 అభ్యర్థులకు నేడు కౌన్సిలింగ్ నిర్వహించి పోస్టింగ్ ఆర్డర్స్ ఇచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసింది. వీరిలో ఎస్జీటీలు(384), స్కూల్ అసిస్టెంట్స్(107), లాంగ్వేజ్ పండితులు(91) ఉన్నారని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

పోస్టింగ్స్ కోసం నేడు కౌన్సిలింగ్..

అపాయింట్‌మెంట్ లెటర్స్ అందుకున్న అభ్యర్థులకు నేడు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్టు డీఈవో ఆర్. రోహిణీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అబిడ్స్ చాపెల్ రోడ్‌లో ఎస్ఎస్‌సీ బోర్డుకు ఎదురుగా ఉన్న స్టాన్లీ గర్ల్స్ హైస్కూల్‌లో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి పోస్టింగ్స్ కోసం కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని డీఈవో కోరారు. కౌన్సిలింగ్‌కు వచ్చే అభ్యర్థులు తమతో పాటు అపాయింట్‌మెంట్ ఆర్డర్‌తో పాటు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, హాల్ టికెట్లు తీసుకొని రావాలని, కౌన్సిలింగ్ హాల్‌లోకి అభ్యర్థులను మాత్రమే అనుమతిస్తామని డీఈవో చెప్పారు.

వారంలోగా మీసేవ దరఖాస్తులన్నీ
పరిష్కారం కావాలి



- మీసేవ ఆపరేటర్లతో ప్రతినెలా సమావేశం నిర్వహించాలి
- ప్రజావాణి, సీఎం ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి
- ప్రజావాణి కి 156 దరఖాస్తులు
- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

నవతెలంగాణ-సిటీబ్యూరో

మీసేవ ద్వారా వివిధ ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వాటన్నింటినీ వచ్చే సోమవారంలోగా పరిష్కారం చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తహసిల్దారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన 156 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అట్టి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి, సీఎం ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను పెండింగ్ లో లేకుండా సత్వరమే పరిష్కారం చేయాలని సూచించారు. మీసేవ ద్వారా వివిధ సర్టిఫికెట్స్ కోసం దరఖాస్తు చేసుకున్నవారి అర్జీలను ఏ మాత్రం పెండింగ్‌లో ఉంచకుండా వచ్చే సోమవారంలోగా అన్ని పరిష్కారం చేయాలని కలెక్టర్ సూచించారు. మీసేవ ఆపరేటర్లతో ప్రతి నెలా తహసీల్దార్లు సమావేశం ఏర్పాటు చేసి దిశా నిర్దేశం చేయాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో156 దరఖాస్తులు రాగా గృహ నిర్మాణ శాఖ కు 121, పెన్షన్లు 8, భూ సమస్యలకు సంబంధించినవి 4, ఇతరములు 23 వచ్చినవని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు కదిరవన్, ఈ వెంకటాచారి, ఆర్డీఓ మహిపాల్,దశరథ్ సింగ్, జిల్లా అధికారులు జి ఆశన్న, పెరిక యాదయ్య, ఆర్ కోటాజి, పవన్ కుమార్, డాక్టర్ సురేందర్, ఆర్.రోహిణి, ఇలియాజ్ అహ్మద్, షఫీమియా తదితరులు పాల్గొన్నారు.

ముజీబ్ ఆధ్వర్యంలో 'ఎంఎన్‌జే'లో అన్నదానం



నవతెలంగాణ-సిటీబ్యూరో

అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, టీఎన్జీవోస్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని(ముజీబ్) ఆధ్వర్యంలో సోమవారం మేహిది నవాబ్ జంగ్ క్యాన్సర్ ఆస్పత్రిలో 500 నిరుపేద రోగి సహాయకులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ కె.ఆర్.రాజ్ కుమార్, కేంద్ర సంఘం సభ్యులు బొలిగిద్ద శంకర్, ఉపాధ్యక్షులు కుర్రాడి శ్రీనివాస్, సభ్యులు వైదిక్ శాస్త్ర, ఈఎన్‌టీ రాజు, క్లాస్-4 సభ్యులు ఖాదర్ బిన్ హస్సన్, ముహమ్మద్ అతీక్, మిత్రులు జమాల్, ఉస్మాని అలీ ఉస్మాన్, రామకృష్ణ రెడ్డి, ఏపీఆర్వో ముహమ్మద్ వహీద్, ముస్తఫా షరీఫ్, హబీబ్ చావుష్, ఆస్పత్రి సభ్యులు శివ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ముజీబ్ మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగుల సహాయకులకు అన్నదానం చేయడం తనకు దేవుడిచ్చిన గొప్ప వరంగా భావిస్తున్నాని తెలిపారు. ఈ కార్యక్రమం నిర్విరామంగా కొనసాగుతుందని ఆయన వివరించారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటాం..



- ధర్మసేన ఫౌండేషన్ వ్యవస్థాపకులు తలారి దినకరన్ రెడ్డి
- మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో భేటీ

నవతెలంగాణ - ముషీరాబాద్

ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటామని ధర్మసేన ఫౌండేషన్ వ్యవస్థాపకులు తలారి దినకర్ అన్నారు. సోమవారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా దినకరన్ మాట్లాడుతూ ధర్మసేన ఫౌండేషన్ తరపున అనునిత్యం ప్రజా సమస్యలపై పోరాడుతూనే ఉన్నామని రాజకీయ కోణంలో కాకుండా మానవీయ కోణంలో సమస్యలపై స్పందించడం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గమనించి ప్రత్యేకంగా అభినందించారని తెలిపారు. ప్రస్తుత రాజకీయాలపై సుదీర్ఘంగా చర్చించామని తమ ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సేవలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని కేసీఆర్ తెలిపారు అన్నారు. ముఖ్యంగా ముషీరాబాద్‌లో కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజాసేవ చేయడంపై అభినందించి యువత రాజకీయాల్లోకి రావాలని వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు.

కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-అంబర్‌పేట

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్‌ని, దసరా పండుగను పురస్కరించుకొని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కలిశారు.



అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఏడుపాయల వన దుర్గమ్మను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణ గౌడ్, నాయకులు చందు పటేల్, శ్రీమన్ గిరి తోలుపునూరి నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-అంబర్‌పేట

నవతెలంగాణ మానవి
మంగళవారం 15 అక్టోబరు 2024
హైదరాబాద్ www.navatelangana.com

మొటిమలు వేధిస్తుంటే..?



మొటిమల సమస్యకు ఇంట్లోనే కొన్ని చిట్కాలతో చెక్ పెట్టొచ్చు. వాటిని ఎలా ప్రిపేర్ చేసుకోవాలో చూద్దాం..

ముల్తానీ మట్టి..

ముల్తానీ మట్టి డెడ్ స్కిన్ సెల్స్‌ని తొలగించడంలో హెల్ప్ చేస్తుంది. ఇందులోని ప్రత్యేక గుణాలు చర్మాన్ని మెరిపించేందుకు హెల్ప్ చేస్తుంది. ముఖంపై జిడ్డుని తొలగించేందుకు ముల్తానీ మట్టి చాలా మంచిది. దీని వల్ల చర్మ సమస్యలు, మొటిమలు దూరమవుతాయి.

విటమిన్ ఇ

విటమిన్ ఇ కూడా స్కిన్ అండ్ హెయిర్‌కి మంచిది. ఫ్రీ రాడికల్స్ నుండి చర్మాన్ని కాపాడుతుంది. ఇది డ్రై స్కిన్‌కి చాలా మంచిది. హైడ్రేషన్ అందిస్తుంది. మొటిమలను దూరం చేసి స్కిన్‌ని క్లియర్ చేస్తుంది.

అలోవెరా..

అలోవెరా చర్మ సమస్యల్ని దూరం చేస్తుంది. ఈ జెల్‌ని కూడా ముఖానికి రాసు కోవచ్చు. దీని వల్ల చర్మ సమస్యలు దూరమవు తాయి. ముఖంపై మొటిమలు, నల్ల మచ్చలు దూరం చేసి కాంతివంతంగా మారుస్తుంది.

రోజ్ వాటర్..

రోజ్ వాటర్ కూడా మంచి టోనర్‌లా పని చేస్తుంది చర్మాన్ని కాంతివంతంగా చేయడంతో పాటు చర్మంపై వృద్ధాప్య లక్షణాలను దూరం చేస్తుంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్ చర్మానికి మేలుచేస్తాయి. మొటిమలను తగ్గిస్తాయి.

అమ్మల సవాళ్లకు పరిష్కారంగా...





మొదటిసారి తల్లిదండ్రులైన జంటకు ఎన్నో అనుమానాలుంటాయి. ముఖ్యంగా బిడ్డకు ఇచ్చే ఆహారం గురించి. ఎందుకంటే పిల్లలకు పోషకాహారం అందించడం చాలా అవసరం. అలా అందించలేనపుడు ఆ బాధ వర్ణనాతీతం. తమ సందేహాలు తీర్చుకునేందుకు తల్లిదండ్రులు ఎంతో ప్రయత్నిస్తారు. అలా తాను మొదటి సారి తల్లి అయినపుడు సోనాల్ భరద్వాజ్ కూడా తన సమస్యకు పరిష్కారం కోసం ఎంతో వెదికింది. చివరకు తన లాంటి తల్లులకు మార్గనిర్దేశం చేసేందుకు వైరా కేర్‌ను ప్రారంభించింది. అలా తల్లి పాలివ్వడం, ఎదిగే పిల్లలకు ఘనపదార్థాలను పరిచయం చేయడం, పిల్లల పోషకాహారం వంటి విషయాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఆమె పరిచయం...

కోవిడ్-19 మహమ్మారి సమయంలో ఒత్తిడితో కూడిన జీవితంలోనే సోనాల్ 2020లో నెదర్లాండ్స్‌లో ఓ బిడ్డకు జన్మనిచ్చింది. అయితే జీవితంలో ఇంత కీలకమైన సమయంలో కరోనా వల్ల తల్లిదండ్రులు ఆమెతో ఉండలేకపోయారు. చాలా మంది కొత్త తల్లిదండ్రుల మాదిరిగానే ఆమెకు చాలా ప్రశ్నలు ఉన్నాయి. శిశువైద్యులు ఆమెకు ఎంతో మద్దతు ఇచ్చారు. చనుబాలివ్వడం గురించి తెలుసుకునేందుకు సంబంధిత నిపుణుల వద్దకు పంపారు. వారు ఆహారం ఇచ్చే విషయంలో ఆమెకు మార్గనిర్దేశం చేశారు. అక్కడ ఉన్నన్ని రోజులు శిశువు పెరుగుదల, అభివృద్ధిని పర్యవేక్షించడంలో సహాయం చేశారు.

అడ్డంకులు అధిగమించేందుకు

భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత తన స్నేహితులు, కుటుంబం, సహచరుల సహకారంతో బిడ్డకు ఇచ్చే ఆహారం గురించి మరింత తెలుసుకోవచ్చని ఆమె భావించింది. కానీ ఆమెకు ఆశించినంత ఫలితం దక్కలేదు. స్నేహితులు కూడా ఆమె మాదిరిగానే గందరగోళానికి గురయ్యారు. శిశు పోషణ, ఆహారం అందించడం, తల్లి పోషకాహార అవసరాల గురించి వారికి కూడా ఎన్నో ప్రశ్నలు ఉన్నాయి. ఇదంతా గమనించిన సోనాల్ తనలాంటి కొత్త తల్లిదండ్రులకు తమ పిల్లల ఆరోగ్యం, పోషకాహారానికి సంబంధించిన అడ్డంకులను అధిగమించడానికి అవసరమైన సహకారం అందించాలనుకుంది. దీని కోసమే 2023లో వైరా కేర్‌ను ప్రారంభించింది. చండీగఢ్‌కు చెందిన ఈ ప్లాట్‌ఫారమ్ తల్లిపాలు, బాటిల్ ఫీడింగ్, శిశువులకు నిజమైన ఆహారాన్ని పరిచయం చేయడం, పోషకాహార నిర్వహణ వంటి సవాళ్లపై తల్లిదండ్రుల కోసం ఆన్‌లైన్ కోర్సులను అందిస్తుంది.

ధరలు ఇలా...

వైరా కేర్ పిల్లల పోషకాహారం గురించి రెండు ప్రోగ్రామ్‌లను అందిస్తుంది. అవి ఒకరితో ఒకరు సంప్రదింపులు, ప్రత్యక్ష కోర్సులు. ప్రోగ్రామ్ మూడు నెలలు ఉంటుంది. తల్లిదండ్రులు నిపుణులతో ఒకరితో ఒకరు సెషన్‌లను కలిగి ఉంటారు. తల్లిపాలు ఇవ్వడం, ఘనపదార్థాలను పరిచయం చేయడం, శిశువు పోషణపై మార్గదర్శకత్వం పొందుతారు. లైవ్ సెషన్‌ల తర్వాత పాఠాలు రికార్డ్ చేసి అందుబాటులో ఉంటాయి. ఇక్కడ తల్లిదండ్రులు నేరుగా నిపుణులతో సంభాషించవచ్చు. ప్రతి కోర్సు సాధారణంగా ఐదు మాడ్యూళ్లను కలిగి ఉంటుంది. వన్-ఆన్-వన్ ప్రోగ్రామ్ ధర రూ.15,000 నుండి రూ.18,000. అయితే లైవ్ కోర్సులు రూ. 3,500కి అందుబాటులో ఉన్నాయి. ఐదుగురు నిపుణుల బృందంతో వైరా కేర్ భారతదేశంతో పాటు యుఎస్‌లోని 500 కుటుంబాలకు పైగా సహాయం చేసింది. స్టార్టప్ జనవరి 2024లో ప్రీ-సీడ్ రౌండ్‌లో 1,00,000 డాలర్లు సేకరించింది. ఆసుపత్రులు, గైనకాలజిస్టులు, పిల్లల వైద్య నిపుణులతో కలిసి బి2బి సెగ్మెంట్‌ను ప్రారంభించాలని ఆమె యోచిస్తుంది. తద్వారా స్టార్టప్ మరింత మంది తల్లిదండ్రులను చేరుకోగలదు.



నిర్ణయం కఠినమైనదే...

మంచి జీతం వచ్చే కార్పొరేట్ ఉద్యోగాన్ని వదిలివేయడం సోనాల్‌కు అంత తేలికైన నిర్ణయం కాదు. అదనంగా చిన్న పిల్లవాడిని, స్టార్టప్‌ను నిర్వహించడం ఆమెకు మరొక సవాలు. 'నా అభిరుచి కోసం స్థిరమైన ఉద్యోగంలోని సౌకర్యాలను వదులుకోవలసి వచ్చింది. నేను తీసుకున్న నిర్ణయం ఎంతో కఠినమైనది. సవాళ్లు ఉన్నప్పటికీ, నా వ్యవస్థాపక ప్రయాణం ఒక గొప్ప అభ్యాస అనుభవంగా ఉంది. నా భర్త కూడా ఎంతో మద్దతునిచ్చాడు. తరచుగా నాతో అర్ధరాత్రులు పని చేస్తూ ఇవన్నీ సాధ్యమయ్యేలా చేశాడు' అని ఆమె అంటుంది.

పోషకాహారం పిల్లల హక్కు

లింగ పరంగా వివక్షను ఏమైనా ఎదుర్కొన్నారా అంటే 'నా విషయంలో స్త్రీగా ఉండటం సహాయపడుతుంది. నేనూ ఓ తల్లిని కాబట్టి ఇతర తల్లిదండ్రులతో మెరుగ్గా కనెక్ట్ అవ్వగలిగాను. ప్రతి తల్లీబిడ్డకు సాధ్యమైనంత ఉత్తమమైన ప్రారంభాన్ని అందించాలని మేము లక్ష్యంగా పెట్టుకున్నాం. ఎందుకంటే సరైన పోషకాహారం పిల్లల హక్కు' అని ఆమె జతచేస్తోంది.

వైద్య రంగంలో అనుభవం...

'ఆహారంతో ఆరోగ్యకరమైన సంబంధాన్ని పెంపొందించుకుంటూ వారి పిల్లలకు సరైన పోషణను అందించడంలో తల్లులకు మద్దతు ఇవ్వడం మా లక్ష్యం' అని ఆమె పంచుకుంటుంది. బయోమెడికల్ ఇంజినీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ చేసిన సోనాల్ గతంలో ఫోర్టిస్, మాక్స్ ఆసుపత్రులతో కలిసి పనిచేసింది. అక్కడ ఆమె కృత్రిమ అవయవాలు, శరీర భాగాల మార్పిడి, రోగనిర్ధారణ యంత్రాలను అందిస్తూ వైద్యులకు సహాయం చేసింది. బయోమెడికల్ పరికరాలకు సాంకేతిక సహాయాన్ని కూడా అందించింది. 2013లో గ్రెనోబుల్ ఎకోల్ డి మేనేజ్‌మెంట్ ఫ్రాన్స్ నుండి అంతర్జాతీయ వ్యాపారంలో మాస్టర్స్ డిగ్రీ కూడా పూర్తి చేసింది. తర్వాత కార్పొరేట్ రంగానికి వెళ్లింది. వైరా కేర్‌ను ప్రారంభించే ముందు లీడర్స్ బయోమెడికల్ అనే మెడికల్ పరికరాల కంపెనీలో ప్రాడక్ట్ మేనేజర్‌గా పనిచేసింది. అలాగే ఈమె సర్టిఫైడ్ శిశు, పీడియాట్రిక్ ఫీడింగ్ స్పెషలిస్ట్ కూడా. 'హెల్త్‌కేర్ స్పేస్‌లో విస్తృతమైన అనుభవం నాకు మంచి నెట్‌వర్క్‌ను, ఫీల్డ్‌పై లోతైన అవగాహనను ఇచ్చింది' అని ఆమె చెప్పింది.

అర్థశాస్త్రంలో ముగ్గురికి నోబెల్

స్టాక్‌హోం: అర్థశాస్త్రంలో ప్రతిష్టాత్మక నోబెల్ పురస్కారాన్ని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రకటించింది. 2024 సంవత్సరానికి గాను ముగ్గురికి దీనిని అందించనుంది. దేశాల మధ్య సంపదలో అసమానతలపై పరిశోధనలకుగానూ డారెన్ ఏస్‌మోగ్లు, సైమన్ జాన్సన్, జేమ్స్ ఎ. రాబిన్‌సన్ ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు.వైద్యవిభాగంతో మొదలైన నోబెల్ పురస్కారాల ప్రకటన సోమవారంతో ముగిసింది. గత సోమవారం వైద్యశాస్త్రంలో విజేతలను ప్రకటించగా.. తర్వాత వరుసగా భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, సాహిత్యం విభాగాల్లో పురస్కారాలను ప్రకటించారు. శుక్రవారం రోజున నోబెల్ శాంతి బహుమతి పై ప్రకటన చేయగా.. తాజాగా అర్థశాస్త్రంలో ముగ్గురు ఆర్థికవేత్తల పేర్లను వెల్లడించారు. డారెన్, సిమోన్.. అమెరికాలో కేంబ్రిడ్జ్‌లోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందినవారు కాగా.. షికాగో యూనివర్సిటీలో రాబిన్‌సన్ పరిశోధనలు చేస్తున్నారు. స్వీడన్‌కు చెందిన శాస్త్రవేత్త, ఇంజినీర్, వ్యాపారవేత్త ఆల్‌ఫ్రెడ్ నోబెల్ పేరు మీదుగా ప్రపంచంలో వివిధ రంగాల్లో విశేష సేవలందించిన వారికి ఈ అవార్డును ప్రదానం చేస్తోన్న సంగతి తెలిసిందే. 1896లో ఆల్‌ఫ్రెడ్ నోబెల్ మరణించగా.. 1901 నుంచి ఆయన ట్రస్ట్ ద్వారా ఈ అవార్డులను ఏటా ప్రదానం చేస్తున్నారు. అవార్డు గ్రహీతలకు 11 మిలియన్ల స్వీడిష్ క్రోనర్ నగదు అందుతుంది. డిసెంబర్ 10న నిర్వహించే కార్యక్రమంలో గ్రహీతలకు అవార్డులను అందజేస్తారు.

ప్రయివేటు ఉద్యోగాల్లో వికలాంగుల రిజర్వేషన్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రయివేటు ఉద్యోగాలులో వికలాంగులకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నట్టు మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనుసూయ సీతక్క తెలిపారు. సోమవారం సచివాలయంలో తెలంగాణ వికలాంగుల జాబ్ పోర్టల్ ను ఆమె ఆవిష్కరించారు. మహిళా సంక్షేమ శాఖ డైరెక్టరెట్ హెల్ప్‌లైన్‌లో పదిమందికి నియామక ఉత్తర్వులు అందజేశారు. వికలాంగులు ఆన్ లైన్ జాబ్ పోర్టల్ లో రిజిస్టర్ చేసుకుంటే వారి అర్హతను బట్టి ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. సంక్షేమ నిధుల్లో వికలాంగులకు ఐదు శాతం నిధులు కేటాయిస్తున్నట్టు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల వంటి సంక్షేమ పథకాల్లో రిజర్వేషన్లు పాటిస్తామని చెప్పారు. వికలాంగుల పరికరాల కోసం ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.50 కోట్లు వెచ్చిస్తున్నట్టు తెలిపారు. బ్యాక్ లాగ్ పోస్టులను త్వరలో భర్తీ చేయనున్నామనీ, ఆ ప్రక్రియను మొదలు పెట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల కార్పొరేషన్ చైర్మెన్ ముత్తినేని వీరయ్య, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ తదితరులు పాల్గొన్నారు.

ద్రవ్యోల్బణం కోరలు

36 శాతం ఎగిసిన కూరగాయలు

న్యూఢిల్లీ : దేశంలో ద్రవ్యోల్బణం మళ్లీ కోరలు చాస్తోంది. ఈ ఏడాదిలో ఎప్పుడూ లేని విధంగా సెప్టెంబర్‌లో వినియోగదారుల ద్రవ్యోల్బణం సూచీ (సీపీఐ) అత్యధికంగా 5.49 శాతానికి ఎగిసిందని నేషనల్ స్టాటిస్టిక్స్ ఆఫీసు (ఎన్ఎస్ఓ) వెల్లడించింది. ఆగస్టులో 3.65 శాతంగా నమోదయ్యింది. ఇంతక్రితం చివరి సారిగా 2023 డిసెంబర్‌లో అత్యధికంగా 5.69 శాతంగా చోటు చేసుకుంది. ముఖ్యంగా ఆహారోత్పత్తులు ధరలు తీవ్ర ఆందోళనకర స్థాయిలో పెరిగాయి. గడిచిన సెప్టెంబర్‌లో ఆహారోత్పత్తుల ద్రవ్యోల్బణం సూచీ ఏకంగా 9.2 శాతానికి ఎగిసింది. ఇది ఆగస్టులో 5.66 శాతంగా ఉంది. ముఖ్యంగా పండ్లు ధరలు 7.65 శాతం, కూరగాయలు 35.99 శాతం, తృణధాన్యాలు 6.84 శాతం, గుడ్లు 6.31 శాతం, మాంసం, చేపలు 2.66 శాతం చొప్పున పెరిగాయి. దేశంలో హెచ్చు ద్రవ్యోల్బణం భయాల నేపథ్యంలో ఆర్‌బీఐ దాదాపు రెండేండ్లుగా వడ్డీ రేట్లను తగ్గించడం లేదు.

సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంలో విగ్రహం ధ్వంసం

నవతెలంగాణ-బేగంపేట్



సికింద్రాబాద్‌లోని కుమ్మరిగూడ ముత్యాలమ్మ ఆలయంలో సోమవారం తెల్లవారు జామున విగ్రహాన్నిఓ దుండగుడు ధ్వంసం చేశాడు. స్థానికులు వెంటనే గమనించి అతన్ని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే.. సికింద్రాబాద్‌లోని పాస్‌పోర్ట్ కార్యాలయం సమీపంలో ముత్యాలమ్మ ఆలయం ఉంది. సోమవారం తెల్లవారు జామున 4.30 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి గుడి తలుపులను కాలితో తన్ని తాళం పగులగొట్టి లోపలికి వెళ్లాడు. గర్భగుడి తాళం కూడా పగులగొట్టి విగ్రహాన్ని అక్కడి నుంచి తీసి ధ్వంసం చేశాడు. ఆ తర్వాత గుడిపైకి ఎక్కి అమ్మవారి మాలను తీసేసి.. పైన విగ్రహాన్ని పగులగొట్టేందుకు యత్నించాడు. వెంటనే స్థానిక వ్యక్తి గుర్తించి నిందితున్ని పట్టుకున్నాడు. చుట్టు పక్కల వారు అక్కడికి చేరుకుని నిందితుడికి దేహశుద్ధి చేశారు. సమాచారం అందుకున్న మోండా మార్కెట్ పోలీసులు అక్కడికి రాగా.. నిందితున్ని అప్పగించారు. నిందితుడు ముంబయికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. అతన్ని చికిత్స నిమిత్తం పోలీసులు గాంధీ ఆస్పత్రికి తరలించి అక్కడి నుంచి నిమ్స్‌కు తరలించారు. నిందితుడు మాట్లాడే పరిస్థితి లేకపోవడంతో నగరానికి ఎందుకు వచ్చాడు.. ఎక్కడ ఉంటున్నాడు అనేది వివరాలు తెలియరాలేదు.

ఆలయం వద్ద ఆందోళన

బీజేపీ కార్పొరేటర్లు, మరికొందరు నేతలు, కొన్ని మత సంస్థల కార్యకర్తలు దేవాలయం ముందు బైటాయించారు. అప్రమత్తమైన పోలీసులు.. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఘటనాస్థలిలో పెద్ద సంఖ్యలో మోహరించారు. మధ్యాహ్నం సమయంలో పోలీసులు ఆందోళనకారులను అరెస్టు చేసి బొల్లారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఆలయాన్ని సందర్శించిన ప్రజాప్రతినిధులు

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే శ్రీగణేష్, బీఆర్ఎస్ నాయకులు నివేదిత, బీజేపీ నాయకులు మర్రి పురురవరెడ్డి తదితరులు ఆలయాన్ని సందర్శించారు. నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అదనపు కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఉత్తర మండలం డీసీపీ రష్మీ పెరుమాళ్, టాస్క్‌ఫోర్స్ డీసీపీలు సుధీంద్ర, శ్రీనివాసులు ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే ఉండి పరిస్థితిని సమీక్షించారు.

నగరంలో అశాంతికి కుట్రలు
కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

నగరంలో అశాంతిని సృష్టించేందుకు కొన్ని మతోన్మాదశక్తులు కుట్రలు పన్నుతున్నా యని, దీన్ని అడ్డుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆలయాన్ని సందర్శించిన అనంతరం ఆయన ఈ ఘటనను ఖండించారు. పండుగ లు జరుపుకునే సమయంలో డీజేలు పెడితే పోలీసులు కేసులు పెట్టి, రాత్రి 11 గంటలకు దాటితే సౌండ్ సిస్టం బంద్ చేయిస్తూ ఇబ్బందులు పెడుతున్నారన్నారు.

మరి ఇలాంటి ఘటనలు జరిగితే ఎందుకు కఠిన చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. దీని వెనుక ఉన్న శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎంను కోరతానన్నారు. దేవాలయాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి భద్రత పెంచాలని, దర్యాప్తు పారదర్శకంగా చేపట్టాలని సూచించారు.

కఠినంగా శిక్షించాలి : ఎమ్మెల్యే తలసాని

మత విద్వేషాలు రెచ్చగొట్టే వారు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆలయాన్ని సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రశాంతంగా ఉండే సికింద్రాబాద్ ప్రాంతంలో ఇలాంటి ఘటనలతో అలజడులు, మత ఘర్షణలకు దారితీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. భక్తిశ్రద్ధలతో బతుకమ్మ, దుర్గామాత పూజలు, నవరాత్రులు ఎంతో నిర్వహించుకున్నామని, ఇంతలోనే ఇలాంటి ఘటన జరగడం బాధాకరమన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు.

చాలా దురదృష్టకరం : ఎమ్మెల్యే శ్రీ గణేష్

వ్యక్తిగతంగా అమ్మవారి భక్తుడిగా తనకు ఇది చాలా బాధాకరమైన ఘటన అని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. ప్రభుత్వం సీరియస్‌గా విచారణ చేపట్టి దోషులను శిక్షిస్తుందన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గించేందుకు కొంత మంది ఇలాంటివి చేయాలని ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. అమ్మవారి విగ్రహం పున్ణప్రతిష్టను తన సొంత నిధులు వెచ్చించి చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ప్రభుత్వం ఏం చేస్తుంది : మాధవీలత

హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతుంటే ప్రభుత్వం ఏమి చేస్తుందని బీజేపీ నాయకురాలు మాధవిలత ప్రశ్నించారు. అమ్మవారి విగ్రహాన్ని నిందితుడు ధ్వంసం చేసి హిందువుల గుండెల మీద కొట్టాడని.. నిందితున్ని ఇక్కడికి తెచ్చి కొరడా దెబ్బలు కొట్టాలని ఆమె డిమాండ్ చేశారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి : సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ

ముత్యాలమ్మ గుడిలో అమ్మవారి విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులలో ఒకరిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారని, ఈ సంఘటనలో మరో ఇద్దరు వ్యక్తులు ఉన్నారన్న అనుమానాలున్నాయని అన్నారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వ యంత్రాంగం మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ ఘటనను ఆసరా చేసుకుని శాంతి భద్రతల సమస్యలు సృష్టించడం, విద్వేషాలు పెంచే ప్రయత్నాలు చేస్తున్న శక్తులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

తలాతోక లేని పాలన

(మొదటిపేజీ తరువాయి)



చూపారని అన్నారు. సోమవారం వరంగల్ జిల్లా ధర్మారంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. పదేండ్లుగా తాము ఎలా పని చేశామో, అదేవిధంగా రానున్న నాలుగున్నర సంవత్సరాలు అంకితభావంతో అలాగే పనిచేస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తానని ప్రగల్భాలు పలికి ఇంతవరకు పనులే ప్రారంభించలేదు కానీ, హైడ్రా పేరుతో పేదల ఇండ్లు కూలుస్తున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, రేవంత్ రెడ్డి.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేస్తారన్న నమ్మకంతో ప్రజలు ఓట్లు వేశారని, కానీ తక్కువ సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని కోల్పోయిందని అన్నారు. తెలంగాణలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన టెక్స్‌టైల్ పార్కును గత, ప్రస్తుత పాలకుల నిర్లక్ష్యంతో 'ఎక్కడ వేసిన గొంగడి అక్కడే' అనే విధంగా ఉందన్నారు. మూసీ సుందరీకరణ కోసం రూ.1.50 లక్షల కోట్లతో ప్రణాళిక లేకుండానే పనులు చేస్తూ గందరగోళం సృష్టిస్తున్నారని ఆరోపించారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ఆలయాల అభివృద్ధికి మోడీ సర్కార్ ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఈ సమావేశంలో వరంగల్, హన్మకొండ జిల్లాల అధ్యక్షులు గంట రవికుమార్, రావు పద్మ, మాజీ ఎంపీ సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్యేలు ఆరూరి రమేష్, కొండేటి శ్రీధర్, ధర్మారావు, నాయకులు ఎడ్ల అశోక్ రెడ్డి, చందుపట్ల కీర్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీవోపీటీ ఉత్తర్వులు రద్దు చేయండి

- క్యాట్‌లో ఐఏఎస్‌ల పిటిషన్లు
- నేడు విచారణ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదారాబాద్

కేంద్ర సిబ్బంది, శిక్షణా శాఖ(డీవోపీటీ) ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ఐఏఎస్‌లు కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ విభాగం(క్యాట్)ను ఆశ్రయించారు. పునర్విభజన చట్టం ప్రకారం కేటాయించిన రాష్ట్రాల్లో రిపోర్టు చేయాలంటూ ఇటీవల డీవోపీటీ కార్యదర్శి ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో వేర్వేరుగా ఐఏఎస్‌లు పిటిషన్లు దాఖలు చేశారు. డీవోపీటీ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరిన వారిలో తెలంగాణకు చెందిన ఐఏఎస్‌లు వాకాటి కారుణ, వాణి ప్రసాద్, ఆమ్రపాలి, ఏపీకి చెందిన సృజన ఉన్నారు. తెలంగాణలో కొనసాగేలా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని వాకాటి కరుణ, వాణిప్రసాద్, ఆమ్రపాలి సోమవారం దాఖలు చేసిన పిటిషన్ ద్వారా కోరగా, అలాగే ఏపీలోనే కొనసాగించాలంటూ కోరుతూ సృజన విజ్ఞప్తి చేశారు. వీరి పిటిషన్లపై క్యాట్ మంగళవారం విచారణ చేపట్టనుంది. ఏపీకి కేటాయించి తెలంగాణలో విధులు నిర్వర్తిస్తున్న ఐఏఎస్ అధికారులు వాణి ప్రసాద్, వాకాటి కరుణ, రొనాల్డ్‌రోస్, ఆమ్రపాలి, ప్రశాంతి, ఐపీఎస్ అధికారులు అంజనీ కుమార్, అభిలాష బిస్త్, అభిషేక్ మహంతి ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు రావాల్సిన వారిలో ఐఏఎస్ అధికారులు సృజన, శివశంకర్, హరికిరణ్ ఉన్న విషయం విదితమే. ఏపీ నుంచి తెలంగాణకు పంపాలని దరఖాస్తు పెట్టుకున్న ఎస్ఎస్ రావత్, అనంతరాము పిటిషన్లను గతంలోనే డీవోపీటీ తిరస్కరించింది. వీరిద్దరూ ఏపీలోనే కొనసాగనున్నారు. ఇదిలావుండగా గతంలో క్యాట్ ఆదేశాల మేరకే ఇటు తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్‌లో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఇరు రాష్ట్రాల్లో పనిచేస్తున్నారు. తాజాగా డీవోపీటీ ఇచ్చిన ఉత్తర్వుల నేపథ్యంలో మరోసారి వీరంతా క్యాట్‌ను ఆశ్రయించడం గమనార్హం.

బీసీ కమిషన్ పర్యవేక్షణలో కులగణన

24న పది జిల్లాల్లో బహిరంగ విచారణ

త్వరలో బీసీ మేధావులతో భేటీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీసీ కమిషన్ పర్యవేక్షణలో కులగణన చేపట్టనున్నట్టు ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తెలిపారు. ఈ నెల 9న రాష్ట్ర ప్రభుత్వం బీసీ కమిషన్‌కు టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ మార్గదర్శకాలు నిర్దేశిస్తూ జారీ చేసిన ఉత్తర్వులకు అనుగుణంగా తదుపరి కార్యాచరణపై బీసీ కమిషన్ సోమవారం హైదరాబాద్‌లో సమావేశమైంది.దీనికి ఆహ్వానితులుగా హాజరైన ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా మాట్లాడుతూ కుల గణన చేపట్టడానికి చేస్తున్న సన్నాహాలను కమిషన్‌కు వివరించారు. ఇరువురు సమన్వయంతో బీసీ కమిషన్ పర్యవేక్షణలో కులగణన కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు బీసీ కమిషన్ స్థానిక సంస్థలలో వెనుకబడిన తరగతులకు కల్పించాల్సిన రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయించాల్సి ఉందని తెలిపారు. ఈ అధ్యయనంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి పాత పది జిల్లా కేంద్రాల్లో బహిరంగ విచారణ నిర్వహించాలని కమిషన్ నిర్ణయించింది. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 24 నుంచి ప్రారంభించాలని సూచించింది. నోటిఫికేషన్‌ను కమిషన్ జారీ చేయనుంది. అన్నీ తరగతుల అభిప్రాయాలను తెలుసుకోవాలనీ, మేధావులతో త్వరలోనే సమావేశమై సంప్రదింపులు జరపాలని కమిషన్ నిర్ణయం తీసుకుంది.

సమాఖ్య సూత్రాలకు దెబ్బ

(మొదటిపేజీ తరువాయి)

ప్రతినిధుల స్థానంలో నామినేటెడ్ సభ్యులు, నామినేటెడ్ చైర్మన్‌ను నియమించటం ద్వారా ప్రజాస్వామ్య విలువలకు ముప్పు కలిగిస్తుందని ఆయన తెలిపారు. విశ్వాస స్వేచ్ఛ, లౌకికవాదం, ఫెడరలిజం, ప్రజాస్వామ్య సూత్రాలతో సహా ప్రాథమిక హక్కులపై రాజీ పడకూడదని మంత్రి ఉద్ఘాటించారు. రాజ్యాంగ పునాదికే విరుద్ధమైన నిబంధనలు ఈ బిల్లులో ఉన్నాయనీ, కేంద్రం దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ తీర్మానానికి ప్రతిపక్ష కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) మద్దతు లభించింది. ఇది తీర్మానానికి అనేక సవరణలను ప్రతిపాదించింది. వాటిలో కొన్ని చర్చల సమయంలో ఆమోదించబడ్డాయి.


ఉద్యోగాలు హుష్

మోడీ సర్కార్ విధానాలతో ఆర్థిక వ్యవస్థ పతనం

రెండెంకెల సంఖ్యకు దూరంగా పారిశ్రామికాభివృద్ధి రేటు

దారుణంగా పడిపోయిన కార్మికుల సంఖ్య

- లక్ష్యాలకు మేకిన్ ఇండియా దూరం
- ఆర్థిక నిపుణులు, విశ్లేషకుల ఆందోళన



న్యూఢిల్లీ : మోడీ సర్కారు ఎంతో గొప్పగా చెప్పుకునే 'మేకిన్ ఇండియా' కార్యక్రమం ఒక విఫల ప్రయోగంగా కనిపిస్తున్నది. దేశ ఆర్థిక వ్యవస్థను నిలబెట్టటంలో ఇది అంతగా దోహదం చేయలేదని ఆర్థిక నిపుణులు, విశ్లేషకులు అంటున్నారు. ముఖ్యంగా, పారిశ్రామిక రంగంలో తగిన వృద్ధి కనబడలేదనీ, మోడీ సర్కారు విధానాలతో వేలాది ఉద్యోగాలు కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన మేకిన్ ఇండియా కార్యక్రమం గత నెలలో పదో వార్షికోత్సవాన్ని జరుపుకున్నది. ఈ సందర్భంగా విడుదల చేసిన డేటాను దేశ, విదేశ విశ్లేషకులు, నిపుణులు తప్పుపడుతున్నారు. దేశంలోని పరిశ్రమ గతంలో కంటే చైనాపై ఎక్కువగా ఆధారపడిందని వారు చెప్తున్నారు. వాస్తవానికి 2014లో 'మేకిన్ ఇండియా'తో నాలుగు లక్ష్యాలను సాధించటమే మోడీ లక్ష్యంగా పెట్టుకున్నది. భారతీయ పరిశ్రమ వృద్ధి రేటును సంవత్సరానికి 12-14 శాతానికి పెంచటం, 2022 నాటికి 10 కోట్ల పారిశ్రామిక ఉద్యోగాలను సృష్టించటం, 2022 నాటికి తయారీ రంగం వాటాను జీడీపీలో 25 శాతానికి పెంచటం (కొన్ని సంవత్సరాల తర్వాత గడువు 2025కి మార్చబడింది). భారత్‌ను ప్రపంచానికి 'ఫ్యాక్టరీ'గా మార్చటం వంటివి ఇందులో ఉన్నాయి. ఆ విధంగా చైనాను అధిగమించాలనేది లక్ష్యం.

ఈ ప్రాజెక్ట్‌లో భారతీయ పరిశ్రమలోని 25కి పైగా రంగాలు పాలుపంచుకున్నాయి. అయితే, పదేండ్లు గడిచినా ఈ లక్ష్యాలు చేరకపోవటమే కాకుండా పరిస్థితి మరింత దిగజారిపోయిందని విశ్లేషకులు అంటున్నారు. పరిశ్రమ వృద్ధి రేటు రెండంకెల సంఖ్యకు దూరంగా ఉన్నదని చెప్తున్నారు. 2014 నుంచి ఇది సగటున నాలుగు శాతంగా ఉన్నది. తయారీ ఈ స్థాయి కంటే తక్కువగా ఉన్నదని అంటున్నారు. భారత జీడీపీలో తయారీ రంగం వాటా పెరగడం సంగతి అటుంచి దేశ జీడీపీలో తయారీ రంగం వాటా పడిపోతూనే ఉంది.

కోవిడ్ సంక్షోభం అనంతరం రెండేండ్ల తర్వాత ఇది 2022-23లో 14.70 శాతానికి పడిపోయింది. 1968-69 తర్వాత ఇది కనిష్టమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. మోడీ సర్కారు అంచనా వేసిన 10 కోట్ల ఉద్యోగాలను సృష్టించ లేకపోగా పరిశ్రమ చాలా ఉద్యోగాలను కోల్పోయిందని చెప్తున్నారు. అలాగే, తయారీ కార్మికుల సంఖ్య 2017లో 5.13 కోట్ల నుంచి 2022-23లో 3.56 కోట్లకు పడిపోయిందని కొన్ని గణాంకాలను వారు ఉటంకిస్తున్నారు. ఇది కోవిడ్-19 సంక్షోభంతో పాక్షికంగా ముడిపడి ఉన్నది. 2021లో తయారీ కార్మికుల సంఖ్య మూడు కోట్ల కంటే తక్కువకు తగ్గుతున్నదని నిపుణులు చెప్తున్నారు. 2016-17 నుంచి 2022-23 మధ్య.. తయారీ రంగం దాదాపు 10 లక్షల మంది కార్మికులను కోల్పోయిందని అంటున్నారు.

ఈ వైఫల్యం పాక్షికంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) కారణంగానేనని విశ్లేషకులు చెప్తున్నారు. మోడీ సర్కారు చైనా అభివృద్ధి వ్యూహాన్ని ప్రతిబింబించేలా తగినంత ఎఫ్‌డీఐని ఆకర్షించాలనీ, భారతదేశంలో తక్కువ జీతాలున్న కార్మిక వ్యయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రపంచంలోని ఇతర దేశాలకు తయారీ స్థావరంగా మారాలని వారు సూచిస్తున్నారు. వాస్తవానికి 2014లో ఎఫ్‌డీఐ సంవత్సరానికి 3600 కోట్ల డాలర్ల నుంచి 2022 నాటికి దాదాపు 8500 కోట్ల డాలర్లకు పెరిగింది. అయితే ఇది పలు కోణాల నుంచి పరిశీలించాలని అంటున్నారు.

మొదటిది.. ఈ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిలో అతి తక్కువ భాగమే ఉత్పాదకరంగంలోకి వచ్చేది. రెండవది.. మన దేశం జీడీపీలో గత దశాబ్దం కంటే ఈ ఎఫ్‌డీఐ కేవలం 1.76 శాతం మాత్రమే . మూడవది.. 2022 తర్వాత విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డీఐ) చెప్పుకోదగ్గ స్థాయిలో పడిపోతోంది.



2023-24లో 2007 స్థాయికి పడిపోయింది. మొత్తం దేశ జీడీపీలో 0.7 శాతానికి పడిపోవడం స్వతంత్ర భారత చరిత్రలో అతి తక్కువ. చివరిగా ఈ దశాబ్దకాలంలో తయారీ రంగ ఎగుమతులు ఘోరంగా పడిపోయినాయి. మన పరిశ్రమలు ఎగుమతి చేయడంలో విఫలమవడంతో నిజానికి చైనా నుండి దిగుమతులు పెరుగుతున్నాయి.

నిలిచిపోయిన పారిశ్రామిక పెట్టుబడులు

ఉత్పాదక పెట్టుబడి రేటు (గ్రాస్ క్యాపిటల్ ఫార్మేషన్).. 1990లు, 2000లలో గణనీయంగా పెరిగిన తర్వాత.. నిర్మాణాత్మకంగా బలహీనపడ్డాయి. ఇది 2007లో దాదాపు 42 శాతం నుంచి 2020లో 29 శాతానికి పడిపోయింది. 2023 నాటికి ఇది 34 శాతానికి పెరిగింది. కానీ ఇది ఇప్పటికీ ఉన్నదానికి దూరంగా ఉన్నదని కొన్ని గణాంకాలను ఉటంకిస్తూ విశ్లేషకులు చెప్తున్నారు. ఇక ప్రయివేటు పెట్టుబడి రేటు 2011లో 31 శాతం నుంచి 2020లో 23 శాతానికి పడిపోయింది. ధనిక భారతదేశం పారిశ్రామికవేత్తలను పెట్టుబడి పెట్టాలని ఒప్పించేందుకు తగినంత భారీ, స్థిరమైన మార్కెట్‌ను అందించదని నిపుణులు, విశ్లేషకులు అంటున్నారు. పొదుపు రేటు పతనంలో భారతీయ వినియోగదారుల తక్కువ కొనుగోలు శక్తిని కలిగి ఉన్నారు. ఇది 2024లో దేశ జీడీపీలో 5.3 శాతంగా ఉన్నది. ఇది 1970ల తర్వాత కనిష్ట స్థాయి. అదే సమయంలో, కుటుంబాలు మరింత రుణాన్ని తీసుకుంటున్నాయి. 2023లో తీసుకున్న రుణాలు దేశ జీడీపీలో 5.8 శాతంగా ఉన్నాయి.

భారత ఆర్థిక వ్యవస్థ పతాకస్థాయిలలో ఒకటైన ఫార్మాస్యూటికల్ రంగంలో కూడా ఇదే సమస్య ఉన్నదని విశ్లేషకులు, నిపుణులు చెప్తున్నారు. మేకిన్ ఇండియా కార్యక్రమం ప్రారంభించిన పదేండ్ల తర్వాత.. భారతదేశ పరిశ్రమ సమస్య తీవ్రమైంది. ఈ ఎదురుదెబ్బ దేశ సార్వభౌమాధికారానికి ముప్పు కలిగించటమే కాకుండా, సరైన పారిశ్రామికీకరణ ప్రక్రియ లేకుండా దేశం ఒక కోటి మంది యువతీ, యువకులకు ఏ పనిని ఇచ్చే పరిస్థితిలో ఉండదని నిపుణులు, విశ్లేషకులు చెప్తున్నారు.

విజయం కోసం ఒక్క రోజులో 400 పరుగులు అవసరమైతే బ్యాటర్లు అందుకు సిద్ధంగా ఉండాలి. ప్రతికూల పరిస్థితుల్లో డ్రా కోసం రెండు రోజుల పాటు బ్యాటింగ్ చేయాల్సి వస్తే.. బ్యాటింగ్ లైనప్ అందుకూ సంసిద్ధంగా ఉండాలి. ఒకే శైలిలో ఆడితే ఆటలో ఎప్పటికీ ఎదగలేము. భిన్న పరిస్థితులకు తగినట్టు విభిన్న శైలిలో రాణిస్తేనే ఎదిగేందుకు అవకాశమని భారత చీఫ్ కోచ్ గౌతం గంభీర్ అన్నాడు. న్యూజిలాండ్‌తో తొలి టెస్టు ముంగిట బెంగళూర్‌లో గంభీర్ మీడియాతో మాట్లాడాడు.

అలా ఉంటే ఎదగలేం!

ఏ పరిస్థితుల్లోనైనా ఆడటమే కీలకం
భారత చీఫ్ కోచ్ గౌతం గంభీర్



నవతెలంగాణ-బెంగళూర్

అడాప్టబిలిటీ ప్రధానం : టెస్టు క్రికెట్ గతంలో మాదిరిగా లేదు. అందుకు తగినట్టు భారత క్రికెట్ సైతం వేగంగా ముందుకు సాగాలి. పరుగుల వేటలో బ్యాటర్లు బౌండరీ బాదే అవకాశాల కోసం ఎక్కువగా చూస్తున్నారు. అయినా, ప్రస్తుత టెస్టు క్రికెట్‌లో అడాప్టబిలిటీ అత్యంత ప్రధానం. ఒక్క రోజులో 400 పరుగులు చేయగల, డ్రా కోసం రెండు రోజుల పాటు బ్యాటింగ్ చేయగల జట్టుగా నిలవాలనేది మా లక్ష్యం. దానిని మీరు ఎదుగుదల, అడాప్టబిలిటీ, టెస్టు క్రికెట్ అని ఏమైనా అనవచ్చు. నా వరకు ఒకే ధోరణిలో ఆడితే ఎప్పటికీ ఎదుగుదల ఉండదు. ప్రపంచ క్రికెట్, ఇతర జట్ల గురించి నేను మాట్లాడలేను. ప్రతి జట్టుకు ఓ ప్రత్యేక దృక్పథం ఉంటుంది. టెస్టు క్రికెట్‌లో ప్రత్యేక ప్రణాళికలు ఉంటాయి. అందుకే నేను నా జట్టు గురించి మాత్రమే మాట్లాడగలను. ఏ పరిస్థితుల్లోనై సవాల్‌ను స్వీకరించి భారత్‌ను విజయపథాన నడిపించే ఆటగాళ్లు మా డ్రెస్సింగ్‌రూమ్‌లో ఉన్నారు.

మా మద్దతు ఉంటుంది : హై రిస్క్-హై రివార్డ్ అప్రోచ్‌పై మాకు ఓ స్పష్టత ఉంది. ఆటగాళ్లు సహజశైలిలో విధ్వంసక శైలిలో ఆడాలని కోరుకుంటున్నాం. సహజశైలిలో ఆడి 400-500 పరుగులు ఓ రోజులో చేయగలిగితే అదే దారిలో నడుస్తాం. హై రిస్క్- హై రివార్డ్‌లో హై రిస్క్-హై ఫెయిల్యూర్ ప్రతికూలతలు తెలుసు. దూకుడు ఆడితే ఓ సమయంలో 100 పరుగులకే కుప్పకూలే ప్రమాదం ఉంటుంది.అయినా, వెనక్కి తగ్గం. ఆటగాళ్లకు పూర్తిగా మద్దతుగా నిలుస్తాం. టెస్టు క్రికెట్‌లోనూ ఈ దేశ అభిమానులను ఎంటర్‌టైన్ చేయటమే మా లక్ష్యం. ఎటువంటి పరిస్థితుల్లోనే ఫలితం కోసం ప్రయత్నించటమే మా ప్రణాళిక.

ప్రత్యర్థిని గౌరవిస్తాం : న్యూజిలాండ్ పూర్తిగా భిన్నమైన జట్టు, భారత్‌కు భిన్నమైన సవాల్. కివీస్ ఎంతో మంచి జట్టు. ఆ జట్టులో ప్రపంచ శ్రేణి ఆటగాళ్లు ఉన్నారు. మన జట్టును ఇరకాటంలో పడేయగల క్రికెటర్లు ఆ శిబిరంలో ఉన్నారు. కివీస్ ఎప్పుడూ పోరాడేందుకు చూస్తుంది, మేం కూడా ఆ జట్టును అదే అంచనా వేస్తున్నాం. ప్రత్యర్థిని గౌరవిస్తాం కానీ ఎవరికీ భయపడం. ప్రతి జట్టునూ గౌరవిస్తాం. అది కివీస్ కావచ్చు, ఆస్ట్రేలియా కావచ్చు.. అందరినీ ఒకేలా గౌరవిస్తాం.

ఫోకస్ ఈ సిరీస్‌పైనే : ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ 2025 జూన్‌లో షెడ్యూల్ చేశారు. ఆస్ట్రేలియాతో టెస్టు మ్యాచ్ నవంబర్ 22న ఆరంభం కానుంది. కానీ ఇప్పుడు టీమ్ ఇండియా ఫోకస్ న్యూజిలాండ్‌తో సిరీస్‌పైనే. అంతర్జాతీయ క్రికెట్‌లో అతిగా ఆలోచన చేయలేం. ఇప్పుడు మా ముందున్న సవాల్ న్యూజిలాండ్. అక్టోబర్ 16న ఉదయం 9.30 గంటలకు కివీస్ కోసం ఏ విధంగా సిద్ధం అవ్వాలనేది మా ఆలోచన. ఏ మ్యాచ్‌లో ఆడినా, ఏ సిరీస్‌లో తలపడినా మా లక్ష్యం గెలుపే.

ఓటమితో మొదలు!

గుజరాత్ చేతిలో హైదరాబాద్ చిత్తు 126 పరుగుల తేడాతో పరాజయం



నవతెలంగాణ-హైదరాబాద్ : రంజీ ట్రోఫీ వేటను హైదరాబాద్ ఓటమితో మొదలెట్టింది. సికింద్రాబాద్‌లోని జింఖాన గ్రౌండ్స్‌లో జరిగిన రంజీ ట్రోఫీ తొలి రౌండ్ మ్యాచ్‌లో గుజరాత్ చేతిలో హైదరాబాద్ 126 పరుగులతో పరాజయం పాలైంది. 297 పరుగుల ఛేదనలో హైదరాబాద్ చేతులెత్తేసింది. 59.1 ఓవర్లలో 170 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ అభిరాత్ రెడ్డి (51, 59 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) అర్థ సెంచరీతో మెరిసినా.. ఇతర బ్యాటర్లు తేలిపోయారు. తన్మయ్ అగర్వాల్ (1), రాహుల్ సింగ్ (0) విఫలమయ్యారు. రోహిత్ రాయుడు (26), హిమతేజ (29), రాహుల్ రాదేశ్ (17), సివి మిలింద్ (28) మంచి ఆరంభాలను సద్వినియోగం చేసుకోలేదు. గుజరాత్ బౌలర్లలో రింకేశ్ (3/52), జడేజా (3/23) మూడేసి వికెట్లు పడగొట్టగా. సిద్దార్థ్ దేశాయ్ (2/47), అర్జాన్ (2/28)లు రెండేసి వికెట్లు ఖాతాలో వేసుకున్నారు. గుజరాత్ తొలి ఇన్నింగ్స్‌లో 343 పరుగులు చేయగా, రెండో ఇన్నింగ్స్‌లో 201 పరుగులు చేసింది. హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 248 పరుగులకే ఆలౌటైంది. రంజీ ట్రోఫీ రెండో రౌండ్‌లో డెహ్రాడూన్‌లో ఉత్తరఖాండ్‌తో హైదరాబాద్ తలపడనుంది.

ములుగులో స్పోర్ట్స్ స్కూల్


స్థలాన్ని పరిశీలించిన శాట్ చైర్మన్



హైదరాబాద్ : మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు.. ఆదివాసీ, గిరిజనులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు ములుగు జిల్లాలో స్పోర్ట్స్ స్కూల్‌ను ఏర్పాటు చేయనున్నట్టు తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (శాట్) కే. శివసేనా రెడ్డి తెలిపారు. సీఎం కప్ టార్చ్ రిలే కార్యక్రమంలో పాల్గొనేందుకు ములుగు వెళ్లిన శివసేనా రెడ్డి.. మంత్రి సీతక్క సూచన మేరకు జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర్, జిల్లా ఉన్నతాధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ములుగు స్పోర్ట్స్ స్కూల్‌లో స్విమ్మింగ్, ఆర్చరీ, జిమ్నాస్టిక్స్, అథ్లెటిక్స్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని శివసేనా రెడ్డి వెల్లడించారు.

నవచిత్రం

సర్‌ప్రైజ్ చేసే ఫస్ట్ సాంగ్..



పవన్‌కళ్యాణ్

పవన్ కళ్యాణ్ తొలిసారిగా 'హరి హర వీర మల్లు పార్ట్-1 స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' అనే పీరియాడికల్ యాక్షన్ సినిమాలో నటిస్తున్నారు.

దసరా శుభ సందర్భంగా నిర్మాతలు ఓ స్పెషల్ అప్‌డేట్‌ని ప్రకటిం చారు. త్వరలోనే ఈ సినిమా నుంచి మొదటి గీతం విడుదల కానుంది. పవన్ కళ్యాణ్ అభిమానులతో పాటు, తెలుగు సినీ ప్రియులు ఆనందపడే మరో విషయం ఏంటంటే తెలుగులో ఈ పాటను స్వయంగా పవన్ పాడారు. ఈ గీతాన్ని ఇతర భాషలలో ఇతర గాయకులు పాడారు.

దసరా సందర్భాన్ని పురస్కరించుకుని నిర్మాతలు విడుదల చేసిన ఆసక్తికరమైన పోస్టర్‌లో పవన్ కళ్యాణ్ తన ప్రత్యర్థులపై శక్తి త్రిశూలాన్ని ప్రయోగించినట్లుగా మూడు బాణాలను గురిపెట్టారు. ఈనెల 14 నుంచి మళ్లీ చిత్రీకరణ మొదలవుతుందని, నవంబర్ 10 నాటికి మొత్తం చిత్రీకరణ పూర్తి అవుతుందని నిర్మాతలు తెలిపారు. సామ్రాజ్యవాదులు, అణచివేతదారులకు వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం ఒక యోధుని అలుపెరగని పోరాటమే ఈ సినిమా అని నిర్మాతలు వెల్లడించారు. బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తుండగా, నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తోంది. పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్‌ని అంచనాలను దృష్టిలో ఉంచుకుని యువ దర్శకుడు జ్యోతి కృష్ణ ఈ భారీ యాక్షన్ ఎపిక్‌ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు.

నవంబర్‌లో నయా సినిమా



రామ్

రామ్ పోతినేని హీరోగా అగ్ర నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించనున్న చిత్రానికి రంగం సిద్ధమైంది. తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో అగ్ర హీరోలతో పాన్ ఇండియా స్థాయిలో సినిమాలు నిర్మిస్తున్న 'మైత్రి' సంస్థ రామ్ పోతినేనితో ఫస్ట్ ఎటెంప్ట్‌గా ఓ ఇంట్రస్టింగ్ ప్రాజెక్ట్ చేస్తోంది. నవీన్ పోలిశెట్టితో 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' సినిమా డైరెక్ట్ చేసి, ఘన విజయం అందుకున్న దర్శకుడు మహేష్‌బాబు దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందనుంది. విజయ దశమి సందర్భంగా ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. హీరోగా రామ్ పోతినేనికి ఇది 22వ చిత్రం. నవంబర్ నుంచి చిత్రీకరణ మొదలుపెడతామని, రామ్ పోతినేనితో సినిమా చేయడం చాలా ఆనందంగా ఉందని, హై ఎనర్జీతో న్యూ ఏజ్ స్టోరీ టెల్లింగ్‌తో ఈ చిత్రం ఉంటుందని నిర్మాతలు నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ తెలిపారు. కథానాయిక, ఇతర తారాగణం, సాంకేతిక బృందం వివరాలు త్వరలోనే ప్రకటించనున్నారు.

నాగ బంధం మొదలైంది



'డెవిల్: ది బ్రిటిష్ సీక్రెట్ ఏజెంట్'తో నిర్మాత అభిషేక్ నామా దర్శకుడిగా తనకంటూ ఓ ప్రత్యేకతను సొంతం చేసుకున్నారు. తాజాగా ఆయన 'నాగబంధం- ది సీక్రెట్ ట్రెజర్' ప్రాజెక్ట్‌ని అనౌన్స్ చేశారు. దీనికి ఆయన కథ, స్క్రీన్ ప్లే కూడా అందిస్తున్నారు.

అభిషేక్ పిక్చర్స్‌తో కలిసి ఎన్ఐకె స్టూడియోస్ ప్రొడక్షన్ నెం. 1గా కిషోర్ అన్నపురెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. తారక్ సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి లక్ష్మీ ఐరా, దేవాన్ష్ నామా సమర్పిస్తున్నారు.

'పెదకాపు' ఫేమ్ విరాట్ కర్ణ లీడ్ రోల్ పోషిస్తున్నారు. నభా నటేష్, ఐశ్వర్య మీనన్ ఫిమేల్ లీడ్స్‌గా, జగపతి బాబు, జయప్రకాష్, మురళీ శర్మ, బి.ఎస్.అవినాష్ ముఖ్యమైన పాత్రల్లో కనిపించనున్నారు.

భారీ అంచనాలున్న ఈ చిత్రం సోమవారం చిత్ర బృందంతోపాటు ప్రత్యేక అతిథుల సమక్షంలో ఘనంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా విచ్చేసిన చిరంజీవి ముహూర్తం షాట్‌కి క్లాప్ కొట్టారు. తలసాని శ్రీనివాస్ యాదవ్ కెమెరా స్విచాన్ చేయగా, తొలి షాట్‌కి అజయ్ భూపతి దర్శకత్వం వహించారు. ఆసియన్ సునీల్ స్క్రిప్ట్‌ని మేకర్స్‌కి అందజేశారు.

డివైన్, అడ్వెంచర్ ఎలిమెంట్స్‌తో ఓ పవర్ ఫుల్ స్క్రిప్ట్‌ను అభిషేక్ నామా రాశారు. తిరువనంతపురంలోని పద్మనాభస్వామి ఆలయంలో నిధి, పూరీ జగన్నాథ ఆలయంలో రత్న భండార్‌ను తెరిచిన తర్వాత గుప్త నిధుల అంశం దేశంలో హాట్ టాపిక్‌గా మారింది.

భారతదేశంలోని 108 విష్ణు దేవాలయాలు నాగబంధం ద్వారా రక్షించబడుతున్నాయి. సినిమా కథ భారతదేశంలోని 108 విష్ణు దేవాలయాలకు సంబంధించిన నాగబంధం చుట్టూ తిరుగుతుంది. మెస్మరైజ్ చేసే ఇంట్రో వీడియో ప్రేక్షకులను కట్టిపడేసింది. పాన్ ఇండియా మూవీగా దీన్ని వచ్చే ఏడాది తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళంలో విడుదల చేయనున్నారు. ఈ నెల 23న రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తామని మేకర్స్ అనౌన్స్ చేశారు.

దీపావళికి రిలీజ్




తన్వీ రామ్, కిరణ్ అబ్బవరం

హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న భారీ పీరియాడిక్ థ్రిల్లర్ 'క'. ఈ సినిమాలో నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. చింతా వరలక్ష్మి సమర్పణలో శ్రీ చక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ పై చింతా గోపాలకృష్ణ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శక ద్వయం సుజీత్, సందీప్ ఈ సినిమాను రూపొంది స్తున్నారు. ఈ సినిమా దీపావళి పండుగ సందర్భంగా ఈ నెల 31న తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది.

ఈ సినిమాను తెలుగులో ప్రొడ్యూసర్ వంశీ నందిపాటి, మలయాళంలో హీరో దుల్కర్ సల్మాన్ తన వేఫరర్ ఫిలింస్ పై రిలీజ్ చేయబోతున్నారు. ఈనేపథ్యంలో సోమవారం మీడియాతో హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ, 'దీపావళి పండుగ సందర్భంగా చాలా సినిమాలు రిలీజ్‌కు వస్తున్నాయి. థియేటర్స్ దగ్గర పోటీ ఉంది. మేము ఈ నెల 31న రిలీజ్ చేయడానికి కారణం మా వంశీ నందిపాటి. అలాగే మా అందరికీ ఈ సినిమాపై సినిమాపై నమ్మకం ఉంది. ఏదో కొత్త కంటెంట్ మూవీలో ఉండబోతోంది అనే వైబ్ క్రియేట్ అయ్యింది' అని తెలిపారు.

'యూనిక్ పాయింట్‌తో కథ చేశాం. అలాగే కథను సరికొత్త స్క్రీన్ ప్లేతో ప్రెజెంట్ చేశాం' అని దర్శక ద్వయం సుజీత్, సందీప్ చెప్పారు. ప్రొడ్యూసర్, డిస్ట్రిబ్యూటర్ వంశీ నందిపాటి మాట్లాడుతూ, 'మూవీ కంటెంట్ మీద పూర్తి నమ్మకం ఉంది. తప్పకుండా ఈ సినిమా ప్రేక్షకాదరణ పొందుతుంది' అని తెలిపారు.

సరికొత్త మిస్టరీ థ్రిల్లర్



మనోజ్ పల్లేటి, సమర్థ్ గొల్లపూడి

రామ్ కార్తీక్, కశ్వి హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'వీక్షణం'. ఈ చిత్రాన్ని పద్మనాభ సినీ ఆర్ట్స్ బ్యానర్‌పై పి. పద్మనాభ రెడ్డి, అశోక్ రెడ్డి నిర్మిస్తున్నారు. మనోజ్ పల్లేటి దర్శకుడు. ఈ సినిమా ఈ నెల 18న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది.

ఈ సందర్భంగా సోమవారం దర్శకుడు మనోజ్ పల్లేటి మాట్లాడుతూ, 'ఈ ప్రపంచంలో అత్యంత కష్టమైన పని ఏంటంటే మన పని మనం చూసుకోవడం ఇదే ఈ సినిమా లైన్‌కు మూలం. కామెడీ మిస్టరీ థ్రిల్లర్ తరహాలో ఈ సినిమా సాగుతుంది. థ్రిల్లింగ్ సందర్భాల్లో కూడా నవ్వు తెప్పించడం మా సినిమా ప్రత్యేకత. ఈ కథలో రియల్ ఇన్సిడెంట్స్ కొన్ని ఉన్నాయి. అయితే వాటికి ఫిక్షన్ జోడించి రూపొందించాను' అని తెలిపారు. 'ఎం.ఎస్.రాజు డైరెక్ట్ చేసిన 7 డేస్, 6 నైట్స్ మూవీకి మ్యూజిక్ చేశాను. సంగీత దర్శకుడిగా నాకు ఇది రెండో సినిమా. అన్ని ఎలిమెంట్స్ ఉన్న ఇలాంటి చిత్రానికి పని చేయటం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమాలో 3 సాంగ్స్ ఉంటాయి. ఒకటి సిద్ శ్రీరామ్ పాడారు. సాంగ్స్ చాలా బాగా వచ్చాయి. రెహమాన్ లిరిక్స్ అద్భుతంగా ఉన్నాయి' అని సంగీత దర్శకుడు సమర్థ్ గొల్లపూడి చెప్పారు.

ఆద్యంతం వినోదభరితం



ప్రియదర్శి

మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణ ప్రసాద్ నిర్మిస్తున్న సినిమా 'సారంగపాణి జాతకం'. ఇందులో ప్రియదర్శి సరసన తెలుగమ్మాయి రూప కొడువాయూర్ కథానాయికగా నటించారు. 'జెంటిల్‌మన్', 'సమ్మోహనం' వంటి విజయవంతమైన సినిమాల తర్వాత మోహనకృష్ణ ఇంద్రగంటి, శివలెంక కృష్ణప్రసాద్ కలయికలో రూపొందుతున్న హ్యాట్రిక్ చిత్రమిది. నిర్మాత శివలెంక కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, 'డిసెంబర్ 20న మా సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయబోతున్నాం. సెప్టెంబర్ మొదటి వారంలో చిత్రీకరణ అంతా పూర్తి చేశాం. ప్రస్తుతం డబ్బింగ్ కార్యక్రమాలు సైతం తుది దశకు చేరుకున్నాయి. అతి త్వరలో ఫస్ట్ కాపీ రెడీ అవుతుంది. సెన్సార్ కార్యక్రమాలు సైతం పూర్తి చేసి క్రిస్మస్ సెలవుల్లో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు వస్తాం. ఇటీవల కొన్ని సన్నివేశాలు, ఫుల్ రష్ చూశా. నాకు ఎంతో సంతృప్తి కలిగింది. మనిషి భవిష్యత్తు అతని చేతి రేఖల్లో ఉంటుందా? లేదా అతను చేసే చేతల్లో ఉంటుందా? అనే ప్రశ్నకు జవాబు ఇచ్చే ఓ పరిపూర్ణ హాస్యరస చిత్రమిది. మోహనకృష్ణ ఇంద్రగంటితో ఇంటిల్లిపాది నవ్వుకునే వినోదాత్మక తీస్తుండటం మాకు ఆనందంగా ఉంది. మా సంస్థలో ఇది గుర్తుండిపోయే సినిమా అవుతుంది' అని చెప్పారు.

భయపెట్టే ఘటికాచలం



నిఖిల్ దేవాదుల

నిఖిల్ దేవాదుల హీరోగా నటిస్తున్న సినిమా 'ఘటికాచలం'. ఈ చిత్రానికి కథను అందిస్తూ ఒయాసిస్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ పై ప్రొడ్యూసర్ ఎం.సి.రాజు నిర్మిస్తున్నారు. అమర్ కామెపల్లి దర్శకుడు.

ఈ సినిమాను వరల్డ్ వైడ్‌గా నిర్మాత ఎస్‌కేఎన్, డైరెక్టర్ మారుతి త్వరలోనే రిలీజ్ చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో జరిగిన టీజర్ లాంచ్ ఈవెంట్‌లో డైరెక్టర్ అమర్ కామెపల్లి మాట్లాడుతూ, 'ఈ సినిమా కాన్సెప్ట్‌ను యూఎస్‌లో ఉండే నా ఫ్రెండ్ రాజు చెప్పాడు. వాళ్లకు తెలిసిన వారి ఇంట్లో జరిగే కొన్ని ఘటనలు చెప్పాడు. 19 ఏళ్ల మెడికల్ స్టూడెంట్ లైఫ్‌లో జరిగిన కథ. మారుతికి ట్రైలర్ చూపించాను. ఆయనకు నచ్చి మూవీ చూశారు. ఆయనతోపాటు నిర్మాత ఎస్‌కెఎన్‌కీ సినిమా నచ్చి, మూవీని రిలీజ్ చేస్తున్నారు' అని అన్నారు.

'అమర్ ఎంత ఇంటెన్స్‌గా స్టోరీ నెరేట్ చేశారో, దాన్ని నా పర్‌ఫార్మెన్స్‌లో చూపించానని అనుకుంటున్నాను. కథలో ఎన్నో ట్విస్ట్‌లు, టర్న్‌లు ఉంటాయి. అవన్నీ మిమ్మల్ని ఆకట్టుకుంటాయి' అని హీరో నిఖిల్ దేవాదుల చెప్పారు. నిర్మాత ఎస్‌కెఎన్ మాట్లాడుతూ, 'ఈ సినిమా చూశాం. డైరెక్టర్ అమర్ ఒక పది సినిమాలు చేసినంత ఎక్స్‌పీరియన్స్ ఉన్న డైరెక్టర్‌లా మూవీ రూపొందించారు. నాకు హర్రర్ మూవీస్ చాలా ఇష్టం. భయపడినా ఇష్టపడుతూ హర్రర్ మూవీస్ చూస్తుంటా. మ్యూజిక్ డైరెక్టర్ సూపర్బ్‌గా మ్యూజిక్ ఇచ్చారు. హర్రర్ మూవీ ఇవ్వాల్సిన ప్రతి అనుభూతిని ఈ సినిమా ఇస్తుంది. ఈ సినిమా రిలీజ్ డేట్ త్వరలోనే అనౌన్స్ చేస్తాం' అని తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.